www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం

16-11-2024

సంపుటి : 01 | సంచిక : 194 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్





## ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టం

- ఓ ఆదివాసీ మహిళకు మా ప్రభుత్వం అత్యున్నత పదవిని ఇచ్చి గౌరవించింది
- పీఎం జన్‌మన్ యోజన పథకం ద్వారా పనుల ప్రారంభ ఘనత ఆమెదే
- ప్రధాని నరేంద్ర మోదీ



9

## రైళ్లలో ప్రమాదకర రీల్స్ చేస్తే కఠిన చర్యలు

- ప్రయాణికులకు ఇబ్బంది కలగించేవారిపై ఎఫ్ఐఆర్
- అన్ని జోన్లకు రైల్వే బోర్డు ఆదేశం

2



## అమిత్ షా హెలికాప్టర్, బ్యాగుల తనిఖీ

- మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ఈసీ చర్యలు
- ఎన్నికల వ్యవస్థకు సహకరించాలన్న హోం మంత్రి

2



# రాబందులా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి

### విలువైన భూములను తక్కువకే లాక్కుంటున్నారు

> “ సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే మాతో కొట్లాడు.. రాజకీయంగా తలపడు కానీ పేదలకు మాత్రం కష్టం కలిగించొద్దు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. లగచర్ల రైతులపై నమోదు చేసిన కేసులన్నీ రద్దు చేసి, వెంటనే వారిని జైళ్ల నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతులతో ములాఖత్ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

- ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగానే రైతుల పోరాటం
- అధికారులపై దాడికి పాల్పడిన వారిలో కాంగ్రెస్ వాళ్లూ ఉన్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు
- సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతులతో ములాఖత్

**విశ్వంభర, సంగారెడ్డి:**

కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రెడ్డి రాబందు మాదిరిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.లగచర్ల ఘటనలో కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేసి కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలనే జైల్లో వేశారని . అధికారులపై దాడికి పాల్పడ్డ వారిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉన్నారని ఆయన తెలిపారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతులతో కేటీఆర్ శుక్రవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తమ భూములు తమకే ఉండాలని లగచర్ల రైతులు పోరాడుతున్నారు. మార్కెట్‌లో ఎకరం రూ. 70 లక్షల విలువ ఉన్న భూములను అడ్డికి పావుశేరుకు రియల్ ఎస్టేట్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గుంజేసుకుంటుందని రైతులు చెబుతున్నారు. కేవలం ఎకరం భూమి రూ. 10 లక్షలకు గుంజేసుకుంటున్నారని రైతులు బాధపడుతున్నారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా రైతులు 9 నెలలగా పోరాటం చేస్తున్నారు. లగచర్ల, హకీంపేటతో పాటు మరో రెండు తండాల ఆడబిడ్డలు మిగతా2లో...

## తెలంగాణ శైవక్షేత్రం

- ఆ శివుని దయతో పాడిపంటలతో, ప్రజలు శాంతియుతంగా జీవిస్తున్నారు
- కోటి దీపోత్సవానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- ఉజ్జయిని మహాకాళేశ్వరుడికి హారతి సమర్పించిన సీఎం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ లోని ఎన్టీఆర్ గ్రౌండ్స్ లో కార్తీకమాసం సందర్భంగా ఏర్పాటు చేసిన కోటి దీపోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి సతీ సమేతంగా హాజరయ్యారు. కాగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీఎం దంపతులకు పండితులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం.. అక్కడే ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్తీక దీపాలను మిగతా2లో...

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫిర్యాదుల పెట్టెలు

- వాటిలోని వినతులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి
- హైకోర్టు ఆదేశం

2

## పట్నం నరేందర్ రెడ్డికి చుక్కెదురు

- ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని కోరుతూ పిటిషన్
- తిరస్కరించిన హైకోర్టు రిజిస్ట్రీ

**విశ్వంభర, హైదరాబాద్:**

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి దాఖలు చేసిన హౌజ్ మోషన్ పిటిషన్ తిరస్కరణకు గురైంది. చర్లపల్లి జైలులో తనను ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలంటూ హౌజ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫు మిగతా2లో...

## దేశాన్ని స్కిల్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

- గడిచిన పదేళ్లలో స్టార్టప్స్ సంస్థలు చాలా పెరిగాయి
- ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ పేమెంట్‌ల్లో 46 శాతం భారత్‌లోనే
- విద్యారంగంలో కృత్రిమ మేధ గొప్ప ప్రభావం చూపనుంది
- హైదరాబాద్ ఐఎస్‌బీలో ఇన్‌సైట్ ఫోరమ్ కార్యక్రమంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలు

**విశ్వంభర, హైదరాబాద్:** రానున్న మూడు నాలుగేళ్లలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. మనదేశంలో యువత ఎక్కువగా ఉన్నారని, గడిచిన పదేళ్లలో స్టార్టప్స్ సంస్థలు చాలా పెరిగాయని తెలిపారు. హైదరాబాద్ మిగతా2లో...





## ప్రేమికుల మధ్య రొమాన్స్ తప్పు కాదు

- ముద్దులు, కౌగిలింతలు చాలా సహజం
- లైంగికంగా వేధించాలని చేస్తే నేరం
- ఓ పిటిషన్‌లో మద్రాసు హైకోర్టు తీర్పు

2

## భారత సాంస్కృతిక ఏకత్వాన్ని చాటి చెప్పేలా లోక్‌మంథన్

### హైదరాబాద్‌లో ఈ నెల 21నుంచి 24 వరకు వేడుకలు

- స్టాల్స్ ప్రారంభించనున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతుల మీదుగా సదస్సు ప్రారంభం
- హాజరుకానున్న ఆర్ ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్
- వివిధ అంశాలపై చర్చలు, వందలాది ప్రదర్శనలు
- లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు
- వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- విజయవంతం చేయాలని వినతి



**విశ్వంభర, హైదరాబాద్:** భారతీయ సంస్కృతి, సాంస్కృతిక ఏకత్వాన్ని చాటి చెప్పే అంతర్జాతీయ మహోత్సవంగా దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిసారి హైదరాబాద్‌లో లోక్‌మంథన్ కార్యక్రమం జరుగనుందని కేంద్ర మంత్రి, ఆహ్వాన కమిటీ గౌరవ అధ్యక్షుడు మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## రాజ్యాంగాన్ని ఒక్కసారి కూడా చదవని మోదీ

- చదవలేదు కాబట్టే అందులో ఏం లేదంటున్నారు
- రాజ్యాంగం భారతదేశ ఆత్మ అని గ్రహించాలి
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ

2



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 90 | ₹ 112 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 162 | ₹ 185 |

## రాజకీయ కుట్రతోనే కులగణనపై అపోహలు

- కుల గణన సర్వే ఎవరికీ వ్యతిరేకం కాదు
- సర్వేలో బ్యాంకు ఖాతా వివరాలు అడగట్లేదు
- కులం వివరాలు చెప్పడం ఇష్టం లేకుంటే 999 ఆప్షన్ ఉంటుంది
- మంత్రి పొన్నం ప్రభాకర్

2



## హైదరాబాద్‌లో అలెగ్రో మైక్రో సిస్టమ్స్ ఏర్పాటు

- 500 మందికి ఉద్యోగావకాశాలు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో పెట్టబడులకు అంతర్జాతీయ కంపెనీలు ముందుకొస్తున్నాయి
- మంత్రి శ్రీధర్‌బాబు



2

# భారత సాంస్కృతిక ఏకత్వాన్ని చాటి చెప్పేలా లోక్‌మంథన్

(మొదటి పేజీ తరువాయి)
జి. కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని పర్యాటక్ భవన్ (టూరిజం ప్లాజా)లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డితో పాటు లోక్‌మంథన్ ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి, ప్రజ్ఞాప్రవాహ్ జాతీయ కన్వీనర్ జె.నందకుమార్ మాట్లాడారు. నవంబర్ 21న ప్రతినిధుల నమోదు కార్యక్రమం ఉంటుందని, పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ద్వారా ఎగ్జిబిషన్, సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభిస్తారని కిషన్‌రెడ్డి తెలిపారు. 22న లోక్‌మంథన్ కార్యక్రమాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్‌సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్‌తో పాటు ఆచార్య మిథిలేష్, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సహా వివిధ రంగాల ప్రముఖులు విచ్చేస్తున్న హైదరాబాద్ లోక్‌మంథన్‌కు ప్రతి ఒక్కరూ విచ్చేసి భారతీయ సాంస్కృతిక వైభవాన్ని అనుభవించి, ఆస్వాదించాలని కోరారు.

**నాలుగు రోజుల పాటు ఆలోచనా మథనం**

దేశానికి సంబంధించి, దేశ సాంస్కృతిక వారసత్వానికి సంబంధించి, దేశ ప్రజల జీవన విధానానికి సంబంధించి ప్రపంచంలోని ప్రముఖులను పిలిచి చర్చించి ఒక ఆలోచనా మథనం చేసే ఒక కార్యక్రమంగా ప్రతి రెండేళ్లకొకసారి లోక్ మంథన్ నిర్వహిస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది హైదరాబాద్ లోని శిల్పకళావేదిక (శిల్పారామం)లో నవంబర్ 21 నుంచి 24 వరకు 4 రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి జాతీయ భావజాలం గలవారు, వందలాది కళాకారులు, మేధావులు, విద్యావేత్తలు, కవులు, కళాకారులు, విదేశాల నుంచి కూడా పలువురు ప్రతినిధులు సహా అన్ని వర్గాలవారు పాల్గొంటారని చెప్పారు. సాగర మథనం జరిగినట్టుగా నేటి సమస్యలపై సెమినార్లు, కళా ప్రదర్శనల ద్వారా లోక్ మంథన్ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ మహోత్సవంలో అడవులు, గిరులలో నివసించే వనవాసీలు, మైదాన ప్రాంతాల్లో జీవించే బంజారాల వంటి అందరూ పాల్గొంటారన్నారు. వనవాసి, గ్రామవాసి, నగరవాసి... అందరూ కలిస్తేనే భారత్ వాసి అవుతామని లోక్‌మంథన్ ఉద్దేశాన్ని వివరించారు. కులం, భాషలు, ఇంకా అనేక రకాలుగా ప్రజల్ని విభజించే దుర్మార్గపు పరిస్థితులున్న నేటి సమయంలో రాజకీయాలకు అతీతంగా జాతీయ భావజాలంతో వందలాది సంస్థలకు చెందినవారి భాగస్వామ్యంతో ఈ లోక్ మంథన్ జరగనుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం, ప్రపంచ సమస్యలపై చర్చ, పరిష్కారానికి ఆలోచనా విధానాన్ని ఏర్పాటు చేసుకోవడం, అందుకు కావలసిన వ్యవస్థను నిర్మించుకోవడం దీని ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు.
నేడు భగవాన్ బిర్సాముండా జయంతి సందర్భంగా ఈ రోజును జాతీయ గిరిజన గౌరవ దినంగా పాటించాలన్న భారత ప్రభుత్వ నిర్ణయాన్ని కిషన్ రెడ్డి గుర్తు చేస్తూ లోక్‌మంథన్ వేడుకలో గిరిజనుల చేతివృత్తుల కళారూపాలు, కళా ప్రదర్శనలు ప్రదర్శిస్తారని, ఇక్కడ ఏర్పాటు చేసే స్టాల్స్‌లో అనేక ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు, ప్రజలకు సైతం తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే కార్యక్రమం ఉంటుందన్నారు. వందకు పైగా సాంస్కృతిక కార్యక్రమాలు, 1000 మందికి పైగా కళాకారులతో సంప్రదాయ సంగీత వాయిద్యాలు, పనిముట్ల ప్రదర్శనలు ఉంటాయన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల బస్తీ ప్రజలు, గిరిజనులు, ఐటీ రంగం సహా అన్ని వర్గాల ప్రజలు కూడా వచ్చేలా అందరినీ అహ్వానిస్తున్నామని, లక్షలాది మంది వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని కిషన్ రెడ్డి వివరించారు. లోక్‌మంథన్ వేడుకలు గతంలో భోపాల్, రాంచీ, గౌహతిలోనూ జరిగాయని తెలిపారు.

**కశ్మర్ నుంచి కన్యాకుమారి వరకు వృత్తులు, కళాకారుల ప్రదర్శనలు**

మన సాంస్కృతిక ఏకత్వాన్ని చాటి చెప్పేందుకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ వివిధ వృత్తులు, రంగాలకు చెందిన కళాకారులు వస్తుండగా.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాంస్కృతిక భారతీయ వారసత్వానికి చెందినవారు కూడా వచ్చి ప్రదర్శనలిస్తారని నందకుమార్ తెలిపారు. ఉదాహరణకు ఇండోనేషియా కళాకారులు రామాయణం ఆధారంగా ప్రదర్శించే కేచక్ నృత్య ప్రదర్శన ఉంటుందని, ప్రపంచంలో అబ్రహామిక్ మతాలకు పూర్వమున్న మతాలు, సంస్కృతుల వారు సైతం లోక్‌మంథన్‌కి విచ్చేస్తున్నారని, వీరిలో సిరియాలోని రోమోలు, ఆర్మేనియాలోని యజిదీలు (సూర్యపుత్రులు), లిథువేనియా వాసులు సైతం ఉన్నారని నందకుమార్ వివరించారు. అబ్రహామిక్ మతాల రాకకు పూర్వం ఆ దేశాలలో అచరించిన, నేటికీ ఆచరిస్తున్న సూర్యారాధన, హవన విధానాలను వీరు హైదరాబాద్ లోక్‌మంథన్‌లో చేసి చూపిస్తారన్నారు. లోక్‌మంథన్ ఎగ్జిబిషన్స్‌లో భాగంగా తెలంగాణ, త్రిపుర, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ సహా 10 రాష్ట్రాలకు చెందిన విభిన్న సంస్కృతులు, కళలు, చిత్రాల ప్రదర్శన, సంప్రదాయ ఆహారం, సంప్రదాయ క్రీడలు, సాహిత్యం, చర్చలు ఉంటాయని తెలియజేశారు. లోక్‌మంథన్ ఉత్సవం జరిగే నాలుగు రోజులూ శిల్పారామంలోకి ప్రజలందరికీ ఉచిత ప్రవేశం కల్పించేందుకు సంబంధిత శాఖ అంగీకారం తెలిపిందని నందకుమార్ వివరించారు.

### ఏకత్వాన్ని చాటిచెప్పాల్సిన అవసరం ఉంది

లోక్‌మంథన్ వేడుకకు సంబంధించి లోక్‌మంథన్ ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి, ప్రజ్ఞాప్రవాహ్ జాతీయ కన్వీనర్ జె.నందకుమార్ మాట్లాడుతూ "లోక్" అంటే ఏదో ఒక వర్గానికి మాత్రమే పరిమితమైన మాట కాదని, అది మన దేశపు ప్రాథమిక సంస్కృతికి సంబంధించినదని అన్నారు. వేర్వేరు సంస్కృతులున్నప్పటికీ అంతర్గతంగా భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్న భారతదేశంలో నేడు కొన్ని శక్తులు ప్రజల్లో చీలికలు తెచ్చి విద్వేష భావాన్ని నింపుతున్నాయని, అందువల్ల మరొకసారి ఏకత్వాన్ని చాటిచెప్పాల్సిన అవసరముందని అన్నారు. ఇప్పటికీ వలసపాలన ప్రభావంలోనే ఉన్న మన భావజాలాన్ని దాని నుంచి విముక్తి చెయ్యడం తొలి బాధ్యతగా ఉందంటూ లోక్‌మంథన్ వేదికగా మేధావులు, కార్యాచరణశీలురు కలసి ఈ దిశగా కృషి చేస్తారని తెలిపారు. లోక్ అవలోకన్ ప్రధాన అంశంగా లోక్ విచార్ (ప్రకృతి, సాంస్కృతిక సంబధమైన ఆలోచనా ప్రక్రియ), లోక్ వ్యవహార్ (సంప్రదాయాలు - ఆచరణ), లోక్ వ్యవస్థ (సంస్థలు-వ్యవస్థలు) అనే మూడు ఉప అంశాలతో లోక్‌మంథన్ ఉత్సవం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా లోక జీవనదృష్టి, లోక జీవన విజ్ఞానం, లోక సాహిత్యం, లోక అర్థశాస్త్రం, భారతీయ లోక చేతనలో పర్యావరణం, లోక సురక్ష-న్యాయం, లోక సర్వసమావేశీ వ్యవస్థ తదితర అంశాలపై సదస్సులు ఉంటాయన్నారు. ప్రత్యేకించి మన భావితరాలైన విద్యార్థులు, యువతరం దృష్టి సారించేలా లోక్‌మంథన్ రూపకల్పన జరిగిందన్నారు.

# పట్నం నరేందర్ రెడ్డికి చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)
న్యాయవాది ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రీకి పిటిషన్‌ను సమర్పించారు. నేరస్థులు ఉండే బ్యారక్‌లో పట్నం నరేందర్ రెడ్డిని ఉంచారంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అయిన పట్నం నరేందర్ రెడ్డిని ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని ఆయన తరపు న్యాయవాది హౌజ్ మోషన్ పిటిషన్‌లో కోరారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు రిజిస్ట్రీ తిరస్కరించారు. ప్రస్తుతం నరేందర్ రెడ్డి చర్లపల్లి జైలులో ఉన్న సంగతి తెలిసిందే. హైకోర్టులో నరేందర్‌రెడ్డి క్వాష్ పిటిషన్ : మరోవైపు తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ లగచర్ల ఘటనలో ఏ1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ శాసనసభ్యుడు పట్నం నరేందర్‌రెడ్డి గురువారం హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ప్రభుత్వాధికారులపై రాళ్ల దాడి కేసులో చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా



ఉన్న నరేందర్ రెడ్డి, తన న్యాయవాదులు ద్వారా కోర్టుకు అఫిడవిట్ పంపించారు.
''బుధవారం ఉదయం కేబీఆర్ పార్క్ వద్ద మార్నింగ్ వాక్ చేస్తున్న టైమ్‌లో నన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బలవంతంగా కారులో ఎక్కించి వికారాబాద్ జిల్లా డీటీసీకి తీసుకెళ్లారు. ఆ సమయంలో పోలీసులు నా స్టేట్‌మెంట్ అసలు తీసుకోలేదు. కేవలం కోర్టులో హాజరుపరిచే 10 నిమిషాల ముందు కొన్ని పేపర్లపై నా సంతకాలు తీసుకున్నారు. నన్ను అక్రమంగా ఈ దాడి కేసులో ఇరికించారు. అరెస్టుకు ముందు నాకు ఎలాంటి నోటీసులు జారీ చేయలేదు. బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా ఇతర ముఖ్యనేతల అదేశాలతో దాడులు చేయించినట్లు పోలీసులు కట్టుకథ చెప్పారు. నేను పోలీసులకు ఎలాంటి స్టేట్ మెంట్ ఇవ్వలేదు. రిమాండ్ నివేదికలో పోలీసులు చెప్పినవన్నీ నిజం కాదు. నా వాంగ్మూలాన్ని పరిగణనలోకి తీసుకొని విచారణ చేయాలి'' అని కోర్టుకు పంపించిన అఫిడవిట్‌లో పట్నం పేర్కొన్నారు. మరోవైపు నరేందర్‌రెడ్డిని 7 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు వికారాబాద్ జిల్లా కోర్టులో పిటిషన్ సైతం దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ జరగనుంది.

# రాబందులా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)
రోదిస్తున్నారు.ఫార్మా కంపెనీలు కాలుష్యమని ఆయన ప్రచారం చేశారు. అదే ఫార్మాను కొడంగల్ తెస్తా.. 3 వేల ఎకరాలు రావాలని పేదల భూములు గుంజుకుంటున్నారు. దీంతో స్థానిక రైతులు మర్లబడ్డారు. 9 నెలలుగా పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. అధికారుల ముందు నిరసన తెలిపితే దాడుల పేరిట అరెస్టులు చేసి జైల్లో వేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇవాళ లగచర్లలో దుర్మార్గమైన పరిస్థితి నెలకొని ఉంది. కులగణనలో పాల్గొని వచ్చిన పంచాయతీ సెక్రటరీని కూడా అరెస్టు చేసి జైల్లో వేశారు. ఆ సంఘటనలో పాల్గొనలేదు.. అయినా తనను జైల్లో వేశారని ఆ యువకుడు చెబుతున్నాడు. ఇంకో యువకుడు వనపర్తిలో చదవుకుంటున్నాడు. ఈ ఘటన గురించి తెలుసుకుని మా ఇంటి వాళ్లు ఎలా ఉన్నారో అని వస్తే నన్ను కూడా తీసుకెళ్లారని చెప్పారు. 70 మందిని అరెస్టు చేసి రెండు డీసీఎంలలో తీసుకెళ్లారని చెప్పారని కేటీఆర్ తెలిపారు. దుద్యాల మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ అనుచరులు కూడా ఈ దాడుల్లో పాల్గొన్నారు. వారి భూములు కూడా ఈ ఫార్మా విలేజ్‌లో పోతున్నాయి. రమేశ్, నర్సింహులు, రాములు అనే కాంగ్రెస్ కార్యకర్తలు కూడా దాడులు చేశారు. 70 మందిని తీసుకెళ్తే.. తిరుపతి రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారట. బీఆర్ఎస్ వాళ్లు 21 మందిని రిమాండ్‌కు పంపి.. మిగతా వారిని ఇంటికి పంపించచారట. కేవలం బీఆర్ఎస్ వాళ్లనే మాత్రమే జైల్లో పెట్టాలని అనుముల తిరుపతి రెడ్డి ఆదేశాలు ఇచ్చారట. ఎలాంటి పదవి లేని తిరుపతి రెడ్డికి అధికారులు, పోలీసులు మోకరిల్లుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

**రేవంత్.... దమ్ముంటే మాతో కొట్లాడు.. పేదలకు మాత్రం కష్టం కలిగించొద్దు**

సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే మాతో కొట్లాడు.. రాజకీయంగా తలపడు కానీ పేదలకు మాత్రం కష్టం కలిగించొద్దు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీ కేసీఆర్ పెడితే రేవంత్ వాళ్ల కుటుంబ సభ్యుల కోసం మార్చారు. లగచర్లతో పాటు సంగారెడ్డి జిల్లా న్యాలకల్‌లో కూడా రైతులు పోరాటం చేస్తున్నారు. కేసీఆర్ మీకు అండగా ఉంటారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొంటాం.. ఈ ప్రభుత్వానికి తప్పకుండా పేదవాడి ఉసురు తగుల్తుంది. 30, 40 కిలోల బరువు లేని పిల్లలు కలెక్టర్‌పై హత్యాయత్నం చేశారని కేసులు పెట్టడానికి మనసు ఎలా ఒప్పింది రేవంత్ రెడ్డి..? చేతనైతే మాతో కొట్లాడు. రాజకీయంగా మాతో తలపడు. పేదలకు కష్టం కలిగించొద్దు. ఈ కేసులన్నీ రద్దు చేసి రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను. రైతులకు, పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. గర్భిణి అయిన జ్యోతిని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రేపు హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తుంది. పేద వర్గాలకు అండగా నిలబడడమే బీఆర్ఎస్ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫిర్యాదుల పెట్టెలు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫిర్యాదులు, వినతులు సమర్పించడానికి ప్రత్యేకంగా ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఫిర్యాదులు, వినతులపై రిజిస్ట్రార్ లేదా ఆపై ఉన్నతాధికారి పరిశీలించి విచారణ చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంచడానికే ఈ మార్గదర్శకాలు జారీ చేశామని హైకోర్టు తెలిపింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయకపోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ ఎన్.వి శ్రవణకుమార్ విచారణ చేపట్టారు. 'అక్టోబరు 11న ఫ్లాట్ రిజస్ట్రేషన్ చేయాలంటే సబ్ రిజిస్ట్రార్, కార్యాలయం సిబ్బంది ముడుపులు




డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి పిటిషనర్ ఫోన్‌లోని వాట్సాప్ సంభాషణను పరిశీలించాలి' అని పిటీషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు లక్ష్మణ్ రెడ్డి, సాయిలతో పాటు డాక్యుమెంట్ రైటర్ రూ.2 లక్షలు డిమాండ్ చేశారన్నారు.
హైకోర్టు ఆదేశాల మేరకు కోర్టుకు హాజరైన జాయింట్ సబ్ రిజిస్ట్రార్ వివరణ ఇస్తూ రిజిస్ట్రేషన్‌కు పిటిషనర్ ఎలాంటి దరఖాస్తును సమర్పించలేదన్నారు. డాక్యుమెంట్ సమర్పించలేదని, అందువల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టలేదనడానికి ఎలాంటి ఆధారాలు లేవని, ఇది వాస్తవదూరమని తెలిపారు. పిటిషనర్ చెబుతున్న అక్టోబరు 11న తాను సెలవు పెట్టానని, 10న జిల్లా రిజిస్ట్రార్ ధ్రువీకరించిన సర్టిఫికెట్‌ను సమర్పించారు. ఈ వాదనలను విన్న న్యాయమూర్తి పిటిషనర్ తాజాగా సమర్పించే డాక్యుమెంట్‌ను పరిశీలించి వారంలోగి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పనుల మీద వచ్చే వారి కోసం ఫిర్యాదు విభాగం ఏర్పాటు చేయాలని ఇది వరకే మార్గదర్శకాలు ఇచ్చామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు స్టాంపులు రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాలను కింది స్థాయి అధికారులు అమలు చేయడంలేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

# రైళ్లలో ప్రమాదకర రీల్స్ చేస్తే కఠిన చర్యలు

**న్యూఢిల్లీ:** రైల్వే ప్రాంగణాలు, కదులుతున్న రైళ్లలో ప్రమాదకర రీల్స్ చేస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రైల్వే బోర్డు అన్ని జోన్లకు సూచించింది. రైల్వే ట్రాక్‌లు, కదులుతున్న రైళ్లలో ప్రమాదకర స్టంట్‌లు చేస్తూ వీడియోలు చిత్రీకరిస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రైల్వే కార్యకలాపాలకు ముప్పు, ప్రయాణికులకు అసౌకర్యం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు రైల్వే బోర్డు సిద్ధమైంది. ''కొందరు ఆకతాయిలు అన్ని హద్దులు దాటారు. రైల్వే ట్రాకులపై వస్తువులు పెట్టడం, వాటిపై వాహనాలు నడపడం, కదులుతున్న రైళ్లలో ప్రమాదకరంగా స్టంట్లు చేయడం వంటి చర్యలతో వాళ్ల ప్రాణాలను పణంగా పెట్టడమే కాకుండా వందల మంది రైలు ప్రయాణికుల భద్రతను ప్రమాదంలో పడేస్తున్నారు'' అని ఓ సీనియర్ రైల్వే అధికారి పేర్కొన్నారు. రైళ్లకు దగ్గరగా వచ్చి సెల్ఫీలు తీసుకుంటూ చనిపోతున్న ఘటనలు ఎన్నో చూస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే నిబంధనలు అతిక్రమిస్తూ రీల్స్ చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్పీ పోలీసులకు రైల్వే బోర్డు సూచించినట్లు సమాచారం. జైపుర్ డివిజన్‌లో ఇటీవల రైల్వే ట్రాకుపై ఓ ఎస్‌యూవీ నడిపిస్తూ స్టంట్లు చేస్తున్న వారిపై ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో పోస్టు చేసేందుకుగాను యువకులు వీడియోలు చిత్రీకరిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గూడ్స్ రైలు లోకో పైలట్ అప్రమత్తతో ప్రమాదం తప్పగా.. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చెన్నైలో కొందరు కాలేజీ విద్యార్థులు రైల్లో ప్రమాదకరంగా ఫుట్‌బోర్డు ప్రయాణం చేయడమే కాకుండా రైల్వే స్టేషన్‌లో గందరగోళం సృష్టించిన విషయం వెలుగులోకి వచ్చింది. రైలుపైకి ఎక్కేందుకు ప్రయత్నించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందుకు సంబంధించి పది మంది విద్యార్థులపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. ఈ తరహా అనేక వీడియోలు వెలుగులోకి వస్తుండడంతో కఠిన చర్యలకు ఉపక్రమిస్తోన్న రైల్వే బోర్డు.. అటువంటి వారిపై కేసులు నమోదు చేయాలని అన్ని జోన్లకు సూచించింది.

# అమిత్ షా హెలికాప్టర్, బ్యాగుల తనిఖీ

**ముంబై:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయాణించిన హెలికాప్టర్‌ను ఎన్నికల అధికారులు చెక్ చేశారు. అందులో ఉన్న ఆయన బ్యాగులను తనిఖీ చేశారు. మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం హింగోలి అసెంబ్లీ నియోజకవర్గంలో అమిత్ షా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణించిన హెలికాప్టర్‌ను, అందులోని బ్యాగులను ఎన్నికల కమిషన్ (ఈసీ) అధికారులు తనిఖీ చేశారు. కాగా, అమిత్ షా ట్వీట్ ద్వారా ఈ విషయాన్ని తెలిపారు. 'ఈ రోజు మహారాష్ట్రలోని హింగోలి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికల అధికారులు నా హెలికాప్టర్‌ను తనిఖీ చేశారు. నిష్పక్షపాత, ఆరోగ్యకరమైన ఎన్నికల విధానాన్ని బీజేపీ విశ్వసిస్తుంది. ఎన్నికల సంఘం రూపొందించిన అన్ని నిబంధనలను అనుసరిస్తుంది' అని అందులో పేర్కొన్నారు. మరోవైపు ఎన్నికల వ్యవస్థకు మనమంతా సహకరించాలని, భారతదేశాన్ని ప్రపంచంలోనే బలమైన ప్రజాస్వామ్యంగా ఉంచడంలో మన బాధ్యతలను నిర్వర్తించాలని అమిత్ షా తెలిపారు. హెలికాప్టర్‌ను, బ్యాగులను ఈసీ అధికారులు తనిఖీ చేసిన వీడియోను ఆయన షేర్ చేశారు.

# ప్రేమికుల మధ్య రొమాన్స్ తప్పు కాదు

**చెన్నయ్:** ప్రేమ జంటల మధ్య ముద్దులు, కౌగిలింతలు సహజమేనని అది నేరం కాదని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ చర్యలను సెక్షన్ 354 ఎ (1)(i) కింద నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. అయితే లైంగికంగా వేధించాలనే ఉద్దేశంతో అలాంటి చర్యలకు పాల్పడితే మాత్రం నేరమే అవుతుందని పేర్కొంది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు.. ఓ యువకుడిపై నమోదైన లైంగిక వేధింపుల కేసును కొట్టివేసింది. కోర్టు నివేదికల ప్రకారం.. సదరు యువకుడు 2020 నుంచి 19 ఏళ్ల యువతితో రిలేషన్‌షిప్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో ఓ రోజు అతడు యువతిని ఓ చోటకు రమ్మని పిలిచాడు. అక్కడ వారిద్దరూ చాలాసేపు గడిపిన తర్వాత ఆమెను ముద్దాడి, కౌగిలించుకున్నాడు. ఆ తర్వాత ముఖం చాటేయడంతో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. తనను పెళ్లి చేసుకోవాలని యువకుడిని కోరింది. అయితే ఆమె ప్రతిపాదనను తిరస్కరించిన యువకుడు.. ఆమెకు దూరమయ్యేందుకు ప్రయత్నిస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. తర్వాత కేసు కోర్టు దాకా వెళ్లింది. ఈ కేసుపై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్ ఆనంద్ వెంకటేశ్.. యువకుడి చర్యలకు సెక్షన్ 354 ఎ (1)(i) వర్తించదని స్పష్టంచేసింది. ప్రేమికుల మధ్య ఆలింగనాలు, చుంబనాలు సహజమేనని, ఈ కేసులో క్రిమినల్ ప్రోసీడింగ్స్‌కు అనుమతిస్తే చట్టాన్ని దుర్వినియోగపరిచినట్టేనని తీర్పు ఇచ్చింది.

# రాజ్యాంగాన్ని ఒక్కసారి కూడా చదవని మోదీ

**ముంబయి:** ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని ఒక్కసారి కూడా చదవకపోవడంవల్లే రెడ్ బుక్‌లో ఏం లేదని, ఖాళీ అని అంటున్నారని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నదుర్బార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. తన చేతిలో రెడ్ బుక్ (రాజ్యాంగ ప్రతి) ఉండటాన్ని అర్బన్ నక్సలిజం అంటూ బీజేపీ నేతలు చేస్తోన్న వ్యాఖ్యలపై ఆయన ధ్వజమెత్తారు. రాజ్యాంగం భారతదేశ ఆత్మ అనే విషయాన్ని మోదీ గ్రహించాలని సూచించారు. బిర్సా ముండా, మహాత్మా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ తదితర మహనీయుల స్ఫూర్తి రాజ్యాంగంలో ఉందని తెలిపారు. రాజ్యాంగంలో ఏం లేదని అంటే ఆ మహనీయులను అవమానించినట్టేనని అన్నారు. బీజేపీ, ఆరెస్సెస్‌లు ఆదివాసీలను వనవాసీలని పిలుస్తూ గిరిజనులను అవమానిస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. గిరిజనులు అడవికే పరిమితం కావాలనేది బీజేపీ ఆలోచన అని విమర్శించారు. దేశంలో ఆదివాసీలు, దళితులు, బీసీలు ఎంతమంది ఉన్నారో తెలియాలంటే కుల గణన చేపట్టాల్సిందేనని పునరుద్ఘాటించారు. ఆదివాసీలు, దళితులు, బీసీలకు రాజ్యాధికారం ఉండాలనేది తన లక్ష్యమని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం తాను ప్రాణ త్యాగానికి కూడా సిద్ధమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు.

# తెలంగాణ శైవక్షేత్రం

(మొదటి పేజీ తరువాయి)
సీఎం రేవంత్ రెడ్డి వెలిగించారు.. స్వామివారిని దర్శించుకున్న రేవంత్, ఉజ్జయిని మహాకాళేశ్వరుడికి హారతి సమర్పించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ శైవ క్షేత్రం అన్నారు. ఆ శివుని దయతో పాడిపంటలతో, ప్రజలు శాంతియుతంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచంలోని భక్తులందరికీ భక్తిని పంచుతున్నందుకు ఈ కార్యక్రమ నిర్వహకులను అభినందిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమ స్ఫూర్తితో వారిని ఆదర్శంగా తీసుకొని.. తాము రాష్ట్రవ్యాప్తంగా అన్ని గుళ్ళలో కార్తీక దీపోత్సవాలు నిర్వహిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలియ జేశారు.

# దేశాన్ని స్కిల్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)
ఐఎస్‌బీలో జరిగిన ఇన్‌సైట్ ఫోరమ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''ప్రతి ఏడాది ఇక్కడికి వచ్చి కొత్త విషయాలు నేర్చుకోవాలని ఉంది. ఇక్కడ చదువుకునేవారి అభివృద్ధికి ఐఎస్‌బీ కృషి చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ పేమెంట్‌ల్లో 46 శాతం భారత్‌లోనే జరుగుతున్నాయి. 2047 వరకు భారత్‌కు అమృతకాలం. దేశాన్ని ప్రథమ స్థానంలో ఉంచడమే లక్ష్యంగా కేంద్రం పని చేస్తోంది. జాతీయ విద్యా విధానం సమగ్ర జ్ఞానఖనిగా ఉండబోతోంది. పరిశోధన కేంద్రంగా విద్యా విధానం ఉండాలి. సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన అనేవి జ్ఞానసముపార్జనలో కీలకంగా మారాయి. దేశాన్ని స్కిల్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. ప్రధానమంత్రి సడక్ యోజన ద్వారా రోడ్లకు మహర్దశ వచ్చింది. విద్యారంగంలో కృత్రిమ మేధ గొప్ప ప్రభావం చూపనుంది'' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో అలెగ్రో మైక్రో సిస్టమ్స్ ఏర్పాటు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన వాతావరణం ఉందని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పలు అంతర్జాతీయ కంపెనీలు ముందుకువస్తున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అంతర్జాతీయ సెమీకండక్టర్ల కంపెనీ అలెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్‌లో పరిశోధనాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి ముందుకువచ్చిందని మంత్రి చెప్పారు. ఈమేరకు ఆ కంపెనీ సీఈఓ వినీత్ బృందం.. సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిసింది. పలు ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీలకు సెమీ కండక్టర్లు సరఫరా చేస్తున్నట్లు అలెగ్రో ప్రతినిధులు మంత్రికి వివరించారు. పెట్టుబడిదారులకు సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ముందుంటుందని మంత్రి వెల్లడించారు. అలెగ్రో పరిశోధనాభివృద్ధి సంస్థ ఏర్పాటుతో 500 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు.

# రాజకీయ కుట్రతోనే కులగణనపై అపోహలు

**విశ్వంభర, హైదరాబాద్:** కుల గణన సర్వే ఎవరికీ వ్యతిరేకం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని దోభిఘాట్ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఇక్కడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దోభిఘాట్ గ్రౌండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పారు. కులగణన సర్వేలో బ్యాంకు ఖాతా వివరాలు అడగట్లేదని స్పష్టం చేశారు. కులం వివరాలు చెప్పడం ఇష్టం లేకుంటే 999 ఆప్షన్ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే 30 శాతం కులగణన సర్వే పూర్తయిందని తెలిపారు. సర్వేలో ఎలాంటి అపోహలు వద్దన్నారు. రాజకీయ కుట్ర చేసేవారే వీటిని సృష్టిస్తున్నారని చెప్పారు. కులగణన సర్వే వల్ల కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టవచ్చని పొన్నం ప్రభాకర్ తెలిపారు.


# కేంద్ర మంత్రులలో సీఎం చంద్రబాబు భేటీ

- **ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ తో పలు అంశాలపై చర్చ**

ఢిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. రాజధాని అమరావతికి ప్రపంచబ్యాంకు, ఏడీబీ ఇస్తున్న రూ.15వేల కోట్ల రుణం తదితర అంశాలపై ఆర్థిక మంత్రితో చంద్రబాబు చర్చించినట్టు సమాచారం. నిర్మలా సీతారామన్‌తో భేటీ ముగిసిన తర్వాత విదేశాంగశాఖ మంత్రి జై శంకర్‌తో సీఎం సమావేశమయ్యారు.

# శ్రీశైలంలో కార్తీక పౌర్ణమి సంబురాలు

- కిటకిటలాడిన శ్రీగిరి పురవీధులు
- పాతాళగంగలో భక్తుల పుణ్య స్నానాలు
- కృష్ణమ్మకు దీప దానాలు...చీరసారె సమర్పణ



**విశ్వంభర, శ్రీశైలం :** శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సంబరాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి వివిధ ప్రాంతాల యాత్రికులతో క్షేత్ర పురవీధులు కిటకిటలాడాయి. పాతాళగంగలో పుణ్య స్నానాలు చేసుకుని కృష్ణమ్మకు దీప దానాలు చీరసారెలను సమర్పించుకున్నారు. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఉభయ దేవాలయాల్లో అలంకార దర్శనాలు మాత్రమే కల్పించినప్పటికీ సుమారు మూడు గంటలకుపైగా దర్శన సమయం పట్టింది. క్షేత్రపరిధిలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో యాత్రికులు కూడా సహకరించాలని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ కోరారు. సాయంత్రం పౌర్ణమి సందర్భంగా వచ్చిన యాత్రికులు.. ఆలయంలో జరిగే ప్రత్యేక కార్యక్రమాలను వీక్షించి స్వామివార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లలో బారులు దీరారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భ్రమరాంబదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ఊయలసేవ మరియు పల్లకిసేవ కార్యక్రమాలను జరిపించారు. అమ్మవారికి ప్రీతికరమైన వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఊయలలో వేంచేబుచేసి మహా సంకల్పము, ఖడ్గమాల, అష్టోత్తర శతనామావళితో కుంకుమార్చన చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా పాతాళగంగ వద్ద నెలకొల్పిన కృష్ణవేణి నదీమతల్లి విగ్రహానికి ప్రత్యేక పూజలను డిప్యూటీ ఈవో రవణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

అనంతరం సాంప్రదాయబద్ధంగా కృష్ణమ్మకు పసుపు కుంకుమ గాజులతో చీరసారెలను సమర్పించి గంగ హారతులను ఇచ్చారు. అర్చక వేదపండితుల మంత్రోచ్చారణతో ఏక హారతి, నేత్ర హారతి, బిల్వహారతి, నాగహారతి, పంచహారతి, పుష్పహారతి, నందిహారతి, సింహహారతి, నక్షత్రహారతి, విష్ణుహారతి, కుంభహారతులతో ఏకాదశ గంగా హారతులను నివేదించారు. పౌర్ణమి ప్రదోషకాలంలో ఆలయ ప్రధాన వీధిలో గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంప్రదాయంగా దాతలు అందించిన నూలువత్తులను ఆవునెయ్యితో తడిపి ఎత్తైన స్తంభాలపై వేలాడించి దీప ప్రజ్వలన చేశారు. త్రిపురాసురుణ్ని సంహరించిన తరువాత పరమేశ్వరునికి దృష్టి దోష పరిహారం కోసం, విజేయుడైన శుభవేళలో పార్వతీ దేవి తొలుతగా జ్వాలాతోరణం జరిపించినట్లు పురాణ ఇతిహాసాల ప్రవచనాలను భక్తులు ఆద్యంతం వింటూ దీప కాంతులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో తోపాటు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్తీక మాసంలో పౌర్ణమి సందర్భంగా ఆలయ పుష్కరిణి వద్ద స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దశవిధ హారతులు ఇచ్చారు. అనంతరం లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికుల ప్రతి ఒక్కరూ కార్తీక దీపాలను వెలిగించుకునే అవకాశాన్ని కల్పించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.



వీ3 న్యూస్ కరస్పాండెంట్ ఏలే మహేష్ పుట్టిన రోజు సందర్భంగా వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక కార్యాలయంలో శుక్రవారం కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్మన్ డా. కాచం సత్యనారాయణ, డైరెక్టర్ కాచం సాయి, వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక సిబ్బంది బ్యూరో చీఫ్ పోతుగంటి వెంకటరమణ, సీనియర్ సబ్ ఎడిటర్ బీమనపల్లి శివప్రసాద్, చీఫ్ డిజైనర్ రేవూరి మహేందర్, వీ3 న్యూస్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, డిజైనర్ రవి, సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపకుడు డా. యర్రమాద కృష్ణారెడ్డి.

\- విశ్వంభర, హైదరాబాద్

# తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, కేశంపేట :** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు పల్లాటి సురేందర్, తాలూకా అధ్యక్షుడు పంది వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండల కేంద్రంలో బీఎస్‌వై గార్డెన్‌లో శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ముఖ్యనాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లాటి సురేందర్, పంది వెంకట్రాంరెడ్డిలు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్యత కోసం ఈ నెల 19న మంగళవారం ఉదయం 10 గంటలకు ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ సమ్మేళనాన్ని తెలంగాణ ఉద్యమకారులు పార్టీలకతీతంగా హాజరు కాగలరని ఎలాంటి భేషజాలకు పోకుండా అందరం ఆత్మీయంగా కలుసుకొని మన బాగోగులు మంచి చెడులు మాట్లాడుకోవాలని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీల కొరకు కలసి పనిచేయడం కోసం ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు పోచారం జగన్ రెడ్డి, మంచే వెంకటయ్య, కుంటి లక్ష్మయ్య, జెట్టూరి జైపాల్ రెడ్డి, మురళీమోహన్, బైకని శేఖర్, కృష్ణయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గాడిద పాల పేరిట ఘరానా మోసం

- భారీగా డిపాజిట్లు తీసుకుని ఎగవేత
- తమిళనాడు ముఠా నిర్వాకం
- రూ.100 కోట్లు నష్టపోయామన్న బాధితులు



**విశ్వంభర, హైదరాబాద్:** గాడిదపాల ఉత్పత్తి, లాభాల పేరుతో ఆశ చూపి ఔత్సాహిక రైతులను నమ్మించి తమిళనాడుకు చెందిన ఓ ముఠా మోసం చేసింది. ఫ్రాంచైజీ మోడల్‌లో గాడిద పాలు తీసుకొని ఓ సంస్థ దాదాపు రూ.100 కోట్ల వరకు ఎగవేసిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధిత రైతులు తమ గోడు వెలిబుచ్చారు. చైన్నైలోని డాంకీ ప్యాలెస్ ఫ్రాంచైజీ గ్రూపు సభ్యులు తమను నమ్మించి నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"కొవిడ్ నేపథ్యంలో బహుళ పోషకాలు, రోగ నిరోధక శక్తి ఇచ్చే గాడిద పాలకు డిమాండ్ ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో అవి చూసి సంప్రదించాం. డాంకీ ప్యాలెస్ మిస్టర్ బాబు ఉలగనాథన్ ఆధ్వర్యంలో గిరి సుందర్, బాలాజీ, సోనికరెడ్డి, డాక్టర్ రమేశ్ బృందం సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒక్క రైతు వద్ద రూ.5లక్షలు తీసుకున్నారు. ఒక్కో పాడి గాడిదను రూ.80వేల నుంచి రూ.1.50లక్షల చొప్పున విక్రయించారు. ఆ గాడిదల నుంచి ఉత్పత్తి చేసిన పాలు లీటరు రూ.1600 చొప్పున సేకరిస్తామని ఒప్పందం చేసుకున్నారు. 3 నెలల పాటు నమ్మకం కలిగించేలా నగదు చెల్లించారు. గత 18 నెలలుగా డాంకీ ప్యాలెస్‌కు సరఫరా చేసిన పాల డబ్బులు, నిర్వహణ ఖర్చులు, షెడ్ నిర్మాణం, సిబ్బంది జీతాలు, వెటర్నరీ చికిత్స ఖర్చులు ఇవ్వడం లేదు.

దీనిపై ప్రశ్నిస్తే ఒక్కొక్కరికీ రూ.15 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు బ్యాంకు చెక్కులు రాసిచ్చారు. అవి బ్యాంకులో వేస్తే బౌన్స్ అయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు 400 మందికి పైగా రైతులు మా లాగా రూ.100 కోట్ల వరకు నష్టపోయారు. ఇదో పెద్ద కుంభకోణం. దీని వెనుక రాజకీయ పెద్దల హస్తం ఉండొచ్చు. ఈ విషయంపై చెన్నై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసులు పట్టించుకోలేదు. ఒప్పందం సందర్భంగా ఇచ్చిన జీఎస్‌టీ సంఖ్య, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ కూడా నకిలీవేనని తేలింది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకుని న్యాయం చేయాలి. లేని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యం" అని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.

# రిజిస్ట్రేషన్‌ల నిలిపివేత అప్రజాస్వామికం

### ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

**విశ్వంభర, మల్కాజిగిరి:** రిజిస్ట్రేషన్‌ల నిలిపివేత అప్రజాస్వామ్యమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వక్ఫ్ బోర్డు భూములని కొన్ని సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్‌లను నిలిపివేయడంలో ప్రజలలో గందరగోళం ఏర్పడిందన్నారు. కొన్ని దశాబ్దాలుగా అన్ని రకాల ప్రభుత్వ పన్నులు కట్టి 40 గజాలు, 50 గజాలు, 100 గజాలలో పేదలు ఇండ్లు కట్టుకుని నివసిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్‌లు, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాయి. పేదల కోసం వక్ఫ్ బోర్డు కొన్ని సవరణలు చేయాల్సి ఉందని, లేదంటే ప్రజల పక్షాన నిలబడి వారికి చట్ట బద్దంగా న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని అన్నారు. వక్ఫ్ బోర్డు తమ భూమిఅని చెబుతున్న సర్వే నంబర్ 398, 399లో దాదాపు 20ఎకరాల ఖాళీగా ఉన్న భూమి రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22ఎ నిషేధిత జాబితాలో ఉన్న ఆ ఖాళీ భూమిని తమదంటూ ఇతరులు స్థానిక పోలీసుల సహకారంతో కబ్జాలో ఉన్నారని అన్నారు. ఈ భూమిని కాపాడాల్సిన వక్ఫ్ బోర్డు సీఈఓ, జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఆడిటర్ (వక్ఫ్), మూతవాలి వక్ఫ్ బోర్డు చట్టం సెక్షన్ 52ఎ కింద కేసులు నమోదు చేయడంలో విఫలమయరన్నారు. ఇప్పటికైనా ఆ భూమిని కాపాడాలని, కబ్జా చేసిన వారిపై వక్ఫ్ బోర్డు చట్టం సెక్షన్ 52ఎ కింద పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పేద ప్రజల కోసం న్యాయపరంగా ఏ సాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు.

### మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్‌లో

# సభ్యులను నియమించాలి

### సీఎంకు లేఖ రాసిన సుపరిపాలన వేదిక అధ్యక్షుడు


**విశ్వంభర, హైదరాబాద్:** మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్ చైర్మన్, సభ్యల నియామకంపై సుపరిపాలన వేదిక అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. 2016లో ట్రైబ్యునల్ ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు నియామకాలు లేవన్నారు. చైర్మన్, సభ్యులను నియమించకపోవడంపై హైకోర్టు సైతం తీవ్ర అగ్రహం వ్యక్తం చేసినట్లు గుర్తు చేశారు. కొంతమంది బిల్డర్లు అక్రమ కట్టడాలు చేపట్టి అమాయకులకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లను కొనుగోలు చేసి సామాన్యులు మోసపోతున్నారన్నారు. అక్రమ కట్టడాల నిరోధానికే మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 8 ఏళ్ల క్రితమే ట్రైబ్యునల్‌లో నియామకాలు ఏర్పాటు చేసి ఉంటే ఈ స్థాయిలో నిర్మాణాలు వెలిసేవి కావన్నారు. తక్షణమే మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్ చైర్మన్, సభ్యులను నియమించాలని సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పద్మనాభరెడ్డి కోరారు.












# భావి పరిశోధకులకు దిక్సూచి

## నల్లగొండ సమగ్ర స్వరూపం గ్రంథం

> తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన చరిత్రను పునర్నిర్మాణం చేసుకోవాల్సిన అవశ్యకత ఏర్పడింది. వలసవాదుల వలన తెర మరుగైన మన వైభవాన్ని ముందు తరాలకు అందించవలసిన గురుతర బాధ్యతను తెలంగాణ సారస్వత పరిషత్ భుజానికి ఎత్తుకుంది. జిల్లాల వారి సమగ్ర స్వరూపాలను వెలువరించడం ద్వారా తెలంగాణ సంపూర్ణ మూర్తిమత్వాన్ని ఆవిష్కరించవచ్చని తలచింది. ఈ నేపథ్యంలోనే 33 జిల్లాల సమగ్ర స్వరూపాలకు శ్రీకారం చుట్టింది దాదాపు 90 శాతం పైగా ఆ పనిని పూర్తి చేసింది. ఇది మనం అనుకున్నంత తేలికైన విషయాలు కాదు. క్షేత్రస్థాయిలో లోతైన పరిశోధనతో రాయగలిగిన వ్యాసకర్తలను గుర్తించి వారు రాసిన వ్యాసాలను ఎడిట్ చేసి గ్రంథాలుగా వెలువరించడం ఒక యూనివర్సిటీ చేయదగిన పనిని అతి తక్కువ మానవ వనరులు ఉన్న తెలంగాణ సారస్వత పరిషత్ చేస్తుండడం అభినందనీయం.దీనికోసం పరిషత్ రథసారథులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, జుర్రు చెన్నయ్య శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే సుమారు 450 పేజీలతో నల్లగొండ సమగ్ర స్వరూపం గ్రంథాన్ని రూపొందించింది. ఈ పుస్తక నిర్మాణం కోసం జిల్లా స్థాయిలో కన్వీనర్ గా సాగి కమలాకర శర్మ, కమిటీ సభ్యులుగా డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సాగర్ల సత్తయ్య, డాక్టర్ బండారు సుజాత శేఖర్, శ్రీ పున్న అంజయ్య, డాక్టర్ బిన్నూరి మనోహరి లతో కమిటీని ఏర్పాటు చేసి జిల్లాలో వ్యాసాలు రాయవలసిన అంశాలను గుర్తించడం, ఆ వ్యాసాలను రాయడానికి సమర్థులైన వ్యాసకర్తలను ఎంపిక చేసుకోవడం కోసం అనేక పర్యాయాలు సమావేశాలు నిర్వహించడం జరిగింది.

ఇక పుస్తకం విషయానికి వచ్చినట్లయితే నల్లగొండకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వం అనవచ్చు. నూతన జిల్లాల విభజన తరువాత జిల్లాల నైసర్గిక స్వరూపం మారింది. ఈ నేపథ్యంలో నూతన నల్లగొండ జిల్లా నైసర్గిక స్వరూపం ఎల్లలను వివరిస్తూ డాక్టర్ కనకటి రామకృష్ణ రాసిన వ్యాసం విజ్ఞానదాయకంగా ఉంది. మొదటినుంచి నల్గొండ జిల్లా రాజకీయపరంగా ఎంతో చైతన్యవంతమైంది. తొలి సార్వత్రిక ఎన్నికల్లోనే దేశంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన రావి నారాయణరెడ్డి మొదలు నేటి వరకు జిల్లాను ఎంతో ప్రభావితం చేసిన మన జిల్లా రాజకీయ నాయకులను గురించి తెలుసుకోవాలంటే నర్రా లవేందర్ రెడ్డి రాసిన నల్లగొండ జిల్లా ప్రజా ప్రతినిధులు వ్యాసం చదవాల్సిందే. రాష్ట్ర రాజకీయాలలో నల్లగొండ జిల్లాది కీలక స్థానం. అనేక రాజకీయ సంక్షోభాల సమయంలో ఇక్కడి రాజకీయ నాయకులు కీలక భూమిక పోషించారు. ఈ నేపథ్యాలను ప్రముఖ చరిత్రకారులు దామరాజు సూర్య కుమార్ జిల్లా రాజకీయ చరిత్ర అనే వ్యాసంలో సవివరంగా తెలియజేశారు.నల్లగొండ కు ఆ పేరు ఎలా వచ్చింది అనే అంశంపై ఆసక్తికరమైన వ్యాసం రాశారు కన్నెగంటి వెంకటరమణ. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో శాసనాలు అనగానే గుర్తొచ్చే పేరు డాక్టర్ బి.ఎన్ శాస్త్రి. శాస్త్రి గారి వారసురాలిగా శాసనాలను అధ్యయనం చేస్తున్న డాక్టర్ బిన్నూరి మనోహరి నల్లగొండ జిల్లా శాసనాలపై సాధికారికమైన వ్యాసం రాశారు. నల్లగొండ జిల్లా పర్యాటక క్షేత్రాలలో చెప్పుకోదగ్గది పానగల్లు. ఛాయా సోమేశ్వరాలయం విశిష్టతను గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. పానగల్లు విశేషాలను గురించి కన్నెగంటి వెంకటరమణ రాసిన వ్యాసం ద్వారా అనేక నూతన విషయాలను పాఠకులు తెలుసుకోగలుగుతారు.

నల్లగొండ జిల్లా కనగల్లు ప్రాంతానికి చెందిన మరింగంటి కవులు తెలంగాణ రాష్ట్రం నలుమూలల వ్యాపించి తెలుగు సాహిత్యాన్ని ఎలా సుసంపన్నం చేశారో మరింగంటి కవుల సాహిత్య సేవపై పరిశోధన చేసిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శ్రీ రంగాచార్య రాసిన వ్యాసం సాహిత్య విద్యార్థులకు పరిశోధకులకు ఉపయుక్తంగా ఉన్నది. తెలంగాణ అనేక ప్రక్రియలకు పుట్టినిల్లు. వృషాధిప శతకం మొదలు నేటి వర్తమాన కవుల వరకు రాసిన వేలాది శతకాలు ఈ నేలపై నుండి వచ్చాయి. శతక సాహిత్యంలో నల్లగొండ ప్రస్థానాన్ని డాక్టర్ సాగర్ల సత్తయ్య తన వ్యాసంలో వివరించారు. యక్షగానాలపై పరిశోధన చేసిన డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య నల్లగొండ జిల్లా యక్షగానాలపై సప్రమాణమైన వ్యాసాన్ని అందించారు. గతంలో అలుగెల్లిన పాట పేరుతో పాటపై పరిశోధనా వ్యాసాలను అందించిన ప్రజావాగ్గేయకారుడు అంబటి వెంకన్న నల్లగొండ జిల్లా పాట ప్రస్థానాన్ని తమ వ్యాసంలో వివరించారు. నల్లగొండ జిల్లా ఆధునిక కవిత్వం పై పరిశోధన చేసిన డాక్టర్ బకరం నరసింహ రాసిన నల్లగొండ జిల్లా అభ్యుదయ కవిత్వం అనే వ్యాసం పరిశోధకులకు మార్గదర్శకంగా ఉంది.

నల్లగొండ జిల్లా అనేక అస్తిత్వ ఉద్యమాలకు పుట్టినిల్లు. దళిత బహుజన కవిత్వ ఉద్యమాలకు ఈ నేల ఊపిరిలూదింది. డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి నేతృత్వంలో బహువచనం సంకలనంతో తెలుగు నేల అంతటా దళిత బహుజన అస్తిత్వ కవిత్వం ఉద్యమ స్ఫూర్తిని పొందింది. ఈ నేపథ్యంలో ప్రముఖ కవి, కథా రచయిత భూతం ముత్యాలు దళిత బహుజన కవిత్వ ప్రస్థానాన్ని తన వ్యాసంలో ఆవిష్కరించారు.

మైనారిటీ అస్తిత్వ ఉద్యమానికి కూడా నల్లగొండ కేంద్ర బిందువుగా నిలిచింది. స్కైబాబా నేతృత్వంలో వచ్చిన జల్ జలా వంటి సంకలనాలు తెలుగు సాహిత్యంలో సంచలనం సృష్టించాయి. ఈ నేలపై నుండి అనేకులు మైనారిటీ వాద సాహిత్యాన్ని సృజించారు. జిల్లా ముస్లింవాద సాహిత్యం పై స్కైబాబా రాసిన వ్యాసం సాహిత్యంలోని మరో పార్శ్వాన్ని తెలియజేస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నల్లగొండ జిల్లా కాంట్రిబ్యూషన్ ఎంతో గొప్పది. ఇక్కడి కవులు కళాకారులు ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి రాష్ట్ర సాధనలో కీలక భూమిక వహించారు. ఈ నేపథ్యంలో మలి తెలంగాణ పోరులో నల్లగొండ కవుల పాత్రను కస్తూరి ప్రభాకర్ తన వ్యాసం ద్వారా పట్టి చూపారు. విప్లవోద్యమ నిర్మాణంలోనూ నల్లగొండ కీలక భూమికనే పోషించింది. నల్లగొండ జిల్లాలోని విప్లవ సాహిత్యాన్ని గురించి పెరుమాళ్ళ ఆనంద్ రాసిన వ్యాసం విజ్ఞానదాయకంగా ఉంది.

కథా సాహిత్యంలో నల్లగొండది ఒక ప్రత్యేక స్థానం. తెలుగులో తొలి కథ జన్మించింది ఈ నేలపైనే. బండారు అచ్చమాంబ మొదలు నేటి వర్తమాన కథకుల వరకు నల్లగొండ కథా చరిత్రను సవివరంగా అందించారు ప్రముఖ కథారచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి.

తెలుగు నేలపై నవలకు కూడా బీజాలు పడింది నల్లగొండలోనే. తడక మళ్ల కృష్ణారావు మొదలు నేటి వర్తమాన నవల రచయితల వరకు నల్లగొండ నవలా చరిత్రను వివరించారు డాక్టర్ మద్దిరాల సత్యనారాయణ రెడ్డి. నల్లగొండ జిల్లా జానపద కళారూపాలపై ఆసక్తికరమైన వ్యాసం అందించారు పలస వెంకటేశ్వర్లు. నల్లగొండ జిల్లా గిరిజన సాహిత్యం, గిరిజన సాహిత్యం పై వచ్చిన పరిశోధన పై సాధికారిక వ్యాసం అందించారు ఆచార్య సూర్యా ధనుంజయ్. నల్లగొండ ఆశ్రిత కులాల సాహిత్యం పై పి హంసమ్మ వ్యాసం పరిశోధనాత్మకంగా ఉంది. నల్లగొండ జిల్లా స్త్రీల సాహిత్యం పై డాక్టర్ దీపిక సమగ్ర వ్యాసాన్నిరాశారు.

ప్రముఖ బాలసాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి జిల్లా బాల సాహిత్యం పై, ప్రముఖ కవి పున్న అంజయ్య నల్లగొండ జిల్లా పత్రిక రంగంపై డాక్టర్ ఉప్పల పద్మ నల్లగొండ పర్యాటక రంగంపై నల్లగొండ జిల్లా జాతరలు ఉత్సవాలపై డాక్టర్ మద్దిరాల సత్యనారాయణ రెడ్డి రాసిన వ్యాసాలు చదివించేవిగా ఉన్నాయి.నల్లగొండ జిల్లా దేవాలయాలపై డాక్టర్ సాగి కమలాకర్ శర్మ రాసిన వ్యాసం పాఠకులకు మిక్కిలి ఆసక్తిని కలిగిస్తుంది. రెండవ భద్రాద్రిగా పేరొందిన రామగిరి రామాలయం చరిత్రను నేటి తరానికి కొత్తగా పరిచయం చేశారు కన్నెగంటి వెంకటరమణ. జిల్లాలోని సాహిత్య సంస్థలను గురించి పున్న అంజయ్య రాసిన వ్యాసం జిల్లాలో సాహిత్య చైతన్యానికి ప్రతీకగా నిలిచింది.వీరు రాసిన సినిమా రంగం - నల్లగొండ అనే మరో వ్యాసం కూడా అనేక కొత్త విషయాలను తెలియజేస్తున్నది.

బతుకమ్మ పాటలపై పరిశోధన చేసిన తొలి పరిశోధకురాలు డాక్టర్ బండారు సుజాత శేఖర్ బతుకమ్మ పాటలపై రాసిన వ్యాసం ఆసక్తికరంగా ఉంది. సినిమా సాహిత్యం పై విమర్శ వ్యాసాలతో జాతీయ ఉత్తమ విమర్శకులుగా పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ ఎం పురుషోత్తమాచార్య నల్లగొండ జిల్లా సంగీత, నృత్య కళా వికాసం పై గొప్ప వ్యాసాన్ని అందించారు.

నల్లగొండ జిల్లా గ్రామ నామాలపై సప్రమాణమైన సాధికారికమైన పరిశోధన చేసి ఇటీవల దివంగతులైన డాక్టర్ మండల స్వామి నల్లగొండ జిల్లా గ్రామ నామాలు ఆధారాలు లోకోక్తులపై గొప్ప వ్యాసాన్ని అందించారు. నల్లగొండ తొలి వీడియో సినిమా తపస్విని పై చాలామందికి తెలియని కొత్త విషయాలను పరిచయం చేశారు అవంచ ప్రమోద్ కుమార్. వీరు రాసిన ఏడు దశాబ్దాల చరిత్రకు సజీవ సాక్ష్యం టౌన్ హాల్, నల్లగొండ విద్యా వికాసం వ్యాసాలు కూడా అత్యంత ఆసక్తికరంగాపాఠకులను చదివించే విధంగా ఉన్నాయి. నాగార్జునసాగర్ విజయపురిపై తూపురాని వెంకట కృష్ణమాచార్యులు వ్యాసం రాశారు.

దేశవ్యాప్తంగా ప్రతిరోజు పాఠశాలల్లో లక్షలాది మంది పిల్లలు చదివే ప్రతిజ్ఞ నల్లగొండ జిల్లా అన్నెపర్తి గ్రామానికి చెందిన పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించడం మనందరికీ గర్వకారణం. ఈ నేపథ్యాన్ని మధు వాకిటి తన వ్యాసం ద్వారా వివరించారు. నల్లగొండ క్రీడాకారులు క్రీడా సౌకర్యాలను గురించి వ్యాయామ విద్యలో సహాయ ఆచార్యులు కదారి మల్లేశం రాసిన వ్యాసం, నల్లగొండ ప్రముఖులను గురించి వివిధ రచయితలు రాసిన వ్యాసాలు ఆసక్తికరంగా ఉన్నాయి. నల్లగొండతో నా జ్ఞాపకాలు అంటూ సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన వ్యాసం నల్లగొండ కొన్ని దశాబ్దాల చరిత్రను మనం ముందు ఉంచుతుంది. ఐతిహ్యాలు కల్పనలా? వాస్తవాలా? అంటూ జిల్లా ఐతిహ్యాలపై పరిశోధన చేసిన డాక్టర్ రాపోలు శ్రీనివాస్ రాసిన వ్యాసం బాగుంది.

ఇట్లా ఈ బృహత్ గ్రంథములో 43 సాధికారికమైన వ్యాసాలకు చోటు లభించింది. ప్రతి సాహిత్య విద్యార్థి వద్ద, పరిశోధకుల వద్ద, నల్లగొండ నేలను ప్రేమించే ప్రతి వ్యక్తి వద్ద తప్పక ఉండవలసిన పుస్తకం ఇది. ఈ వ్యాసాలు భావి పరిశోధకులకు దిక్సూచి అనడంలో సందేహం లేదు.




- సాగర్ల సత్తయ్య
7989117415

# కానరాని మీడియా స్వేచ్ఛ

## నేడు జాతీయ పత్రికా దినోత్సవం




ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా రంగం కష్టకాలంలో ఉంది. భారత దేశంలో ప్రతి సంవత్సరం నవంబరు 16 వ తేదీన జాతీయ పత్రికా దినోత్సవం జరుపుకుంటారు. 1956లో భారత తొలి ప్రెస్ కమిషన్ సిఫార్స్ మేరకు 1966 నవంబర్ 16 వ తేదీన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 16వ తేదీన జాతీయ పత్రికా దినోత్స-వాన్ని జరుపుకుంటున్నారు. భారత దేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్ కౌ-న్సిళ్ళు ఉన్నాయి. అయితే భారతదేశ కౌన్సిల్ కు ఉన్న ప్రత్యేకత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించే అవకాశం లభించడమే. అనేక సంవత్సరాలు-గా ప్రెస్ కౌన్సిల్ పత్రికా రంగానికి ఎదురయ్యే సవాళ్లు, సమస్యల గురించి ప్రతి నవంబరు 16న సెమినార్లు నిర్వహిస్తోంది. ఇక అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికల్ కు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కా-పాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినంగా మే 3వ తేదీని ప్రకటిం-చింది కూడా. మీడియాకు స్వేచ్ఛ ఎండ మావే అవుతున్నది. మే 3వ తేదీ "ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం", నవంబరు 16న "భారత పత్రికా దినం". ఇలా ఎన్ని దినోత్స వాలు జరిపినా పరి-స్థితులలో మార్పు రాకపోవడం విచారకరం. స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చు కొనేవి. తరువాత దేశ మీడియాలో ఆ గీత చెరిగి-పోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభి-స్తున్నాయి. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్థం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడపు తున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే, కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తా-యి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తు-న్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనేం లేకపోతేనేం. నేడు మీడియా సంస్థ-లను డబ్బులు సంపాదించే పెట్టుబడిదారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేదు. సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ము కోవ-టానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కార-ణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేతల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. లొంగని వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయతాలు చేయడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతు-న్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తు-న్నాం. ఫోర్త్ ఎస్టేటుగా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్ గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సి వస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగి పోయింది. ఒకరి ప్రయోజ-నాలను ఇంకొకరు కాపాడుకుంటున్నారు. కొందరు రాజకీయ నేతలు స్వయంగా మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారంలో వున్నపుడు దానిని అడ్డు పెట్టుకొని లాభాలు సం-పాదించటం, ప్రతిపక్షంలో వున్నపుడు వాటినే పెట్టుబడిగా పెట్టి నిలుపుకోవటం గతంలో జరు-గుతున్నదే. ఇప్పుడు రాజకీయ నేతలు, వారి కనుసన్నలలో మెలిగే మీడియా సంస్థలు ఎక్కడ అధికారం వుంటే ఆ వైపే చేరటం రివాజుగా మారింది. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించ టంతో పత్రికా స్వేచ్ఛ హరించుకుపోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నాయన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బీజేపీ వాటితో జట్టుకట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సారును అమలు జరు-పుతున్నాయి. వారికి ఇష్టం లేని వార్త అసలు రాక పోవటం లేదా కనిపించీ కనిపించకుండా ఒక మూలన పడవేయటమో జరుగుతోంది. తమ వి-ధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలకు ప్ర-కటనలు నిలిపి వేయటం, టీవీ ఛానల్స్ అయితే కేబుల్ నిర్వాహకులను బెదిరించి ఛానల్స్ ప్రసారాలను అడ్డు కోవటాన్ని చూస్తున్నాం. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనా వార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తు తున్నాయి. నిజం మూడు అడుగులు వేసే లోగా అబద్ధం ముప్పై అడుగుల ముందు వుంటోంది. అవన్నీ ఒక పథకం ప్రకారమే వెలువడు తున్నాయి. ఏది నిజమో ఏది కాదో తెలుసు కోలేని గంద-రగోళంలో జనాన్ని పడ వేసేందుకు, నిజాన్ని కూడా ఒక పట్టాన నమ్మకుండా చేసేకుట్ర దీనిలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న గోబెల్స్ ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమై కూర్చుం-టుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటు లోకి రావటంతో గోబెల్స్ వికటాట్టహాసం చేస్తున్నారు. వెనుకా ముందూ చూడకుండా వాట్సప్, ఫేస్బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమా-చారాన్ని ప్రతి ఒక్కరూ ఇతరుల మీద ఎత్తిపో-స్తున్నారు. అవాస్తవాలు, వక్రీకరణలు ప్రచారం చేస్తూ, నకిలీలను నిజమైనవిగా చిత్రించటం మనకు నిత్యం అనుభవైక వేద్యమే. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు కూడా ఇందుకు తమవంతు తోడ్పాటును అందిస్తున్నాయి. అందువలన నిజమైన వార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ అంటే జనం కూడా గందర గోళానికి గురి అవుతున్నారు. మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్ కౌన్సిల్ ఏర్పడింది. ఆ రోజును జాతీయ పత్రికా దినంగా పాటిస్తూ 1997 నుంచి ప్రెస్ కౌన్సిల్ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. స్వే-చ్ఛాయుతమైన, జవాబుదారీ తనంతో కూడిన దిగా మీడియా వుండాలనే లక్ష్యాన్ని ప్రకటిం-చారు. ఆచరణలో స్వేచ్ఛను హరించే వారిని, అడ్డగోలుగా వ్యవహరించే మీడియా సంస్థలనూ సరైన దారిలో పెట్టటం దాని లక్ష్యం.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494



# ఛాయా సోమేశ్వరాలయంలో ఆ నీడ ఓ మిస్టరీ

## 8వందల ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన ఆలయం

ఛాయా సోమేశ్వరాలయం.. ఇదో మిస్టరీ టెంపుల్. శివునికి అత్యంత సుందరమైన ఆలయాలలో ఒకటి. 1200 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది.ఈ ఆలయం యొక్క ప్రత్యేకత ఏమిటంటే - సూర్యో-దయం, సూర్యాస్తమయంతో సంబంధం లేకుండా విగ్రహంపై ఎల్లప్పుడూ రాతి స్తంభం నీడ ఉంటుంది, ఈ ఆలయం గర్భగుడి ముఖద్వారం ముందు రెండు స్తంబాలున్నా.. అన్నివేళలా ఒకే నీడ పడుతుంది. వెలుతురు ఉన్నంతసేపు ఆ నీడ కదలకుండా ఒకే స్థానంలో ఉండటం ఈ ఆలయం ప్రత్యేకత. కానీ రహస్యం ఏమిటంటే, ఈ ఆలయం పడమర దిక్కున ఉన్న గర్భగుడిలో ఉన్న శివలింగం మీదుగా ఈ నీడ కనిపిస్తుంది. సూర్యుడి గమనం మారినా ఆ నీడలో ఎలాంటి మార్పు రాదు. సాధారణంగా 'నీడ' అనేది వెలుతురుకు వ్యతిరేకంగా పడుతుంది. కానీ, ఈ నీడ సూర్యుడి వెలుతురుతో పనిలేకుండా ఒకే చోట స్థిరంగా కనిపిస్తుంది.ఆ నీడ ఏ వస్తువుదనే విషయం ఇప్పటికీ అంతు చిక్కలేదు. దేవతపై పడిన ఛాయ పవిత్ర గది ముందు చెక్కబడిన స్తంభాలలో ఒకదాని నీడలా కనిపిస్తుంది. ఆలయంలోని రెండు స్తంబా-ల్లో ఒకదాని నీడై ఉండొచ్చని భావించినా.. ఒకే నీడ రెండు స్తంబాలకు మధ్యలో ఉండే గర్భగుడిలోని విగ్రహం వెనుక వైపు పడుతోంది. దీంతో ఈ నీడ దేనిదనేది అంతు చిక్కని ప్రశ్నగా మారింది.ఆ ఆల-యంలోని మూడు గర్భ గుడులు కూడా ఒకేరీతిగా ఉంటాయి. అయితే, పడమటి గర్భగుడిలో మాత్రమే ఈ నీడ కనిపిస్తుంది. భక్తులంతా ఇది దేవుడి మాయ అని నమ్ముతారు. ఈ ఆలయ శిల్పి.. గర్భగుడి-లో పడే నీడకు.. సూర్యుడి కాంతితో పనిలేకుండా పగటి వేళల్లో వెలుతురు మాత్రమే ఉపయోగపడేలా ఆలయాన్ని నిర్మించినట్లు భావిస్తున్నారు.ఈ మర్మ-మైన నీడ ఆలయానికి పెద్ద ఆకర్షణ. గర్భగృహానికి ముందు ఉంచిన బహుళ స్తంభాల ద్వారా కాంతి ప్రతిబింబం ద్వారా చీకటి ప్రాంతం ఏర్పడుతుంది. నీడ ఆ నాలుగు స్తంభాల ఏకీకృత నీడ. ఆలయం-లోని స్తంభాలు రోజంతా ఒకే చోట కాంతి పడేలా వ్యూహాత్మకంగా ఏర్పాటు చేశారు. అయితే, ఈ నీడ ఎలా ఏర్పడుతుందనేది ఇప్పటికీ మిస్టరీనే. భారతీయ వాస్తు శాస్త్రం గొప్పతనానికి నిదర్శనంగా నిలిచే ఈ ఆలయం నల్లగొండలోని పానగొల్లులో ఉంది. మి-స్టరీగా పడే నీడ (తెలుగులో ఛాయ) ఏర్పడటం రోజంతా శివలింగం యొక్క ప్రధాన దేవతపై పడు-తుందని నమ్ముతారు కాబట్టి ఈ ఆలయానికి ఛాయా సోమేశ్వర ఆలయం అని పేరు వచ్చింది. సుమారు 800 ఏళ్ల కిందట 11-12 శతాబ్దాలలో కందూరు చాళుక్య ప్రభువైన ఉదయ భానుడనే రాజు ఈ ఆల-యాన్ని నిర్మించినట్లు సమాచారం. ఈ ఆలయం త్రికూటాలయంగా మూడు గర్భాలయాలతో ప్రసిద్ధి పొందింది. ఛాయా సోమేశ్వరాలయాన్ని త్రికూ-టాలయం అంటారు. ఈ అద్భుతమైన ఆలయం, దాని వాస్తుశిల్పుల యొక్క అద్భుతమైన సృజనాత్మక ఆలోచన, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని తెలియజేస్తుంది. ఈ ఆలయంలో ముగ్గురు దేవతలు ఉన్నారు - బ్రహ్మ, విష్ణు మరియు శివుడు మూడు వేర్వేరు దిశలను ఎదుర్కొంటున్న సాధారణ మహామండపం ద్వారా కలుపుతారు. ఈ ఆలయం అద్భుతమైన శిల్పకళ , కళాకృతిని కూడా ప్రదర్శిస్తుంది. ఈ ఆలయం వాస్తుశిల్పానికి ప్రసిద్ధి చెందింది.ఆలయ స్తంభాలు రామాయణం, మహాభారతంలోని ఘట్టాల శిల్పంతో చాలా వివరంగా అలంకరించబడ్డాయి. ఈ ప్రాంతం నుండి సేకరించిన అనేక శిల్పాలు పచ్చల సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన మ్యూజి-యంలో భద్రపరచబడ్డాయి. మ్యూజియంలో భద్రప-రచబడిన కొన్ని పురాతన శివలింగాలు యెల్లేశ్వరం అనే గ్రామం నుండి సేకరించబడ్డాయి, ఇది పానగల్ గ్రామంలోని శ్రీ ఛాయా సోమేశ్వర ఆలయానికి 1.2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పచ్చల రామలింగేశ్వర ఆలయ నిర్మాణ సమయంలో మునిగిపోయిన మరొక అద్భుతమైన ప్రదేశం.హైదరాబాదుకు సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లగొండలోని పానగ-ల్‌లో ఈ ఆలయం ఉంది. హైదరాబాద్ నుంచి రైలు, బస్సు సేవలు అందుబాటులో ఉన్నాయి.

## బేస్ బాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక





విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల ఆదర్శ పాఠశాల విద్యార్థులు అండర్ 17 జేఎన్ఎస్ కు ఎంపికయ్యారు. హనుమకొండలో జరిగిన బేస్ బాల్ సెలక్షన్ లో ముగ్గురు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి ఈ నెల 16 నుండి 18 వరకు నిర్మల్ లో జరిగే బేస్ బాల్ పోటీలకు మన విద్యార్థులు వెళ్లడం అభినందనీయం అని ప్రిన్సిపాల్ నవీన్, ఉపాధ్యాయుల బృందం అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు బేస్ బాల్ పోటీలలో మంచి విజయం సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీఎస్‌జేయు



విశ్వంభర, భూపాలపల్లి: భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన సందర్భంగా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ టీ.ఎస్.జే.యు(ఎన్ యూజే ఐ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,జిల్లా నాయకులు బండారి రాజు,కనుకుల దేవేందర్ లు శ్రీ కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీరాములు, జంగయ్యలను సన్మానించిన మాజీ జడ్పీటీసీ



విశ్వంభర, కడ్తాల్: కడ్తాల్ మండలంలోని అనుమాసు పల్లి గ్రామానికి చెందిన సిల్వేరు శ్రీరాములు, కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన గోరేటి జంగయ్యలు ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సంపాదించారు. వారిని జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ తరపున ట్రస్ట్ ఛైర్మన్, కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ పూలమాలతో సన్మానించారు. ఈరోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం అంటే అంత ఈజీ కాదని దాని వెనక వారు పడిన శ్రమ చాలా గొప్పదని, కుటుంబంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం వస్తే ఆ ఫ్యామిలీ మొత్తం అభివృద్ధి చెందినట్టేనని తెలిపారు. కాబట్టి ఉద్యోగం సంపాదించిన వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, లక్ష్మణాచారి, వెంకటేష్, కర్ణాకర్, రాజు, శ్రీనివాస్, అంజి, మోతీలాల్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



విశ్వంభర, ఎల్బీనగర్: భారతదేశ తొలి ప్రధాని, స్వాతంత్ర సమరయోధులు జవహర్లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఎస్ ఆర్ ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ రామచంద్రరావు నెహ్రూ ఘనంగా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ చంద్రరావు మాట్లాడుతూ నేటి బాలబాలికలే బావి భారత పౌరులని కొనియాడారు. ట్రస్టు ద్వారా నిరుపేద విద్యార్థులకు వారి ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. నెహ్రూ ఆకాంక్షల మేరకు వారిని బావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని కోరారు. ట్రస్ట్ ఛైర్మన్ రామచంద్రరావుని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్ రాజు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కొలేటి దామోదర్ గుప్తా, శ్యాంసుందర్, అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన సింగిల్ విండో ఛైర్మన్



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం లోని ఇంద్ర పాలనగరం, పల్లివాడ, సూరారం, ఎన్నారం, కుంకుడు పాముల గ్రామాల్లో ఉన్న (ధాన్యం కొనుగోలు కేంద్రాలను) ఐకేపీ సెంటర్లను రామన్నపేట సింగిల్ విండో ఛైర్మన్ నంద్యాల బిక్షంరెడ్డి పరిశీలించారు. రైతులు ఎవరూ అధైర్య పడవద్దని, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు తేమ శాతం వచ్చే విధంగా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ ఆఫీసర్ సురేష్, వివిధ గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నుండి నష్ట పరిహారం ఇప్పించేందుకు కృషి

- రైతులు సహకరిస్తే త్వరలోనే ట్రంక్ లైన్ పనులు
- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



విశ్వంభర, ఎల్బీనగర్: బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ శివారు కాలనీల డ్రైనేజీ అవుట్ లెట్ కోసం రైతులు సహకరిస్తే త్వరలోనే ట్రంక్ లైన్ పనులు ప్రారంభం ఔతాయని, వారికి తగిన నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాహెబ్ నగర్ గ్రామ రైతులతో తన కార్యాలయంలో సమావేశం అయ్యారు.దానిలో భాగంగా కొందరు రైతులు తగు నష్టపరిహారం ఇవ్వాలని కోరిన నేపథ్యంలో ఎల్.బి.నగర్ జోన్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్, టౌన్ ప్లానింగ్ ఏ.సీ.పీ.శ్యామ్సాన్ లను తన కార్యాలయానికి పిలిపించి వారికున్న అనుమానాలు నివృత్తి చేయడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సాగర్ కాంప్లెక్స్ నుండి వచ్చే వరద నీటిని కాప్రాయ్ చెరువు లోకి రాకుండా గుర్రంగూడ ఫారెస్ట్ నుండి విపశ్యన ధ్యాన కేంద్రం మీదుగా దిగువన ఉన్న గాయత్రినగర్,పాపిరెడ్డి కాలనీ, క్రిస్టల్ విల్లాస్ మీదుగా తీసుకెళ్లి మునగనూర్ మీదుగా అంబర్ పెట్ శివారులో కలిపి బి.ఎన్.రెడ్డి.నగర్ శివారు 21 కాలనీలలో నెలకొన్న వరద, డ్రైనేజీ సమస్య తీర్చడానికి ఒక ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. ట్రంక్ లైన్ పనులు క్రిస్టల్ విల్లాస్ ఎదురుగా ఉన్న రైతుల పొలాల వరకు వచ్చి ట్రంక్ లైన్ పనులు ఆగిపోవడం జరిగింది. కావున రైతులకు తగు నష్టపరిహారం ఏ విధంగా ఇస్తే బాగుంటుందని అధికారులను అడిగి రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,రైతులు జక్కిడి మోహన్ రెడ్డి,జక్కిడి శేఖర్ రెడ్డి,జక్కిడి శ్రీనివాస రెడ్డి,జక్కిడి సుధాకర్ రెడ్డి,జక్కిడి ప్రభాకర్ రెడ్డి,జక్కిడి హర్షవర్ధన్ రెడ్డి,జక్కిడి శ్రీకాంత్ రెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

# బాలికల మోడల్ హాస్టల్‌ను ప్రారంభించాలి

- యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరబాబు
- స్పందించిన ఎమ్మెల్యే రామచంద్రనాయక్



విశ్వంభర, మహబూబాబాద్: మరిపెడ మండల కేంద్రంలో మోడల్ హాస్టల్ ను ప్రారంభించాలనని యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ పెద్ద బోయిన వీరబాబు డిమాండ్ చేశారు. మరిపెడ మండల కేంద్రంలో డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ని వీరబాబు కలిసి విన్నవించారు. మరిపెడ మండలంలో మోడల్ కళాశాల ఏర్పాటు చేయకుండా కాంట్రాక్టర్, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మోడల్ కాలేజీ బాలికల హాస్టల్స్ ప్రారంభమైనప్పటికీ మరిపెడ మోడల్ ఇంటర్ బాలికల హాస్టల్ ప్రారంభానికి నోచుకోవడం లేదని అన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ పెడచెవిన పెడుతున్నారని వీరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాలు, తండాల నుంచి బాలికలు రవాణా సౌకర్యం లేక రాత్రి వేళలో స్టడీ అవర్స్ అనంతరం బిక్కుబిక్కుమని తండాలకు కాలినడకన వెళ్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ మోడల్ ఇంటర్మీడియట్ బాలికల హాస్టల్ ఏర్పాటు చేయకపోతే పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మండలంలో ఉన్న డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్షిత్, సంతోష్, సాయి, ప్రవీణ్, సుమన్, రాఖీ, నరేష్, సందీప్, రవి, సంజయ్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మురళీ నాయక్



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్, అయోధ్య, అమ్మనగల్, పర్వతగిరి, ఈ నాలుగు గ్రామాలల్లో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయనతో పాటు తాహసిల్దార్ భగవాన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంవత్సరం డిసెంబర్ 30న రెండు లక్షల పైన ఉన్నటు వంటి రైతు రుణాలు రెండు లక్షల వరకు పూర్తిగా మాఫీ అయితాయని ఏ ఒక్క రైతు భయపడొద్దని, రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులెవరు అధైర్య పడద్దని ఎమ్మెల్యే భూక్య మురళీ తెలిపారు. సన్నాలకు 500 రూపాయల బోనసును కూడా రాష్ట్ర ప్రభుత్వమే రైతు అకౌంట్లోనే వేస్తోందని, రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని అమ్ముకోవాలి, రైతులు ఎవరు కూడా దళారుల మాయ మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి అని రైతులకు పండించిన ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరను కల్పిస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైతులు, ఐకేపీ అధ్యక్షులు, సెంటర్ ఇన్చార్జీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# డయాబెటిస్‌పై అవగాహన సదస్సు




విశ్వంభర, ఎల్బీనగర్: డయాబెటిస్ పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ఆర్కే పురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ అల్కాపురి చౌరస్తా వద్ద గల రైట్ నక్షత్ర హాస్పిటల్ లో వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా డయాబెటిస్ పై నిర్వహించిన అవగాహన సదస్సు కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజువారి వ్యాయామం ఆరోగ్యకరమైన జీవన శైలి పట్ల పూర్తి అవగాహన ఉండాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం పై ఎక్కువ శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం హాస్పిటల్ డాక్టర్లు మాట్లాడుతూ దాదాపు 200 మందికి పైగా ఉన్న రోగులకు ఉచితంగా కన్సల్టేషన్ తో పాటు, రాండం బ్లడ్ షుగర్, హెచ్ బి ఏ 1 వంటి ముఖ్యమైన రక్త పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ కమిషనరేట్ క్యాంప్ ఆఫీస్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఉషారాణి, రైట్ నక్షత్ర హాస్పిటల్ వైద్యులు డా. శివరామకృష్ణ, డాక్టర్ ఉజ్వల్, డాక్టర్ వంశీ చంద్రరాజు, డాక్టర్ శిరీష డాక్టర్ మహబూబ్ బాషా డాక్టర్ చంద్రప్రకాష్, నవ్య, సాయినాథ్, రాజకుమార్, డాక్టర్ దీవెన, ఝాన్సీ, హర్ష, ఉష తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు

### 18 నుంచి 25 వరకు దరఖాస్తుల స్వీకరణ

విశ్వంభర, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వివిధ పత్రికలు, టీవీ న్యూస్ చానళ్ళలో పని చేస్తున్న జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు మరోసారి సభ్యత్వ నమోదు చేపట్టాలని సొసైటీ కార్యవర్గం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ మేరకు వారం రోజుల పాటు సభ్యత్వ నమోదు ఉంటుందని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అర్హులైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. స్థానిక వర్కింగ్ జర్నలిస్టుగా కనీసం ఐదేళ్ల సర్వీస్ ఆధారాలతో పాటు ప్రస్తుతం జర్నలిస్టుగా పని చేస్తున్నట్లు ధృవీకరణ పత్రం (ఐడీ కార్డు, అక్రెడిటేషన్ కార్డు లేదా మీడియా సంస్థ నుంచి అపాయింట్మెంట్ లెటర్) తో పాటు స్థానిక నివాస ధృవీకరణ (ఆధార్ కార్డు లేదా గ్యాస్ బిల్, కరెంట్ బిల్లు), రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు దరఖాస్తు ఫారానికి జత చేయాలని వారు సూచించారు. వీటితో పాటు ఈ నెల 18 నుంచి 25వ తేదీ లోపల " గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ" పేరిట రూ.1550 బ్యాంక్ డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ), రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు దరఖాస్తు ఫారానికి జత చేయాలని కోరారు. దరఖాస్తు ఫారాలు వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి దగ్గరలోని టీవీ కాలనీ ఫేస్ 4, ప్లాట్ నెంబర్ 198 లో గల సొసైటీ కార్యాలయంలో ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు లభిస్తాయని, అర్హులైన జర్నలిస్టులు సభ్యత్వానికి కావలసిన సర్వీస్ ఆధారాలు, డీడీ తీసుకుని వచ్చి దరఖాస్తు ఫారం నింపి సమర్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. సర్వీస్ సీనియారిటీ కోసం మీ పూర్తి సర్వీసు సీనియారిటీ ఆధారాలు ఉంటే జత చేయాలని సూచించారు. మిగతా వివరాలకు ఫోన్ నెంబర్ 9100933723, 7799681212, 9393353519 లను సంప్రదించాలని కోరారు.

## ఘనంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని రంగమ్మగూడెంలో కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షులు సుదగాని బాలచంద్రు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నోముల శ్రీనివాస్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు దేశ మొత్తం పేద ప్రజలకు అందుతున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని, భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇవ్వాలని, నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని బాలచంద్రు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కులగణన సర్వే ఫారంలో విశ్వబ్రాహ్మణ పేరును చేర్చాలి



విశ్వంభర, రామన్నపేట: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే కులగణన సర్వేలో విశ్వబ్రాహ్మణ కుల నామాన్ని చేర్చాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కన్నెకంటి వెంకటేశ్వరాచారి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన కులగణన సర్వేలో విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గాన్ని అవమానపరిచే విధంగా కులం పేరు ప్రస్తావన లేకుండా, సర్వే ఫారమ్ లో కేవలం వృత్తులకు కోడులు కేటాయించి, వర్గీకరణ చేపట్టడం శోచనీయమని అన్నారు. కుల ప్రాతిపదికన బీసీ కమిషనర్ బీసీ(బీ) సీరియల్ నెంబర్ 21 లో విశ్వబ్రాహ్మణులను చేర్చినటువంటి ప్రభుత్వం కుల గణన సర్వేలో మాత్రం విశ్వబ్రాహ్మణ పదం తొలగించడం సమంజసం కాదన్నారు. కాబట్టి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వే ఫారంలో వృత్తి నామాలను తొలగించి, విశ్వబ్రాహ్మణ అనే పదాన్ని చేర్చి ఒకే కోడును కేటాయించవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని వెంకటేశ్వరాచారి తెలిపారు.

## శౌర్యదివస్‌గా నాథూరాం గాడ్సే వర్ధంతి వేడుక



విశ్వంభర, చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద హిందుత్వ వాదులు నాథూరాం గాడ్సే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నాథూరామ్ గాడ్సే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాథూరామ్ గాడ్సే వర్ధంతిని శౌర్య దివస్‌గా పాటించారు. ఈ సందర్భంగా హిందుత్వ వాదులు నాథూరామ్ గాడ్సే అమర్ రహే (నాథూరామ్ గాడ్సే లాంగ్ లివ్), నాథూరామ్ గాడ్సే జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. హిందూధర్మం కోసం పోరాడిన గాడ్సే గొప్ప అమరుడని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు శివర్ల రమేష్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు వెన్నం శేఖర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కుంభం శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్, భజరంగ్ దళ్ మండల అధ్యక్షులు సోమరాజు ప్రదీప్, బీజేవైఎం మండల అధ్యక్షులు కుందేళ్ళ శ్రీశైలం, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గజ్జెల అభినవ్, మేకల నరసింహ, ఉప్పల యాదయ్య, మోర వెంకటరమణ, ఆంజనేయులు, సతీష్, శ్రీను, రాజు, వినోద్, రాధాకృష్ణ, శ్రవణ్, చింటూ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మంజూరు



విశ్వంభర, కల్వకుర్తి: రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి మండలంలో వెల్జాల్, కడ్తాల్ మండలంలోన కడ్తాల్, ముద్విన్, మాడుగుల మండలం ఇర్విన్ గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, వాటిని త్వరలోనే అద్దె భవనాలలో ఏర్పాటు చేయనుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. నియోజకవర్గంలో నాలుగు కొత్త పీఏసీఎస్ లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషి వల్లనే సాధ్యమైందని, ఈ సహకార సంఘాల ఏర్పాటు రైతన్నలకు ఎంతో మేలు చేస్తుందని, పీఏసీఎస్ లను మంజూరు చేయించిన స్థానిక శాసనసభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి, రంగారెడ్డి జిల్లా డీసీసీబీ ఛైర్మన్, తెలంగాణ రాష్ట్ర క్యాబ్ వైస్ ఛైర్మన్ కు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలియజేశారు.

## భక్తి శ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



విశ్వంభర, ఎల్బీనగర్: సరూర్ నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో 40వ బ్రాహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతములు నిర్వహించారు. ఈ వ్రతాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కోరుపోలు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి ప్రసాద్, మాజీ ఛైర్మన్ గండు ధనం రెడ్డి, కమిటీ సభ్యులు బొగేశ్వర్ రావు, సుబ్బరావు, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్ రావు, ప్రతాప్ రెడ్డి, మహేందర్, ఆలయ సభ్యులు రవీందర్ రావు, వీరేందర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



విశ్వంభర, పటాన్ చేరు: సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మండలం హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమాన్ని కార్తీక పౌర్ణమి శుక్రవారం రోజు కాజు గురు స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పటాన్ చేరు మండలం నందిగామ గ్రామానికి చెందిన ఎల్లగొని రవీందర్ గౌడ్ నిర్వహించిన పడిపూజకు అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు అయ్యారు. స్వామిని స్మరిస్తూ భజన మండలి గజ్జల శ్రీను భజన కీర్తనలతో పాటలు పాడి అయ్యప్ప స్వాములు అలరింపచేశారు. అనంతరం 18 పడి మెట్లకు పూజలు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 9 మంత్రి పదవులు ఇవ్వాలి

### డా. అజయ్ కుమార్ యాదవ్



విశ్వంభర, బషీర్ బాగ్: కాంగ్రెస్ పార్టీకి బీసీలపైన చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ రాష్ట్రంలో 9 మంత్రి పదవులు బీసీలకు ఇవ్వాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో అన్ని పార్టీలన్నీ ఆధిపత్య వర్గాల చేతుల్లోనే ఉన్నాయన్నారు. ఆధిపత్య వర్గాల చేతిలో ఉన్నన్ని రోజులు బీసీల బతుకులు మారుతాయి అనుకోవడం పొరబాటేనని, బీసీలు భ్రమలో బతకాల్సిందేనని అన్నారు. ఆధిపత్య వర్గాలకు ప్రత్యామ్నాయంగా బీసీ కులాల నాయకులు ఏకం కావాలన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో కీలకమైన శాఖలన్నీ అగ్రవర్ణాల వారికి కేటాయించారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కనీసం మండల్ కమిషన్ రిపోర్టును అమలు చేయలేదని, ఇప్పుడు బీసీ కులాల మీద ప్రేమ వలకబోస్తుందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలంగాణను దేశంలో ఒక రోల్ మోడల్ గా చేస్తానన్నాడని, సామాజిక న్యాయం జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని సామాజిక కులాలకు న్యాయం చేస్తానని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గంలో బీసీలకు 9 మంత్రి పదవులు కేటాయించేలా రాహుల్ గాంధీ ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రాహుల్ గాంధీ సామాజిక న్యాయం తెలంగాణ నుంచే ప్రారంభించాలని అజయ్ కుమార్ యాదవ్ అన్నారు.

## కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డా. బండి శ్రీనివాస్ ఎన్నిక



విశ్వంభర, హైద్రాబాద్ : కేరళ రాష్ట్రం కోజికోడ్ లోని మలబార్ క్రిస్టియన్ కాలేజ్ (1909) లో 43వ దక్షిణ భారతదేశ చరిత్ర కాంగ్రెస్ మహాసభలు నవంబర్ 8,9,10 తేదీలలో జరిగాయి . అందులో భాగంగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన సికింద్రాబాద్ పీజీ కళాశాల అధ్యాపకులు డా. బండి శ్రీనివాస్, మహాత్మ గాంధీ విశ్వవిద్యాలయానికి చెందిన చరిత్ర అధ్యాపకులు డా. పనస రామకృష్ణ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఏ.సుభాష్ లు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు గా ఎన్నికయ్యారు. వీరితో పాటు కామారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. విజయ్ కుమార్ పొలిటికల్ హిస్టరీ సెక్షనల్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. ఈ బృందానికి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన చరిత్ర విభాగ మాజీ సీనియర్ ప్రొఫెసర్ డా. అర్జున రావు కుత్తాడి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా అర్జున్ రావు కుత్తాడి నేతృత్వంలోని ఈ బృందానికి ఉస్మానియా చరిత్ర శాఖ అధ్యాపక బృందం , తెలంగాణ చరిత్ర శాఖ డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపక బృందం, చరిత్ర విభాగ పరిశోధక పరివారం, చరిత్ర విభాగ విద్యార్థులు మరియు తెలంగాణ చరిత్ర అభిమానులు ప్రశంసాభినందనలు తెలియజేయడం జరిగింది.

## టీటీడీ బోర్డు నూతన మెంబర్ కు సన్మానం




విశ్వంభర, రామన్నపేట: తెలుగుదేశం పార్టీకి విశిష్ట సేవలు అందించిన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామవాసులు నన్నూరి నర్సిరెడ్డికి తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబరుగా నియమితులైన శుభ సందర్భంగా, శుక్రవారం నకిరేకల్ లో జరిగిన తెలుగుదేశం పార్టీ 2024–2026 కు సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విచ్చేసిన నన్నూరి నర్సిరెడ్డికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహ, రామన్నపేట తెలుగుదేశం పార్టీ మండల తెలుగు యువత అధ్యక్షులు మీర్జా ఫజల్ బేగ్, రామన్నపేట యువ నాయకులు ఆకవరపు సాయి కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి ముందు రోజుల్లో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## కుటుంబ సర్వేను పర్యవేక్షించిన ఎంపీడీఓ,ఎంపీఓ



విశ్వంభర, ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని పల్లెర్ల, సిద్ధాపురం గ్రామాలు, మండల కేంద్రంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పండుగ రోజు కూడా ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న సిబ్బందికి సర్వేకి సంబంధించిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో సేకరించాలని ఎంపీడీఓ జె రాములు నాయక్,ఇంచార్జ్ ఎంపీఓ వెల్మినేటి లోకేశ్వర్ రెడ్డిలు ఎన్యూమరేటర్లకు సూచించారు. ఈ సర్వే కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మరో మెగా టోర్నమెంట్

# ఫిఫా ఫ్రెండ్లీ ఫుట్ బాల్ మ్యాచ్

- ఆదిత్యం ఇవ్వబోతున్న తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ
- గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా ఏర్పాట్లు
- సీఎం రేవంత్ ప్రోత్సాహంతో మరిన్ని క్రీడాభివృద్ధి కార్యక్రమాలు



విశ్వంభర, హైదరాబాద్: మరో మెగా టోర్నమెంట్ కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వబోతుంది. ఇందుకు గచ్చిబౌలి స్టేడియం వేదిక కానుంది. నవంబర్ 18 వ తేదీ సోమవారం నాడు జీఎంసీబీ స్టేడియం, గచ్చిబౌలిలో ఇండియా మలేషియా జట్ల మధ్య ఫీఫా ఫ్రెండ్లీ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ నిర్వహణకు కావలసిన అన్ని ఏర్పాట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ముమ్మరంగా పూర్తి చేస్తోంది.మొన్న అక్టోబర్ 3, 6, 9 వ తేదీల్లో ఇండియా సిరియా మారిషస్ జట్ల మధ్య ఫిఫా ఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ మ్యాచ్ కు అతిథ్యం ఇచ్చిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఇండియా, మలేషియా జట్ల మధ్య ఈ ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ కు ఆతిథ్యం ఇవ్వబోతుంది.ఈ తరహా ఫిఫా ఫ్రెండ్లీ కప్ హైదరాబాద్ నగరంలో జరగడం ఇది మొదటిసారి కావడం విశేషం. ఎంతో ఘనమైన చరిత్ర కలిగి, ఫుట్బాల్ ఒలంపియన్ల కేంద్రంగా పేరుగాంచి భారతీయ ఫుట్ బాల్ క్రీడకు కేంద్రంగా వెలుగొందిన హైదరాబాద్ నగరంలో ఫుట్బాల్ క్రీడా తన చారిత్రక వైభవాన్ని కోల్పోతుంది. దశాబ్దాలుగా విస్మరించబడి, దినదినం క్షీణించిపోతున్న ఈ క్రీడకు పునర్ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని రేవంత్ రెడ్డి అనేకసార్లు ప్రకటించారు. స్వయంగా ఫుట్ బాల్ క్రీడాకారుడైన రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో వివిధ ఫుట్ బాల్ క్రీడల్లో పాల్గొని నగర క్రీడాకారులను ఉత్తేజ పరిచిన సంగతి విధితమే! అంతేకాకుండా ఇటీవల సీఎం కప్ 2024 టార్చ్ రిలే సందర్భంగా జూనియర్ ఫుట్ బాల్ టీమ్ ను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా అక్టోబర్ 3, 6, 9 వ తేదీల్లో ఫిఫా ఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ కప్పుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆతిథ్యం ఇచ్చి ఘనంగా నిర్వహించి హైదరాబాద్ నగర క్రీడాభిమానుల అభిమానం చూరగొంది. ఆ మ్యాచ్ ను నిర్వహించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ ఫిఫా మరియు ఆల్ ఇండియా ఫుట్ బాల్ ఫెడరేషన్ ప్రతినిధులప్రశంసలు అందుకుంది సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో జాతీయ ఫుట్ బాల్ క్రీడ కు ప్రోత్సాహం కల్పించాలని, అదే సందర్భంలో హైదరాబాద్ నగర క్రీడా వారసత్వంగా కొనసాగుతున్న ఫుట్ బాల్ క్రీడకు పునర్ వైభవం తీసుకొచ్చేందుకు ఇటువంటి అంతర్జాతీయ పోటీలు నిర్వహిస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ కే శివసేనారెడ్డి అన్నారు. ఈ నెల 18 సోమవారం జరగబోయే మ్యాచ్ కు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు.

# వాతావరణ మార్పుల వల్ల బహుముఖ సవాళ్లు

- గీతం ఆతిథ్య ఉపన్యాసంలో స్కాట్ లాండ్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ రంజన్



విశ్వంభర, సంగారెడ్డి: వాతావరణ మార్పుల వల్ల మనం బహుముఖ సవాళ్లను ఎదుర్కొంటున్నామని, మానవ కార్యకలాపాలు, వాతావరణ మార్పుల మధ్య సంక్లిష్టమైన పరస్పర చర్యను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని స్కాట్ లాండ్ లోని ఎడిన్ బర్గ్ విశ్వవిద్యాలయం పర్యావరణ, వాతావరణ న్యాయ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ రంజన్ హితవు పలికారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లో 'చిక్కుబడ్డ సంక్షోభం: హిమాలయాల్లో పర్యావరణ విధ్వంసం, న్యాయం'అనే అంశంపై శుక్రవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు.వాతావరణ మార్పు, విపత్తుల సాంద్రత, తీవ్రతపై, ముఖ్యంగా ఉత్తరాఖండ్ ప్రాంతంలో సంభవిస్తున్న పరిణామాలపై ఆయన దృష్టి సారించారు. దీనికి గల సాంకేతిక పరిష్కారాలను పదే పదే ప్రస్తావిస్తూనే, ఈ సంక్షోభాల భావోద్వేగ, మానవ కోణాలను విస్మరించడాన్ని ఆయన తప్పు పట్టారు.డాక్టర్ రంజన్ తన వినూత్న పరిశోధన ద్వారా హిమాలయ ప్రాంతంలో వాతావరణ వైపరీత్యాల లోతైన చిక్కులను అర్థం చేసుకోవడానికి శోకంని ఒక ముఖ్యమైన అంశంగా పరిచయంచేశారు.వాతావరణ సంక్షోభం చుట్టూ మన కథనాలనురూపొందించడంలో మానవ బాధలను గుర్తించడం, ధృవీకరించడం చాలా అవసరమని ఆయన వాదించారు. వాతావరణ మార్పు ప్రభావిత కమ్యూనిటీలపై తీసుకునే భావోద్వేగ నష్టాన్ని బహిరంగంగా గుర్తించాలని సూచించారు.ఈ చర్చలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని, వాతావరణ విపత్తుల యొక్క మానవ కోణాలను అన్వేషించడానికి, వాతావరణ సంభాషణలో భావోద్వేగ కథనాలను ఏకీకృతం చేయాల్సిన ఆవశ్యకత గురించి తెలుసుకున్నారు.

# కేశవ్ మెమోరియల్ ఆధ్వర్యంలో లీగల్ ఎగ్జిబిషన్





విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్ నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ లా కాలేజీ భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వినూత్నంగా లీగల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించింది. కళాశాల ఛైర్మన్ రిటైర్డ్ పాట్నా ప్రధాన న్యాయమూర్తి ఎల్. నరసింహా రెడ్డి ఆలోచన మేరకు లీనమయ్యే కార్యక్రమాన్ని రూపొందించారు. నవంబర్ 15 ఉదయం 9:00 గంటలకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మాధవి దేవి చే ప్రారంభించిన లీగల్ ఎగ్జిబిషన్ లో ప్రభుత్వం ఇటీవల జోడించిన, సరిదిద్దిన మరియు మార్చిన చట్టపరమైన విభాగాలను ప్రదర్శించింది. వివిధ కళాశాలల నుండి విద్యార్థులు ఈ వినూత్న భావనను తెలుసుకోవడానికి వచ్చారు. కొత్త నిబంధనలను అర్థం చేసుకోవడంలో ఆసక్తిని కనబరిచారు. లెక్చరర్లు, న్యాయవాదులు, సీనియర్లు విద్యార్థులతో నిమగ్నమవ్వడానికి, చట్టపరమైన సవరణలపై అంతర్దృష్టులను అందించడానికి సిద్ధంగా ఉన్నారు.కేశవ్ మెమోరియల్ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, కోఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి, ఇంచార్జి గోవింద్ జీ, సిబ్బంది ఆధ్వర్యంలో నవంబర్ 17 వరకు ప్రదర్శన కొనసాగుతుందనీ తెలిపారు. ఈ చొరవ భారతదేశ రాజ్యాంగ చరిత్ర మరియు గత 75 సంవత్సరాలలో దాని పరిణామంపై లోతైన అవగాహనను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రత్యేకమైన, ఇంటరాక్టివ్ ప్లాట్‌ఫారమ్‌ను అందించడం ద్వారా కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ లా విద్యార్థుల, సమాజంలో చట్టపరమైన అవగాహన మరియు విద్యను ప్రోత్సహిస్తోంది.

## ఘనంగా 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



విశ్వంభర, మహబూబాబాద్: పుస్తకం ప్రియ నేస్తం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయం లో "పుస్తక ప్రదర్శన" ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి డిఈఓ వి రాజేశ్వర్ జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "పుస్తకం ప్రియ నేస్తం" అని అన్నారు. ఒక మంచి పుస్తకం ఓ మంచి మిత్రులతో సమానం, పుస్తకానికి మిత్రునికి అంతటి సాన్నిహిత్యం ఉంది, సాహితీ బంధం ఉంది మంచి మిత్రుడు ఉన్నవాడు తన స్నేహితునికి అపకారం తలపెట్టడు. అలాగే పుస్తకం కూడా కీడు చేయదు, విలువలు నేర్పిస్తుంది. మార్గదర్శకంగా ఉంటుంది. మానసిక పరిణతిని పెంపొందిస్తుంది. కొత్త విషయాలు తెలియజేస్తుంది. సామాజిక అంశాలను నేర్పిస్తుంది. కాబట్టి పుస్తకం చదివే అలవాటు మాత్రం తప్పనిసరిగా ఉండాలి. అందుకే ఒత్తిడి తగ్గించే దివ్య ఔషధం పుస్తక పఠనం అన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో బాల సాహిత్యం ఆధ్యాత్మిక సాహిత్యం దేశ చరిత్రలు, పోటీ పరీక్షకు సంబంధించిన పుస్తకాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జి విజయేందర్, సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్ , బొడ్డుపల్లి భూలక్ష్మి అశోక్, అనిల్, సతీష్ గ్రంథాలయ పాఠకులు సాహితీవేత్తలు పుస్తక ప్రియులు తదితరులు పాల్గొన్నారు.

## అట్టివో టెక్నాలజీ సొల్యూషన్స్‌ను సందర్శించిన ఐఏఎస్ అధికారి శ్రీవాత్సవ



విశ్వంభర, హైదరాబాద్ : ఐఏఎస్ అధికారి శ్రీవాత్సవ కోట అట్టివో టెక్నాలజీ సోల్యూషన్స్ సందర్శించారు. 10వ వార్షికోత్సవ వేడుకలో భాగంగా ఆయన పాల్గొన్నారు. సోల్యూషన్స్ వారితో కాసేపు ముచ్చటించారు. వారి అనుభవాన్ని సొల్యూషన్స్ ఉద్యోగులతో పంచుకున్నారు. డైరీ పుస్తకాన్ని ఆవిష్కరించి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన కళాశాల విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

## ఒకే కుటుంబంలో ఇద్దరికీ ఉద్యోగాలు





విశ్వంభర, వెల్దండ: టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్ 4 ఫలితాల్లో వెల్దండ మండలం రాచూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ఉద్యోగాలు సాధించారు. రాచూర్ గ్రామానికి చెందిన గంగాధారి వెంకటేష్ (బైక్ మెకానిక్), స్వరూప కుమారుడు గంగాధారి శ్రీకాంత్, కూతురు గంగాధారి లలిత గ్రూప్ 4 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించారు. గంగధారి శ్రీకాంత్ నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని భూపరిపాలన విభాగంలో జూనియర్ అసిస్టెంట్ గా, కూతురు గంగాధారి లలిత ఉస్మానియ యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలు సంపాదించిన ఇద్దరినీ తల్లిదండ్రులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

## కార్తీక పౌర్ణమి సందడి..

# శివాలయాలకు పోటెత్తిన భక్తులు



విశ్వంభర, చింతపల్లి: చింతపల్లి మండల వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా చింతపల్లి, మాల్, కుర్మేడ్, నెల్వలపల్లి, తీదేడు, పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శైవక్షేత్రాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు బారులు దీరారు. శివనామస్మరణతో దేవాలయాలు మార్మోగాయి.కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరిపారు. ఉసిరిచెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం సన్నిధానంలో కార్తీక దీపాలు వెలిగించి మహిళా భక్తులు పూజలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలు దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. శివపార్వతులకు అభిషేకాలు చేశారు. పలు ఆలయాల్లో భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో వున్న శివాలయంలో పూజలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కిక్కిరిసిపోయింది. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని భక్తులు అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు చేశారు. భక్తులకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందించారు. శివనామస్మరణ చేస్తూ 365 ఒత్తులను భక్తులు వెలిగించారు. శివునికి దీపారాధన జరిపితే పుణ్యం లభిస్తుందని భక్తులు చెబుతున్నారు.

## ఘనంగా కార్తీక పౌర్ణమి ఉత్సవాలు



విశ్వంభర, వరంగల్: వరంగల్ జిల్లాలోని ములుగు రోడ్డు హనుమాన్ జంక్షన్ వద్ద శ్రీ రామ సత్యనారాయణ స్వామి దేవాలయం లో శుక్రవారం కార్తీక పౌర్ణమి ఉత్సవాలను దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సనాతన సంప్రదాయాలను ఆచరిస్తే జీవకోటికి శాంతి ఆనందం ఆరోగ్యం కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆశీస్సులతో వరంగల్ జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, ఆనందంగా జీవించాలని, కృపాకటాక్షం ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి సన్నిధిలో వ్రతాలు చేసి మొక్కలు చెల్లించారని తెలిపారు. అదేవిధంగా ఈనెల 29వ తేదీన దీపోత్సవం జరుగుతుందని ఈ యొక్క కార్యక్రమానికి ప్రజలకు పూజ కావలసిన సామాగ్రిని ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కృపల్ కృష్ణ,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



విశ్వంభర, వెల్దండ: వెల్దండ మండలము గుండాల గ్రామం లో రెండవ దక్షిణ కాశీగా పేరుగాంచిన అంబా రామలింగేశ్వర స్వామి ఆలయం లో కార్తీక పున్నమి పురస్కరించుకొని వేకువజాము నుండి పెద్ద ఎత్తున భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు చేసి శివాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఆలయం శివనామ స్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము నుండి మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించి అనంతరం శివునికి ప్రత్యేక పూజలు చేశారు.ఇక్కడ స్వామి వారిని పూజిస్తే కాశీ లో స్వామి వారిని పూజించి నట్టుగా, ఇక్కడ గుండంలో స్నానం చేస్తే కాశీలో చేసినట్టుగా భక్తుల విశ్వసిస్తారు. అందుకే గ్రామానికి గుండాల అని పేరు వచ్చిందని కార్తీక పౌర్ణమి రోజు శివుని ఆరాధిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని పూజారులు తెలియజేశారు. స్వామి వారికి భక్తులు పాలు,పెరుగు,పంచామృతలతో పెద్ద ఎత్తున అభిషేకాలు నిర్వహించారు.

## కార్తీక పౌర్ణమి పూజలు చేసిన మహిళలు



విశ్వంభర, ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో కార్తీక మాసం పర్వదినం సందర్భంగా, దీపాలను వెలిగించి మహిళలు పూజలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు సోలిపురం అరుణ ఉపేందర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు సంగీత, రోహిణి, వరమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## మొదలైన మైసిగండి మైసమ్మ బ్రహ్మోత్సవాలు



విశ్వంభర, కడ్తాల్: కార్తిక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజాము నుండి దేవాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు, శివ నామస్మరణ తో పుణ్యక్షేత్రాలు మారుమ్రోగుతున్నాయి. కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవస్థానం బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా అభిషేకం నిర్వహించి అలంకరణ, ప్రత్యేక పూజల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు పాల్గొన్నారు. సమీపంలోని దత్తాత్రేయ ఆలయానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, బిచ్చ నాయక్, ఆలయ ఈవో స్నేహలత, ట్రస్ట్ ఛైర్మన్ శిరోలి పంతు నాయక్, రామావత్ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్య, రాములు, కృష్ణయ్య, హర్షవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప కొండలో స్వాములకు అన్న ప్రసాదం



విశ్వంభర, ఆమనగల్లు: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆమనగల్లు అయ్యప్ప కొండ దేవాలయంలో అయ్యప్ప స్వామి సన్నిధానంలో పోలోజు శ్రీనివాస్ గురుస్వామి శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకము చేసి అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో గురు స్వాములు కృష్ణ స్వామి, అశోక్ స్వామి, నరసింహ స్వామి, శ్రీనివాస్ రెడ్డి, గురుస్వామి, గిరిబాబు, గోపి, చెన్నకేశవులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నాగుర్లపల్లి గ్రామానికి దక్కిన గౌరవం



విశ్వంభర, నర్సంపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాటమయ్య రక్షణ పథకం లో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చెతుల మీదుగా నర్సంపేట మండలం నాగుర్లపల్లి గ్రామానికి చెందిన కట్ల రాజు కాటమయ్య రక్షణ కవచం కిట్టును స్వీకరించారు. దీనికి సహకరించిన నర్సంపేట మండల అధ్యక్షులు బానోతు లక్ష్మణ్ నాయక్ కు కట్ల రాజు ధన్యవాదాలు తెలిపారు. ఈ

## పకడ్బందీగా కుటుంబ సమగ్ర సర్వే



విశ్వంభర, ఆమనగల్లు: అమనగల్ పురపాలక సంఘ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అన్ని ఎన్యుమెరటర్స్ బ్లాక్స్ లో కొనసాగుతుంది. సర్వే లో అందరు ఎన్యుమారటర్స్ హాజరవుతున్నారని సర్వేను నిర్వహిస్తున్న వారిని సవాలక్ష ప్రశ్నలతో కుటుంబ సభ్యులు వేస్తున్నారని అయినా కూడా ఓపిక, సహనంతో సర్వేలు నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, సూపర్వైజర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.




# దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

### - ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం చిల్లపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం కార్తీకపూర్ణమి సందర్భంగా మండల పరిధిలోని చిల్లపురంలో శ్రీరామలింశ్వర స్వామి గుట్ట మీద జరిగే జాతర లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్, చౌటుప్పల్ పురపాలక సంగం ఛైర్మన్ వెనరెడ్డి రాజు తో కలసి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. దేవాలయం కమిటీ అధ్యర్యంలో సన్నాయి మేళా వద్యాలతో రాజగోపాల్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు.గుట్ట మీద దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం చరిత్ర గురించి, చేయవలిసిన అభివృద్ధి పై వచ్చిన భక్తులతో అడిగి తెలుసుకున్నారు. అనంతపురం మీడియా తో మాట్లాడతూ ఈ ప్రాంత ప్రజల నమ్మకం. ఏడాదికి ఒక్క రోజు మాత్రమే దర్శనం ఇచ్చే భక్తుల కోరికలు తీర్చే శ్రీ రామలింగేశ్వర స్వామి గుట్ట జాతర కు యాభై వేల మంది వరకు రావడం గొప్ప విషయం అన్నారు. రాబోయే రోజుల్లో ఎండోమెంట్ తో గాని వ్యక్తి గతంనైనా దేవాలయం ను అభివృద్ధి చేస్తానని చెప్పారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అ శివుడు ని కోరుకుంటున్నానని




అన్నారు.ప్రజలందరికి కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో మండలం కాంగ్రెస్ అధ్యక్షులు కరెంటోతూ శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి లు గుత్తా ఉమా ప్రేమిచేందర్ రెడ్డి, కరెంటోతూ బిక్షపతి నాయక్, డీసీసీ కార్యదర్శులు ముద్దంగుల బాలకృష్ణ, నోముల మాధవరెడ్డి, వంకుడోతూ బుజ్జి,ఉప్పల లింగస్వామి,మాజీ సర్పంచ్ కొర్ర లచ్చిరాం, నాయకులు మెరుగు పెద్ద జంగయ్య, మేకల రవి, రమేష్, పడుసగోని నరసింహ,జక్కలి విక్రమ్, లింగంపల్లి రాజు,కరెంటోతూ శ్రీరామ్, కిషన్, రఘు, శేఖర్, రెడ్యా, శంకర్, లాలు తదితరులు ఉన్నారు.

# నిఘా నేత్రం నామ మాత్రం

### ▪ చోరీలు, ప్రమాదాలు జరిగినా గుర్తించలేని వైనం
### ▪ సీసీ కెమెరాల నిర్వహణ లోపంతో మూతపడ్డ నిఘా నేత్రాలు

విశ్వంభర, హుజూర్ నగర్: హుజూర్ నగర్ మున్సిపాలిటీ కేంద్రంలో సీసీ కెమెరాలు దెబ్బతిన్నాయి. సాక్ష్యాత్తు పోలీసు శాఖ ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలకు గాను ఏ ఒక్కటీ పని చేయడం లేదు. ది హుజూర్ నగర్ ఫైల్స్జి నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకం. నేరం జరిగిన వెంటనే సాక్ష్యాలు లభించే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమంటూ తరచూ సమీక్షలు సమావేశాల్లో పోలీసు అధికారులు చెప్పే మాటలు సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గంలో నిఘా కళ్లు మూసుకున్నాయి. నిఘాపై నిర్లక్ష్యపు మేఘాలు కమ్ముకొని పలు కేసుల్లో కీలక ఆధారాలు జారిపోతున్నాయి. నిర్వహణ కరవై మరమ్మతులకై నిఘా కెమెరాలు మూలకు చేరుకున్నాయి. ఇటీవల నిత్యం రద్దీగా ఉండే హుజూర్ నగర్ పట్టణ నడిబొడ్డున యాదగిరి లక్ష్మీనరసింహ పార్ బాయిల్డ్ రైస్ మిల్లుకు చెందిన 14.50 లక్షల బ్యాగ్ చోరీ కేసులో సీసీ ఫుటేజీ కోసం వెళ్లిన పోలీసులకు ఎక్కడా రోడ్లపై సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో చోరీ కేసులో ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. హుజూర్ నగర్ పట్టణంలోని వ్యాపారులు,ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల యాజమాన్యాల ఆర్థిక సాయంతో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన నిఘా కెమెరాల వ్యవస్థ మూలనపడింది. ఈ కెమెరాలకు సంబంధించిన కంట్రోల్ రూం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్నా కెమెరాలు పని చేయకపోవడంతో ఉపయోగం లేకుండా పోయింది.హుజూర్ నగర్ ప్రధాన రహదారి వెంట దద్దనాల చెర్వు నుండి వెంకటేశ్వర స్వామి టెంపుల్ వరకు అన్ని జంక్షన్లలో పోలీసు శాఖ స్వయంగా ఏర్పాటు చేసిన సుమారు 30 సీసీ కెమెరాలకు గాను ఏ ఒక్కటీ పని చేయడం లేదు.సాంకేతిక సమస్యల వల్ల కావొచ్చు, కేబుల్ వ్యవస్థ దెబ్బతిని కావొచ్చు, వాటిని పర్యవేక్షించే వ్యవస్థ నిర్లక్ష్యం కావొచ్చు. నియోజకవర్గ




కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా నేర పరిశోధన ఆధారాల సేకరణకు కూడా వీల్లేకుండా పోయింది. ఓ వైపు కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించే పోలీస్ అధికారులు అందుబాటులో ఉన్నవాటి నిర్వహణను గాలికి వదిలేసారని విమర్శలు వినిపిస్తున్నాయి.కొత్త బస్టాండ్,ఇందిరా చౌక్, పాతబస్టాండ్,లింగగిరి రోడ్డు,గాంధీ పార్క్, మఠంపల్లి చౌరస్తా వరకు అందుబాటులో ఉండి పూర్తిగా మూలన పడి ఉపయోగంలో లేని30 సీసీ కెమెరాలు సత్వరం మరమ్మతులు చేయకపోతే నేర పరిశోధనలో ఆటంకాలు తప్పవని సీసీ కెమెరాల నిర్వహణను పోలీసులు, మున్సిపాలిటీ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని నిఘా వ్యవస్థను మళ్లీ గాడిన పెట్టే ప్రయత్నాలు చేయాలని పురవాసులు కోరుతున్నారు.

## అంబేద్కర్ భవన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

### పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం జనగాం గ్రామంలో అంబేద్కర్ భవన్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా 5లక్షల రూపాయలు మంజూరు చేసిన ఎమ్మెల్యే, కాలనీవాసులకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ డిజైన్ రూపొందించి ఎస్టిమేషన్ పంపివ్వాలని స్థానిక నాయకులను ఆదేశించారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అయ్యే నిధులను కూడా పూర్తిగా మంజూరు చేయిస్థానాని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంచాల రాజేశ్వరి దశరథ, మంచాల గాలయ్య, మంచాల నరసింహ, మంచాల జంగయ్య, మంచాల ఏసు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం రవి, సీపీఐ గ్రామ కార్యదర్శి కప్పల నరసింహ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు లోడ రవి, బెల్లంకొండ శంకరయ్య, గడ్డం శంకరయ్య, మమ్మద్ కాలేక్, శనిగల సైదులు,ఎర్ర లక్ష్మయ్య బక్కతట్ల వెంకటేష్,నాది లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

### డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు



విశ్వాంభర, పరిగి: మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్టులో శుక్రవారం ఎమ్మెల్యే టి, రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు లక్నాపూర్ ప్రాజెక్టులో ప్రత్యేక పూజలు చేసి ఉచిత చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. చేప పిల్లలను పెంచి మత్స్యకారులు ఉపాధిని పొందాలన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో 100 శాతం సబ్సిడీతో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి వెంకటయ్య, పరిగి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు అభిరామ్, ఆంజనేయులు, చిన్న నర్సింలు, రామ్ రెడ్డి, రామ్ చందర్ యాదవ్, వెంకటయ్య శ్రీనివాస్, వెంకటేష్, జగన్, రామకృష్ణారెడ్డి, అయూబ్, సర్వర్, నరేష్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మండల పూజ



విశ్వంభర, నర్సంపేట: స్థానిక నర్సంపేట పట్టణం లోని శుక్రవారం శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి సేవ చారిటబుల్ ట్రస్ట్ నర్సంపేట ఆలయంలో వ్యవస్థాపక ఛైర్మన్ సేవారత్న అవార్డు గ్రహీత కీర్తిశేషులు శింగిరికొండ రామాంజ నేయులు గుప్తా, ఛైర్మన్ శింగిరికొండ మాధవ్ శంకర్ గుప్తా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా మహా ద్వజారోహణం, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం జరిగింది. ఆలయ ఛైర్మన్ మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రత పూజలో 63 జంటలు పాల్గొన్నాయి. ఇట్టి కార్యక్రమంలో ఛైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా, ఆలయ అధ్యక్షులు సైఫ సురేష్, మాదారపు చంద్రశేఖరం గుప్తా, శ్రీరామ్ ఈశ్వరయ్య, చింతల కమలాకర్ రెడ్డి, దొడ్డ రవీందర్ గుప్తా, భూపతి లక్ష్మీనారాయణ, శ్రీరాముల శంకరయ్య, దొడ్డ వేణు మల్యాల రాజు,కిరాణా వర్తక సంఘం నర్సంపేట దాసరి నరసింహారెడ్డి, పుట్టా రామస్వామి, సోల్తి చిన్న సాంబయ్య, బండి వేణు సోల్తి రాజ్ కుమార్ పుల్లూరు వేణుగోపాల్ గుప్తా గాదగోని బిక్షపతి గౌడ్, మాలదారణ స్వాములు, భక్తులు 3000 మందికి పైగా పాల్గొన్నారు.

## గాయపడ్డ యువకులకు పరామర్శించిన సింగిల్ విండో డైరెక్టర్



విశ్వంభర, వెల్దండ: వెల్దండ మండల కేంద్రానికి చెందిన కొండపల్లి రమేష్, వారణాసి రమేష్ లు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మెరుగైన చికిత్స కోసం వెల్దండ మండల కేంద్రంలోని యెన్నం ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ వారిని హాస్పిటల్లో పరామర్శించారు. వారికి ఏ సహాయం కావాలన్నా అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొయ్యల పుల్లయ్య, ఎండి రషీద్, గుద్దటి కష్టాలు, విష్ణు భరత్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా కంఠమహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సురమాంబ సమేత కంఠ మహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంఠమహేశ్వర స్వామి దేవాలయం అధ్యక్షులు రాపర్తి కరుణాకర్, గౌడ సంఘం అధ్యక్షులు బద్దం యాదయ్య గౌడ్, గీత పనివారల సంఘం అధ్యక్షులు నీళ్ల గాలయ్య, మొగుదాల సత్తయ్య, పాలకుర్ల యాదయ్య, పాలకుర్ల సతీష్, మారగొని వెంకటేష్, నీళ్ల రాజు, దూసరి వెంకటేష్, నీళ్ల శ్రీశైలం, బొమ్మని రఘు, గణేష్, లింగస్వామి, రాజు, రాపర్తి నిఖిల్ గౌడ నాయకులు పాల్గొన్నారు.

## విజేతలకు మెడల్స్‌తో సత్కారం



విశ్వంభర, సికింద్రాబాద్: బాలల దినోత్సవం సందర్భంగా రాజీవ్ స్పోర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీ మాథుర్ విద్యాలయ హైస్కూల్ సైక్లింగ్ వెలోడ్రోమ్ స్టేడియంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాథుర్ విద్యాలయ పాఠశాల పిల్లలు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. మాజీ కేంద్రమంత్రి ప్రస్తుత తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి ముఖ్య అతిథిగా హాజరై జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పేరుతో స్పోర్ట్స్ మీట్ విజేతలకు మెడల్స్‌తో సత్కరించారు. రాజీవ్ స్పోర్ట్స్ అకాడమీ ఛైర్మన్ డాక్టర్ ఆర్వీఎల్ఎన్ ప్రసాద్, స్థానిక కార్పరేటర్లు డాక్టర్ సామల హేమ, కంది శైలజతో పాటు మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ సెక్రటరీ వై.రామారావు, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ ఏఆర్కే గోకుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 400 మందికి పైగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు హాజరయ్యారు.

## పూజాస్టోర్స్‌ను ప్రారంభించిన మధుర ఉపేందర్ రెడ్డి



విశ్వంభర, సరూర్ నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలో నూతన మహాదేవ్ స్టోర్స్ (రుద్రాక్ష, పూజ ఎసెన్షియల్) షాపును ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అరుణ, సర్వేశర్, అర్జున్ మహాదేవ్, ప్రశాంత్, సంతోష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



విశ్వంభర, పెద్ద శంకరంపేట: పెద్ద శంకరంపేట తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం నుండే మహిళలు పిల్లలు పెద్దలు తమ గృహాలలో తులసి, ఉసిరి చెట్లకు ప్రత్యేకంగా పలు రకాల పూలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పేట మండల పరిధిలోని కొప్పల్ ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయంలో, పేటలోని శివాలయం, విట్టలేశ్వర మాణిక్ ప్రభు తదితర దేవాలయాలలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆయా గ్రామాలలో సైతం దేవాలయాల్లో గృహాలలో మహిళలు దీపాలు వెలిగించి కార్తీక పౌర్ణమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు.

# ఆదివాసీల ఆరాధ్య దైవం
# భగవాన్ బిర్సా ముండా

- గిరిజనుల కోసం స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న బిర్సా ముండా
- నేటి యువత పోరాట యోధుల ఆశయాలు నెరవేర్చాలి
- బిర్సా ముండా కలలను సాకారం చేయాలి



విశ్వంభర, మహబూబాబాద్: ఆదివాసీల ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా అని, గిరిజనుల సంక్షేమం కోసం దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన మహా వ్యక్తి అని ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం ఐ.డి.ఓ.సి లోని ప్రధాన సమావేశ మందిరంలో జన్ జాతీయ గౌరవ్ దివస్ దినోత్సవం, బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మహబూబాబాద్ శాసన సభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్,రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మ చారి లతో కలసి బిర్సా ముండా చిత్ర పటానికి పులమలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రు నాయక్ మాట్లాడుతూ భూమి, నీటి కోసం పోరాటం చేయడమే కాకుండా భూమి శిస్తును వ్యతిరేకిస్తూ గిరిజన జాతి అభివృద్ధి కోసం బిర్సా ముండా నిరంతరం పోరాటం చేశారని, ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ యువ దినోత్సవం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమ కోసం 78 వేల 600 కోట్ల నిధులను కేటాయించిందని, ఆ నిధులతో గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. 1875 నవంబర్ 15వ తేదీన జన్మించిన బిర్సా ముండా చిన్నతనంలోనే బ్రిటిష్ వారిలో వణుకు పుట్టించారని, గిరిజనులలో మన సంస్కృతి మన విధానం అనే నినాదాలు ఇచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మ పథకం ద్వారా గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం గత సంవత్సరం ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని, దీని ద్వారా 24 వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించి వాటి ద్వారా గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.పథకం కింద జిల్లాలో 92 గ్రామాలను ఎంపిక చేశారని ఈ సందర్భంగా తెలిపారు.గిరిజనుల సంక్షేమ కోసం హక్కుల సాధన కోసం పోరాటాలు చేసే గొప్ప వ్యక్తులు నేటికీ ఉన్నారని అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ మాట్లాడుతూ 20 సంవత్సరాలు గల గిరిజన యువకుడు ప్రపంచాన్ని పాలిస్తున్న బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశాడని , గిరిజనుల జీవన విధానం సంస్కృతి హక్కులు పరిరక్షణ కోసం ఎంతగానో పోరాటం చేశారని ప్రత్యేకంగా స్వాతంత్ర పోరాటంలో గిరిజనుల పోరాటాలు కీలకపాత్ర పోషించాయని తెలిపారు. గిరిజన గ్రామాలు ఎవరి ఆధీనంలో బందీగా ఉండలేవని మా గ్రామాలు మా హక్కులు స్వతంత్రంగానే ఉంటాయని బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ గ్రామాలకు స్వతంత్రాన్ని ప్రకటించుకొని పాలించిన మహానుభావుడని కొనియాడారు. గతంతో పోలిస్తే గిరిజన ప్రాంతాలు గిరిజనుల జీవన ప్రమాణాలు ఏ విధంగా అభివృద్ధి చెందాయి మరింత అభివృద్ధి చెందాలంటే ఎలాంటి ప్రణాళికలు పథకాలు విది విధానాలు తీసుకురావాలో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పూర్వకాలంలో గిరిజనులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని బ్రిటిష్ ప్రభుత్వంలో దాదాపు 200 కు పైగా తెగలు క్రిమినల్స్ గా చిత్రీకరింపబడి వారి సొంత ప్రాంతంలో నివసించలేక అనేక ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి ఉందని అలాంటి పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిన గిరిజన నాయకుల త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని తెలిపారు. ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ బిర్సా ముండా బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం ఎంతగానో పోరాడిన మహనీయుడని కొనియాడారు. అడవి, భూమి, నీటి పై ఉన్న సర్వహక్కులు వాటిని కాపాడుకోవడం కోసం వాటి పరిరక్షణ కోసం పోరాటం చేసి, చోటా నాగపూర్ అనే కౌలు చట్టాన్ని తీసుకొచ్చారని, వనజాతి – జనజాతి – మన గిరిజన జాతి అని వారి హక్కుల కోసం పోరాడాడని అన్నారు. అదేవిధంగా కొమరం భీమ్ కూడా గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఎంతగానో కృషి చేశారని వీరి భావాలను ఆదర్శంగా తీసుకొని గిరిజన యువత ముందుకెళ్లాలని సూచించారు. గిరిజన అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ ఆచరణలోకి తీసుకురావాలని అన్నారు.ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమములో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మారినేని వెంకన్న గిరిజన సంక్షేమ శాఖ అధికారి సైదా, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి ఎర్రయ్య కలెక్టరేట్ పరిపాలనాధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో పకడ్బందీగా సర్వే

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



విశ్వంభర, పెద్ద శంకరంపేట: మెదక్ జిల్లాలో పకడ్బందీగా సర్వే ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్నారని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం మెదక్ మండలం రాజ్ పల్లిలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాల నమోదును, కోమటూరులో ధాన్యం సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. సమగ్ర కుటుంబ సర్వే ఫారములు క్షుణ్ణంగా నింపే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే ఫారములను తప్పు లేకుండా నమోదు చేయాలని అన్నారు. సర్వే లక్ష్యాలు నెరవేర్చే బాధ్యత ఎన్యుమరేటర్ల దేనని, చెప్పారు. సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ముందుకు వెళ్ళాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్యూమరేటర్లు సర్వేలో క్వాలిటీ తో పాటు క్వాంటిటీ ని కూడా ఫోకస్ చేసుకుంటూ ఇంకా జరుగబోయే రోజులో కూడా ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూసుకోవాలన్నారు. సర్వేకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని బ్లాక్ లలో ఎన్యూమరేటర్ల ద్వారా సర్వే ప్రక్రియ కొనసాగించాలన్నారు. ప్రజలు సరైన సమాచారాన్ని ఇచ్చి సర్వే సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులుగా కృష్ణమూర్తి



విశ్వంభర, పెద్ద శంకరంపేట: మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులుగా మహంకాళి కృష్ణమూర్తి నియమాకమయ్యారు. నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్ శుక్రవారం అందజేశారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట గ్రామానికి చెందిన చేనేత సహకార సంఘం మాజీ ఛైర్మన్ మహంకాళి కృష్ణమూర్తినీ మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులుగా రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్ నియమించారు. ఈ సందర్భంగా మహంకాళి కృష్ణమూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మెదక్ జిల్లా చైతన్య వేదిక అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు వీర మోహన్, పద్మశాలి మెదక్ జిల్లా సంఘం అధ్యక్షులు జయ రాములు, గుజ్జరి కనకరాజు లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పద్మశాలి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి చైతన్య వేదిక ద్వారా తీసుకెళ్తానని అన్నారు.

## పేటలో అయ్యప్ప మాల ధారణలు ప్రారంభం



విశ్వంభర, పెద్ద శంకరంపేట: మండల కేంద్రమైన పెద్ద శంకరం పేటలో అయ్యప్ప మాల ధారణ కార్యక్రమాలు ప్రారంభ మయ్యాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా వేణు గోపాల స్వామి ఆలయంలో గల అయ్యప్ప స్వామి ఉప ఆలయంలో రామచంద్రాచారి గురుస్వామి పలువురికి అయ్యప్ప మాలలు వేశారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ ప్రతి ఏట మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పెద్ద శంకరంపేట మండల పరిధిలో పెద్ద ఎత్తున భక్తులు అయ్యప్ప మాలలు ధరించి ఆధ్యాత్మిక చింతనతో మండలం పాటు పూజా కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం పెద్ద శంకరంపేట లో 100 మంది పైగా మాల ధారణ చేసి ఎంతో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజలు నిర్వహిస్తుంటారని ఆయన పేర్కొన్నారు.

## కల్యాణ లక్ష్మీ పథకాన్ని వినియోగించుకోవాలి

నియోజవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి



విశ్వంభర, కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 132 డివిజన్ జై రామ్ నగర్ వాసులు అనిల్ సోదరి కె. భారతికి రూ. 1,00116 ల కల్యాణ లక్ష్మి చెక్కును నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరూ కల్యాణ లక్ష్మీ పథకాన్ని వినియోగించుకోవాలని, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బెకు శ్రీనివాస్, ఎన్ఎంసీ బీసీ సెల్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, కుమార్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ వర్మ, అనిల్, సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మి, అండాలు, తదితరులు పాల్గొన్నారు.

## లింగంధన లో రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి



విశ్వంభర, కేశంపేట: కేశంపేట మండలం లింగంధన గ్రామంలో జరుగుతున్న రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రేణుక ఎల్లమ్మ ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తో పాటు పీఏసీఎస్ ఛైర్మన్ జగదీష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్, లింగందన మాజీ సర్పంచ్ ప్రతాప్, పాపిరెడ్డి గూడ మాజీ సర్పంచ్ విష్ణు వర్ధన్ రెడ్డి, గ్రామ ప్రజలు, నాగిళ్ళ రామస్వామి, నాగిళ్ళ కృష్ణయ్య, జంగయ్య, వెంకట్, కృష్ణయ్య, పురుషోత్తం, భాస్కర్, బాలస్వామి, కనుగుల శ్రీను, తిరుపతి రెడ్డి, లింగం, శేఖర్, మణికంఠ, బాబు, చిన్న రాములు, తొమిది రేకుల ఉపసర్పంచ్ రాంరెడ్డి, పురుషోతం, కిషోర్, మల్లేష్, ఆంజనేయులు, నరసింహ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రూప్ -3 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్



విశ్వంభర, పరిగి: గ్రూప్ -3 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని శుక్రవారం పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 17, 18 న జరుగుతున్న గ్రూప్-3 పరీక్ష కేంద్రాలు పరిగి పట్టణంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్, పల్లవి డిగ్రీ కళాశాల, న్యూ బ్రిలియంట్ హై స్కూల్, విజ్ఞాన్ జూనియర్ కళాశాల, విద్య అరణ్యపురి లోని ఒగా బీఈడీ కళాశాలలో సెంటర్లు ఉన్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరిగి పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపులు గుంపులుగా ఉండకూడదని, జిరాక్స్ సెంటర్ల ను మూసి వేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి ఉండదని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయపాలన పాటించాలని తెలిపారు.

## గ్రూప్ ఫోర్ ఫలితాల్లో సత్తా చాటిన రావిచేడు యువకుడు



విశ్వంభర, కడ్తాల్: తాజాగా వెల్లడైన గ్రూప్ 4 ఫలితాల్లో కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామానికి చెందిన పసుల బాలరాజ్ యాదవ్, బాలమణి దంపతుల కుమారుడు పసుల మహేష్ యాదవ్ సత్తా చాటారు. మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్ గా ఎంపికయ్యారు. మహేష్ ఒక్కరే గ్రామంలో గ్రూప్ 4 ఉద్యోగం సాధించడంతో కుటుంబీకులు, గ్రామస్థులు, మిత్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## శ్రీ మీనాక్షీ అగస్త్యేశ్వర స్వామి దర్శించుకున్న ఎమ్మెల్యే బత్తుల



విశ్వంభర, మిర్యాలగూడ: కార్తీక పౌర్ణమి సందర్భంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్), దామరచర్ల మండలంలోని వాడపల్లి కొలువుతీరిన శ్రీ మీనాక్షీ అగస్త్యశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలసి అఖండ జ్యోతిని వెలిగించడం జరిగింది. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గం ప్రజలందరు స్వామి వారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



విశ్వంభర, షాద్ నగర్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో శుక్రవారం రాత్రి శ్రీదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలను చేశారు. ప్రతి పౌర్ణమి రోజున స్వామివారికి విశేష పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, కార్యదర్శి రెటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య, అర్చకులు రవిశర్మ, సంతోష్ శాస్త్రి, సునీల్, విజయ్, భక్తులు రెటికల్ చంద్రకాంత్, కడియాల శివకుమార్ దంపతులు, పులిపాటి సీతారాములు, కొట్టే వీరన్న దంపతులు, శేఖర్ రెడ్డి దంపతులు, సుంకు వైద్యనాథ్ దంపతులు, సురేష్, బైరి హరీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

- మాదిగలకు ఏబీసీడీ వర్గీకరణ చేయండి
- డాక్టర్ పిడమర్తి రవి



విశ్వంభర, కోదాడ: చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలని, మాదిగలకు ఏబీసీడీ వర్గీకరణ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు పిడమర్తి రవి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కోదాడ నియోజకవర్గంలో మాదిగల అసెంబ్లీ నియోజకవర్గ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న పిడమర్తి రవి మాట్లాడుతూ వివేకు వెంకటస్వామి మాలలను రెచ్చగొడుతున్నాడని, మా మాలల మీద ప్రేమ లేదని, కేవలం మంత్రి పదవి కోసం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం చేస్తున్నారని అన్నారు. 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో వివేక్ వెంకటస్వామి ఏ రోజు మాలల పక్షాన మాట్లాడలేదని, వర్గీకరణ వ్యతిరేకిస్తూ ఏ కార్యక్రమం చేపట్టలేదని, కేవలం మాలల మీద సవతి తల్లి ప్రేమను తన మంత్రి పదవి కోసం మాల ఉద్యమం చేపట్టాడు అని అన్నారు. పార్లమెంటు సభ్యులుగా ఉన్న సమయంలో పార్లమెంటులో ఏ ఒక్కరోజు మాలల గురించి మాలల అభివృద్ధి గురించి మాట్లాడలేని వివేకు వెంకటస్వామి ఈరోజు తన మంత్రి పదవి కోసం మాత్రమే మాలల గురించి మాట్లాడుతున్నారు అని అన్నారు. మాల సమాజం వివేక్ వెంకటస్వామిని నమ్మే పరిస్థితుల్లో లేదని, మాల సమాజాన్ని మొత్తం వివేక్ వెంకటస్వామి తన మంత్రి పదవి కోసం వాడుకుంటున్నారు తప్ప, మాలల ప్రయోజనానికి కాదని అన్నారు. వివేక్ వెంకటస్వామి తెలంగాణ రాష్ట్రంలో మాదిగలు చేస్తున్న వర్గీకరణ ఉద్యమానికి బెషరతుగా మద్దతు ఇవ్వాలని, 30 సంవత్సరాల ఈ పోరాట ఫలితంగా ముగింపు పలికే సందర్భం వచ్చిందని, దీనికి రాష్ట్రంలోని సబ్బండ వర్గాలు మద్దతు ప్రకటించాలని కోరారు. వర్గీకరణ ఫలాలు కులాల జనాభా దామాషా ప్రకారం ఉంటాయని, ఏ కులానికి అన్యాయం జరగదని అన్నారు. మాల సమాజం వివేక్ వెంకటస్వామి మాయమాటలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ మాదిగ జేఏసీ అధ్యక్షులు బెజవాడ శ్రావణ్, వంగూర్ దామోదర్, మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండమీది గోవిందరావు, చిర్ర శ్రీనివాస్ సైదులు, మాదిగ జేఏసీ కోదాడ నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ




విశ్వంభర, షాద్ నగర్: మహిళలు కష్టపడి పని చేస్తే తమ కుటుంబాలను బాగు చేసుకోగలుగుతారని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, తద్వారా దేశం కూడా అభివృద్ధి పథంలో నడుస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎఫ్ సీ ఎన్ హెూమ్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహాయ సహకారాలతో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ సి ఎన్ హెూమ్ ప్రతినిధులు మాట్లాడుతూ 130 కుట్టుమిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, వాటి ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, తమ కుటుంబ, పిల్లల అభివృద్ధిలో పాలుపంచుకోవడానికి ఈ కుట్టు మిషన్లు ఎంతో దోహదపడతాయని, వాటి ద్వారా అద్భుతమైన పనితీరును కనపరచుకొని ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలని వారి వారి కుటుంబాలను ఆర్థికంగా బలపరుచుకోవాలని థామస్, గీత అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ హెూం ప్రతినిధులకు ఎప్పుడు ఏం అవసరం వచ్చినా, మహిళల ఆర్థిక ప్రగతికి సహకారం అందిస్తున్న హెూం ప్రతినిధులకు ఎలాంటి అవసరం వచ్చిన తానెప్పుడూ వారి వెంట ఉంటానని, అలాగే ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్గనూరి విశ్వం, కొంకల్ల చెన్నయ్య, కేశంపేట మండలం మాజీ జడ్పీటీసీ తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి, ఎల్లనమోని యాదయ్య యాదవ్, ఎస్ బీ పల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్, ఇనుముల నర్వ చిరు వ్యాపారి శేఖర్ సెట్, హెూమ్ ప్రతినిధులు థామస్, గీత, గోవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని తుమ్మల గూడెం గ్రామంలో శుక్రవారం ఐకేపీ మరియు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తెచ్చే ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా చూడాలన్నారు. రైతుల వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేస్తున్నారా లేదా అని రిజిస్టర్ ను చూశారు. రైతులు పండించిన ధాన్యం మిల్లులకు ఆరబెట్టుకొని తేవాలని, నిబంధన ప్రకారం తేమ శాతం ఉండేలా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. తూకంలో జాప్యం జరిగితే చర్యలు తప్పవన్నారు. తూకం వేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు రైతుల వివరాలు ఆన్లైన్లో ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతుల ఖాతాల్లో, సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. రైతులను ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కొనుగోలు ఎలా జరుగుతుంది అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వలిగొండ మండలంలోని నాగారం గ్రామంలో ఉన్న వాసవి రైస్ మిల్లును అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. వచ్చిన ధాన్యాన్ని త్వరగా అన్లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. రైస్ మిల్లులో ధాన్యం దిగుమతులలో జాప్యం లేకుండా చూడాలని రైస్ మిలర్లకు ఆదేశించారు. ఏమైనా సమస్యలు వస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టం: ప్రధాని

**విశ్వంభర, పట్నా:** దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ ఆదివాసీ మహిళకు తమ ప్రభుత్వం అత్యున్నత రాష్ట్రపతి పదవిని ఇచ్చి గౌరవించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మొదట్లో ఆ పదవికి ఆమె పేరును ప్రతిపాదించగానే ముర్మును భారీ మెజారిటీతో గెలిపించాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్ దేశం మొత్తానికి పిలుపునిచ్చారని ప్రధాని గుర్తుచేసుకున్నారు. పీఎం జన్‌మన్ యోజన పథకం ద్వారా పనుల ప్రారంభ ఘనత ద్రౌపదీ ముర్ముదే అని కొనియాడారు. ఆదివాసీల కష్టాలను తీర్చేందుకు ఈ పథకం ద్వారా రూ.24వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. బిహార్‌లో నిర్వహించిన సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఆదివాసీలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.గత ప్రభుత్వాలు వెనకబడిన వర్గాల సంక్షేమం గురించి ఎప్పుడూ ఆలోచించలేదని.. వారి అభివృద్ధికోసం కృషి చేయలేదని ప్రధాని విమర్శించారు. సమాజానికి దూరంగానివసిస్తున్న ఆదివాసీలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.వారు పండించే దాదాపు 90 అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇచ్చామన్నారు. ఆదివాసీ యువత క్రీడలలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని.. వారిని మరింత ప్రోత్సహించడానికి అనేక క్రీడా సౌకర్యాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆదీవాసీలకుచదువు,సంపద,వైద్య సదుపాయాలుకల్పించడమే లక్ష్యంగాతమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వారి సంక్షేమానికి ప్రత్యేక



# ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో కశ్మీర్‌పై చర్చ.. భారత విద్యార్థుల ఆగ్రహం



**వాషింగ్టన్:** ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఓ చర్చా వేదిక తీవ్ర దుమారానికి తెర తీసింది. శుక్రవారం ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో డిబేటింగ్ సొసైటీ నిర్వహించిన చర్చలో జమ్మూ కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి గురించి కమిటీ సభ్యులు మాట్లాడటంతో భారత విద్యార్థులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కశ్మీర్‌పై మాట్లాడిన ముజ్జామ్మిల్ ఆయూబ్ ఠాకూర్, జఫార్‌ఖాన్‌లకు ఉగ్రవాద గ్రూపులతో సంబంధాలున్నాయని భారత విద్యార్థులు విమర్శించారు.

ప్రజలను రెచ్చగొట్టడమే లక్ష్యంగా ఆయూబ్ ఠాకూర్ తరచూ విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వారికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. 'ఆక్స్‌ఫర్డ్ యూనియన్ ఎల్లప్పుడూ ఉగ్రవాదుల వైపే ఉంటుందని' వారు ఆరోపించారు. జమ్మూ కశ్మీర్ అప్పుడు..ఇప్పుడు..ఎప్పుడూ భారత్‌లోనే ఉంటుందని పేర్కొన్నారు. 1984లో లండన్‌లో భారత దౌత్యవేత్త రవీంద్ర మాత్రే కిడ్నాప్, హత్య వెనక జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ ఉందని ఆరోపించారు.ముజ్జామ్మిల్ ఆయూబ్ ఠాకూర్ "వరల్డ్ కాశ్మీర్ ఫ్రీడమ్ మూవ్‌మెంట్" అనే సంస్థను స్థాపించారు. ఆయన తండ్రితో కలిసి సంయుక్తంగా "మెర్సీ యూనివర్సల్" అనే సంస్థను స్థాపించాడు. కాగా ఈ రెండింటికి ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉందనే ఆరోపణలపై అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐతో పాటు యూకేకు చెందిన నిఘా సంస్థలు విచారణ జరిపినట్లు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

# మోదీ ఎయిర్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక సమస్య



**రాంచీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయాణించాల్సిన ఎయిర్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక సమస్య ఎదురైంది.ఝూరండ్‌లో ఎన్నికల ప్రచారం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో ఢిల్లీకి ప్రధాని తిరుగు ప్రయాణం ఆలస్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం ఈ ఉదయం ప్రధాని మోదీలో పర్యటించారు.రెండు ప్రాంతాల్లో ర్యాలీల్లో పాల్గొన్నారు. దాన్ని ముగించుకుని ఢిల్లీ తిరిగి వెళ్లేందుకు దేవ్‌గఢ్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే ప్రధాని ప్రయాణించాల్సిన ఎయిర్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో టేకాఫ్ అవ్వలేదు. ప్రస్తుతం సాంకేతిక బృందం సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తోంది. మరోవైపు, ఇదే రోజున ఝూర్ఖండ్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెలికాప్టర్ కూడా గంటకు పైగా నిలిచిపోయింది.ఎయిర్ ట్రాఫిక్‌కంట్రోల్ నుంచి అనుమతి రాకపోవడంతో గోడ్డాలో ఆగిపోయింది. దీంతో రాహుల్ గాంధీ షెడ్యూల్‌కు ఆటంకం ఏర్పడింది. అయితే, దీనికి భాజపానే కారణమని కాంగ్రెస్ ఆరోపించింది.ఝూర్ఖండ్‌లో ఈ నెల 13న తొలి విడత పోలింగ్ జరగ్గా.. నవంబరు 20న మహారాష్ట్రతోపాటు రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 23న ఫలితాలను వెల్లడించనున్నారు.

# 'భారత్‌కు ఆ ఇబ్బందులు తప్పవు'.. వెల్లడించిన ట్రంప్ మాజీ సహాయకురాలు

**వాషింగ్టన్:** డొనాల్డ్ ట్రంప్ రెండోసారి పాలనలో కూడా భారత్ విషయంలో పెద్దగా మార్పు ఉండదని ఆయన ఒకప్పటి సహాయకురాలు లీసా కర్టిస్ పేర్కొన్నారు. ఆమె పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ట్రంప్ భారత్ వైఖరిపై పలు అంశాలను వెల్లడించారు. 2017-21 వరకు ఆమె అమెరికా అధ్యక్షుడి డిప్యూటీ సహాయకురాలిగా, దక్షిణ-మధ్య ఆసియా ఎన్ఎస్ఏ సీనియర్ డైరెక్టర్‌గా పని చేశారు. ట్రంప్ తన మొదటివిడత పాలన ముగింపు సమయంలో అసంపూర్తిగా ఉన్న అంశాల నుంచి ఈసారి రెండోవిడత మొదలవుతుందని లిసా వెల్లడించారు. వీటిల్లో సుంకాలు, రష్యా నుంచి ఆయుధాల కొనుగోళ్లు, ఇరాన్ నుంచి చమురు దిగుమతి వంటివి కీలకపాత్ర పోషించనున్నాయన్నారు. "ఆయన అసంపూర్తిగా వదిలి వెళ్లిన అంశాల నుంచి ఈసారి మొదలుపెడతారనుకుంటున్నాను. భారత్ విషయంలో ట్రంప్‌నకు సానుకూల దృక్పథం ఉంది. ఇరుదేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని నేను భావిస్తున్నాను.ట్రంప్ తొలివిడత పాలనలో భారత్-అమెరికా సంబంధాలు బలోపేతం అయ్యాయి. చైనా నుంచి పొంచిఉన్న ముప్పు వీటిని మరింత ముందుకు నడిపింది. హూస్టన్‌లో 50,000 మంది అమెరికన్లను ఉద్దేశించి మోదీ ప్రసంగించడాన్ని చూశాం.. అహ్మదాబాద్‌లో 1,00,000 మందిని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించడాన్ని వీక్షించాం. వారి మధ్య ఉన్న ఆ మిత్రత్వంతో చాలా పురోగతి సాధ్యమైంది.చాలావరకు టెక్నాలజీ నియంత్రణ ఆంక్షలను భారత్‌పై నుంచి తొలగించారు. సాయుధ డ్రోన్ల టెక్నాలజీ న్యూఢిల్లీకి లభించింది. ఇప్పుడు 31 సీగార్డియన్ ప్రిడేటర్లను కొనుగోలు చేస్తోంది. రక్షణ, భద్రత విషయంలోనే కాదు.. పరస్పర విశ్వాసం, నమ్మకంలోను పురోగతి సాధించింది" అని పేర్కొన్నారు.



### ట్రంప్‌తో సమస్యలూ ఉన్నాయి..

ట్రంప్ నుంచి భారత్‌కు కేవలం లాభాలే కాదు.. సమస్యలూ ఉన్నాయని లీసా అభిప్రాయపడ్డారు. "కొన్ని ఒడిదొడుకులు కూడా తప్పవు. భారత్ సుంకాలపై ట్రంప్ ట్వీట్ చేసినప్పుడే సమస్య మొదలైంది. అమెరికా కంపెనీలకు భారత మార్కెట్లో మరిన్ని అవకాశాలు రావాలని ఆయన కోరుకుంటారు. ఆయన ప్రతి భేటీకి ముందు ఏదోఒక ట్వీట్ చేస్తుంటారు. ట్రంప్ బేరమాడటానికి వాడే టెక్నిక్ అది. ఆయన చాలా దేశాల విషయంలో ఇలానే చేశారు. ఇదే భారత్‌తో కొంత ఇబ్బందికర అంశంగా మారుతుంది. ఇలాంటివే జరుగుతాయని నేను అంచనా వేస్తున్నాను. ట్రంప్ స్టైల్ బేరసారాలకు ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉండాలి. ఆయనది పూర్తిగా ఇచ్చిపుచ్చుకొనే మనస్తత్వం. అమెరికన్ల కోసం ఏదో మంచి ఒప్పందం చేయాలని ప్రయత్నిస్తారు" అని ఆమె వెల్లడించారు. చైనాను ఎదుర్కొనే అంశంలో ఇరుపక్షాల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని లీసా తెలిపారు. ఈవిషయంలో పరస్పర సహకారం బలపడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు.

# హాస్పిటల్‌లో భార్య, కుమార్తె, మరో వ్యక్తిని కత్తితో పొడిచి చంపిన వ్యక్తి



**ఇటానగర్:** ఒక వ్యక్తి ఉన్మాదిగా ప్రవర్తించాడు. హాస్పిటల్‌లో భార్య, కుమార్తెతోపాటు మరో వ్యక్తిని కత్తితో పొడిచి చంపాడు. పోలీసులతోపాటు మరి కొందరిపై కత్తితో దాడి చేశాడు. చివరకు అతికష్టం మీద ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని తూర్పు కమెంగ్ జిల్లాలోఈ సంఘటనజరిగింది. సెప్పాలోని జిల్లా ఆసుపత్రిలో 40 ఏళ్ల నికమ్ సంగ్బియా చెలరేగిపోయాడు.ప్రస్తుతం ఎక్కడా కనిపించని సాంప్రదాయక కత్తి 'దావో'తో భార్య, కుమార్తె, మరో వ్యక్తిపై దాడి చేశాడు. కత్తితో పలుమార్లు పొడిచి వారిని చంపాడు. అక్కడున్న మరికొందరిపై కత్తితోదాడి చేసి గాయపర్చాడు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఆ హాస్పిటల్‌కు చేరుకున్నారు. అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై కూడా నికమ్ ఆ కత్తితో దాడి చేశాడు. దీంతో పలువురు పోలీసులు గాయపడ్డారు. చివరకు ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యసహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గాయపడిన వారిని మరో హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీస్ అధికారి తెలిపారు.

# 80 గంటలు పని చేసేవారు కావాలి..

## మస్క్, వివేక్‌ల కోసం ఎక్స్‌లో ఆసక్తికర పోస్ట్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిలకు కీలక బాధ్యతలు అప్పగించారు. వీరిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ సంయుక్త సారథులుగా నియమించిన విషయం తెలిసిందే. కాగా ఈ శాఖ సోషల్ మీడియా ఎక్స్‌లో పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. మస్క్, వివేక్ కోసం 80 గంటలు పనిచేసేవారు, హై ఐక్యూతో పనిచేసేవారు ఈ శాఖకు కావాలని సంబంధిత వర్గాలు అభ్యర్థించాయి. డోజ్ కోసం పని చేయాలనుకునేవారు ఎక్స్‌లోని తమ అధికారిక ఖాతాకు దరఖాస్తులు పంపించాలని కోరాయి. అయితే ఎక్స్ ప్రీమియం అకౌంట్ సబ్‌స్క్రిప్షన్ ఉన్నవారు మాత్రమే ఈ పోస్టులకు అర్హులని,ఎంపిక చేసిన 1శాతం దరఖాస్తులను ఎలాన్ మస్క్, వివేక్ పరిశీలిస్తారని వెల్లడించారు. అంతేకాకుండా పార్ట్ టైమ్ ఐడియాలు ఇచ్చేవారు తమకు అవసరం లేదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో పని చేయాలనుకునేవారు తమ రెజ్యూమెలను ఎక్స్‌లో డైరెక్ట్ మెసేజ్ ద్వారా పంపాలని కోరారు. కాగా ఈ వారం ప్రారంభంలో రూపొందించిన ఈ ఖాతా ఇప్పటికే 1.2 మిలియన్ల మంది ఫాలోవర్లను సంపాదించుకుందిప్రస్తుత అమెరికా ప్రభుత్వం దుబారా ఖర్చులు చేస్తోందని.. ప్రభుత్వ వ్యవస్థల్లో సమూల మార్పులే లక్ష్యంగా 'డోజ్' ప్రాజెక్టు రూపొందించామని అధికారులు పేర్కొన్నారు. ఈ శాఖను సమర్థంగా ముందుకుతీసుకువెళ్లి ప్రభుత్వ వ్యవస్థలో మస్క్, వివేక్ మార్పులు తెసారని తాను ఆశిస్తున్నట్లుగా డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఏటా ప్రభుత్వం ఖర్చుపెడుతున్న 6.5 ట్రిలియన్ డాలర్లలో దుబారా, అవినీతిని అరికడతామన్నారు. ఫెడరల్ సంస్థలను పునర్నిర్మించి మస్క్, వివేక్ తన పాలనకు మార్గం సిద్ధంచేస్తారని ఆశిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. 'సేవ్ అమెరికా' ఉద్యమానికి ఈ మార్పులు తప్పనిసరి అని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో వృథా ఖర్చులకు కత్తెర వేయాలని వారిరువురిని ఆదేశించారు. గతంలో ఓ కార్యక్రమంలో ఎలాన్‌మస్క్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం దుబారా ఖర్చులు చేస్తుందని దుయ్యబట్టారు. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వస్తే దాదాపు రూ.168 లక్షల కోట్లు ఆదా చేయొచ్చని అన్నారు. దీనికోసం ట్రంప్ ప్రభుత్వం సమర్థత విభాగం కృషి చేస్తుందని మస్క్ పేర్కొన్నారు.

# పినాకా రాకెట్ లాంచర్‌ను పరీక్షించిన డీఆర్డీవో



న్యూఢిల్లీ: పినాకా రాకెట్ లాంచర్‌ను శుక్రవారం డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. ప్రపంచవ్యాప్తంగా ఆ వెపన్ సిస్టమ్‌కు డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్ గైడెడ్ వెపన్ సిస్టమ్‌ను డీఆర్డీవో డెవలప్ చేసింది. పినాకా ఆయుధ వ్యవస్థకు చెందిన రేంజ్, కచ్చితత్వాన్ని, స్థిరత్వాన్ని, ఫైరింగ్ రేట్‌ను పరీక్షించారు. ప్రొవిజినల్ స్టాఫ్ క్వాలిటేటివ్ రిక్వైర్మెంట్స్ ట్రయల్స్‌లో భాగంగా పినాకా వెపన్ సిస్టమ్‌ను టెస్ట్ చేశారు. పినాకా లాంచర్ల ద్వారా 12 రాకెట్లను ఫైరింగ్ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# 700 కిలోల డ్రగ్స్‌తో పట్టుబడిన ఇరాన్ బోటు.. 8 మంది అరెస్ట్



అహ్మదాబాద్: భారీ స్థాయిలో డ్రగ్స్ ఉన్న ఇరాన్ బోటు భారత సముద్ర జల్లాల్లోకి ప్రవేశించింది. దీంతో ఇండియన్ నేవీ, ఎన్సీబీ, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. 700 కిలోల మెత్‌ను స్వాధీనం చేసుకున్నారు. 8 మంది ఇరాన్ జాతీయులను అరెస్ట్ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున గుజరాత్ సముద్ర తీరంలోని భారత ప్రాదేశిక జలాల్లో ఇరాన్ బోటు అనుమానాస్పదంగా కనిపించింది. అందులో డ్రగ్స్ ఉన్నట్లు నిఘా వర్గాలు సమాచారం ఇచ్చాయి.కాగా, ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్ 'సాగర్ మంథన్ 4' అనే కోడ్‌నేమ్‌తో ఆపరేషన్ చేపట్టాయి. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), గుజరాత్ పోలీస్‌కు చెందిన యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్)తో కలిసి ఆ బోటు వద్దకు చేరుకున్నారు. ఇరాన్ బోటును తనిఖీ చేశారు. అందులో ఉన్న మెత్‌గా పిలిచే 700 కిలోల మెథంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బోటు లో ఉన్న 8 మంది ఇరానీయన్లను అరెస్ట్ చేశారు.ఈ డ్రగ్స్ విలువ మార్కెట్‌లో రెండు నుంచి ఐదు కోట్ల వరకు ఉంటుందని ఎన్సీబీ అధికారులు తెలిపారు. ఈ డ్రగ్స్ ఎవరికి సరఫరా చేసేందుకు తరలిస్తున్నారో అన్నది దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# మందు పార్టీ తర్వాత వేగంగా కారులో స్టూడెంట్స్ ప్రయాణం

## ప్రమాదంలో ఆరుగురు మృతి, రోడ్డుపై తెగిన తలలు, శరీర భాగాలు



**డెహ్రాడూన్:** ఏడుగురు విద్యార్థులు మందు పార్టీ చేసుకున్నారు. ఆ తర్వాత బీఎండబ్ల్యూలో వేగంగా ప్రయాణించారు. ఆ కారు ప్రమాదంలో ఆరుగురు దారుణంగా మరణించారు.వారి తెగిన తలలు,శరీర భాగాలు రోడ్డుపై పడ్డాయి. మృతుల్లో ముగ్గురు యువతులున్నారు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఈ సంఘటన జరిగింది. నవంబర్ 12న ఏడుగురు స్టూడెంట్స్ డెహ్రాడూన్‌లో జల్సా చేశారు. మందు పార్టీ చేసుకున్నారు. అర్ధరాత్రి వేళ బీఎండబ్ల్యూ కారులో హైస్పీడ్‌లో ప్రయాణించారు. డెహ్రాడూన్‌లోని ఓఎన్‌జీసీ చౌక్‌లో ఆ కారు ప్రమాదానికి గురైంది. ఆరుగురు స్టూడెంట్స్ మరణించగా ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం తీవ్రత వల్ల స్టూడెంట్స్ తెగిన తలలు, శరీర భాగాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. మృతుల్లో ముగ్గురు యువతులున్నారు.కాగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరణించిన స్టూడెంట్స్‌ను డెహ్రాడూన్‌కు చెందినఅతుల్ అగర్వాల్ (24),రిషబ్ జైన్ (24), నవ్య గోయెల్ ( 23), కామాక్షి( 20), గునీత్ కౌర్ (19), హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కునాల్ కుక్రేజా (23)గా గుర్తించారు. మందు పార్టీ ఇచ్చిన డెహ్రాడూన్‌కు చెందిన సిద్ధేష్ అగర్వాల్ (25) ఒక్కడే ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే హాస్పిటల్‌లోని ఐసీయూలో చికిత్స పొందుతున్న అతడు కోమాలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు బీభత్స కారు ప్రమాదానికి ముందు ఆ స్టూడెంట్స్ మందు పార్టీ చేసుకున్న వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# ఢిల్లీలో తీవ్ర స్థాయిలో వాయు కాలుష్యం.. ఆన్‌లైన్‌లోనే ప్రైమరీ స్కూల్ క్లాసులు



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. వాయు నాణ్యత అత్యంత దారుణంగా క్షీణించింది. మూడవ రోజు వరుసగా సీవియర్ కేటగిరీ నమోదు చేసింది. ప్రపంచంలో అత్యంత కలుషితమైన రెండవ నగరంగా ఢిల్లీ నిలిచింది. ఢిల్లీలో ఇవాళ ఉదయం ఏడు గంటలకు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 498గా నమోదు అయ్యింది. పాకిస్థాన్‌లోని లాహోర్‌లో ఎయిర్ క్వాలిటీ 770గా రికార్డు అయ్యింది. ఢిల్లీలోని జహంగిర్‌పురి, బవానా, వాజిర్పుర్, రోహిణి, పంజాబీ బాగ్ ప్రాంతాల్లో అత్యధిక స్థాయిలో కాలుష్యం నమోదు అయ్యింది. ఢిల్లీలోని పాలమ్, సఫ్దార్‌జంగ్‌లో 500ఎం, 400ఎం విజిబులిటీ నమోదు అయ్యింది. ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో.. ఆ రాష్ట్ర సీఎం ఆతిషి ఇవాళ తన ఎక్స్ అకౌంట్‌లో ప్రకటన చేశారు. ప్రైమరీ స్కూళ్ల పిల్లలకు క్లాసులు ఆన్‌లైన్‌లోనే కొనసాగనున్నట్లు ఆమె తెలిపారు. మరో వైపు విజిబులిటీ సరిగా లేని కారణంగా విమానాలు, రైళ్ల రాకపోకలకు జాప్యం ఏర్పడుతోంది.

# రాష్ట్రంలో వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాం: చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి:** రాష్ట్రంలో వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రాన్ని నిలబెట్టాలనే ఉద్దేశంతోనే కూటమిగా ఏర్పడి పోటీ చేశామన్నారు. 93 శాతం స్ట్రైక్ రేట్‌తో గెలవడం ఒక చరిత్ర అని చెప్పారు. బడ్జెట్‌పై శాసనసభలో ఆయన మాట్లాడారు. మోదీ, పవన్, ప్రజలు నాపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారని దానిని నిలబెట్టుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు

"రాష్ట్ర విభజన సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొన్నాం. 2014లో మనకు లోటు కరెంట్ ఉండేది. అనేక విధానాలు తీసుకొచ్చి మిగులు కరెంట్ పరిస్థితికి తెచ్చాం. రాష్ట్రంలో సరికొత్త ఆర్థికవ్యవస్థకు శ్రీకారం చుట్టాం. అమరావతి రైతులుఎంతో నమ్మకంతో భూములు ఇచ్చారు. 2019లోనూ విజయం సాధించి ఉంటే.. 2021లోనే పోలవరం పూర్తయ్యేది. ఫలితాలు చూసేవాళ్లం. ఒక్క ఛాన్స్ అని వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. మేం ఊహించిన దాని కంటే ఎక్కువ విధ్వంసం చేశారు. గత ప్రభుత్వం జీవోలను కూడా ఆన్‌లైన్‌లో ఉంచలేదు. కాగ్‌కు కూడా నివేదికలు ఇవ్వలేదు. విభజన నష్టం కంటే గత ఐదేళ్లలోనే ఎక్కువ నష్టం జరిగింది. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు పారిపోయేందుకు సిద్ధంగా లేనని చెప్పాను. ఇప్పుడు భావి తరాలకు మేలు చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం.

### వినూత్న రీతిలో దోపిడీ

గత ఐదేళ్లలో వినూత్నమైన రీతిలో దోపిడీ చేశారు. వాళ్ల దోపిడీ కొనసాగించేందుకు వ్యవస్థలను కూడా నాశనం చేశారు. వైసీపీ చేసిన తప్పులు, అప్పులు రాష్ట్రానికి శాపంగా మారాయి. స్కామ్‌ల కోసమే స్కీమ్‌లు అమలు చేశారు. అమరావతి గొప్ప నగరంగా తయారుకాకుండా ఐదేళ్లు అడ్డుకున్నారు. రాష్ట్ర జీవనాడి పోలవరాన్ని దెబ్బతీశారు. నదుల అనుసంధానం పూర్తయితే రాష్ట్రంలో కరవు అనేదే ఉండదు.

### మద్యంపైనా ఇంత అవినీతా?


పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోతే రెండేళ్లపాటు పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కోల్పోయాం. తప్పుడు విధానాలతో విద్యుత్ కొన్నారు. ఆ సంస్థలను నష్టాల్లోకి నెట్టారు. గ్రామాల్లోఉచితంగా లభించే ఇసుకపై వ్యాపారం చేసుకున్నారు. మద్యంపైనా ఇంతలా అవినీతి చేసారని మేం ఊహించలేదు. మద్యంపై రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చారు. చెత్తపైనాపన్ను వేసి ప్రజలను అనేక ఇబ్బందులు పెట్టారు. ఐదేళ్లపాటు హింసా రాజకీయాలు, కక్షపూరిత కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యర్థిని దెబ్బతీసేందుకు అనేక పనులు చేశారు.

### ఆర్థిక ఉగ్రవాదం సృష్టించి

గత ప్రభుత్వం ఆర్థిక ఉగ్రవాదాన్ని సృష్టించింది. ప్రజలు విశ్వసించి ఓటేస్తే.. దుర్మార్గంగా ప్రవర్తించారు. గత ప్రభుత్వం సంపద సృష్టించే ఒక్క పని కూడా చేయలేదు. పెట్టుబడులు పెట్టేందుకు వస్తే తరిమేశారు. రూ.431 కోట్లతో రుషికొండ ప్యాలెస్ నిర్మించారు. రుషికొండ ప్యాలెస్‌ను చూస్తే నాకే కళ్లు తిరుగుతున్నాయి. ప్రజాధనంతో ఇంత పెద్ద ప్యాలెస్ కడతారా? పర్యావరణాన్ని విధ్వంసం చేసి రుషికొండ ప్యాలెస్ కట్టారు. రూ.700 కోట్లతో సర్వే రాళ్లపై బొమ్మలు వేశారు. సాక్షికి రూ.400 కోట్ల ప్రకటనలు ఇచ్చారు. రూ.500 కోట్లు ఖర్చు చేసి ఉంటే రోడ్లు బాగయ్యేవి. ఇప్పటి వరకు రూ.9,74,556 కోట్ల అప్పు తేలింది. గత ప్రభుత్వం జారీ చేసిన చీకటి జీవోలను ఆన్‌లైన్‌లో పెట్టాం. ఇసుకనుమేం ఉచితంగా ఇస్తే.. గత ప్రభుత్వం టన్ను రూ.475కి విక్రయించింది.

### మహిళలను కించపరిస్తే సహించం

కన్నతల్లి శీలాన్ని శంకించేలా పోస్టులు పెట్టించారు. ఆడబిడ్డలను కించపరిచేలా పోస్టులు పెడితే ఉపేక్షించం. అవినీతి, అక్రమాలు చేసేందుకు కొందరు రాజకీయాల్లోకి వచ్చారు. మహిళలను కించపరిచేలా కూటమి నేతలెవరూ పోస్టులు పెట్టరు.. పెట్టించబోరు. ఒక వేళ అదే జరిగితే సొంతవాళ్లని కూడా చూడకుండా కఠినంగా వ్యవహరిస్తాం.



### నా దగ్గర డబ్బుల్లేవు.. నూతన ఆలోచనలున్నాయ్

గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు పెట్టుబడులు రాలేదు. పరిశ్రమలు పక్కరాష్ట్రాలకు వెళ్లాయి. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల అధికారులు జైలుకెళ్లారు. గత ప్రభుత్వం ఆస్తులు తాకట్టుపెట్టి అప్పులు తెచ్చింది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం శ్రమిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చేసరికి రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉంది. ప్రజలు ఇచ్చిన గెలుపు వల్ల దిల్లీలో మన పరపతి పెరిగింది. నా దగ్గర డబ్బుల్లేవు.. నూతన ఆలోచనలు ఉన్నాయి. నూతన ఆలోచనలతో సంపద సృష్టిద్దాం. పేదలకు పంచుదాం. సంవత్సరానికి రూ.33 వేల కోట్ల పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. 64.50 లక్షల మందికి ఒకటో తేదీనే పింఛన్లు ఇస్తున్నాం. ఆడబిడ్డల భద్రతకు భరోసాఇస్తాం. ప్రజా సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని చంద్రబాబు అన్నారు.

## శాసనమండలిలో దుమారం..వైసీపీ సభ్యుల వాకౌట్



విశ్వంభర, అమరావతి: రాష్ట్రంలో వైద్య కళాశాలల నిర్మాణంపై శాసనమండలిలో దుమారం రేగింది. వైద్యకళాశాల నిర్మాణం విషయంలో నాటి సీఎం జగన్ పక్షపాతం చూపారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పులివెందుల కాలేజీకి తప్ప.. మిగతా ఏ కళాశాల నిర్మాణానికీ సరిపడానిధులివ్వలేదన్నారు. అధ్యాపకులకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం వల్లే.. ఈ ఏడాది వైద్యకళాశాలల నిర్వహణకు జాతీయ వైద్య మండలి అనుమతివ్వలేదని తెలిపారు. దీనంతటికీ కారణమైన జగన్ మళ్లీ కూటమి ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని సత్యకుమార్ మండిపడ్డారు. ఏడాదిలో తాడేపల్లి ప్యాలెస్ నిర్మించుకున్న జగన్.. వైద్యకళాశాలలు పూర్తి చేయలేకపోయారని దుయ్యబట్టారు. మంత్రి సమాధానం సరిగా లేదంటూ వైకాపా సభ్యులు వాకౌట్ చేశారు.

## కబ్జాదారుల గుండెల్లో దడ పుట్టించేలా శిక్షలు: మంత్రి అనగాని



**విశ్వంభర, అమరావతి:** గత ప్రభుత్వంలో 13.59 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శాసన మండలిలో ఆయన మాట్లాడారు. "గత ప్రభుత్వంలో 25వేల ఎకరాల భూమి అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు జరిగాయి. నిబంధనలకు విరుద్ధంగా 7,837 ఎకరాల్లో అక్రమాలు జరిగాయి. భూ కబ్జాలు అరికట్టేందుకే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తెస్తున్నాం. భూకబ్జాలకు పాల్పడిన వారికి 10-14 ఏళ్లు శిక్ష పడేలా కొత్త చట్టం ఉంటుంది. కబ్జాదారుల గుండెల్లో దడ పుట్టించేలా శిక్షలు ఉంటాయి. పేదల భూములు అన్యాక్రాంతం కాకూడదనే కొత్త చట్టం తీసుకొస్తున్నాం. మదనపల్లెలో 13 వేల ఎకరాల్లో పేర్లు మార్చారు. అక్కడి భూ అక్రమాల్లో ఎవరున్నా శిక్షిస్తాం" అని అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## మద్యం అక్రమాలపై సీఐడీ విచారణ: కొల్లు రవీంద్ర



**విశ్వంభర, అమరావతి:** కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను పెంచలేదని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా రాష్ట్రంలో కొత్త మద్యం విధానంపై మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీల ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. గతంలో కల్తీ మద్యం తాగి ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారని అన్నారు. " మేం వచ్చాక పారదర్శకంగా మద్యం దుకాణాలు కేటాయించాం. మేం తీసుకున్న చర్యలతో ప్రభుత్వానికి రూ.1,800 కోట్ల ఆదాయం వచ్చింది. గత ప్రభుత్వంలో రూ.1,800 కోట్ల అవినీతి జరిగింది. నాణ్యమైన మద్యాన్ని మాత్రమే అందుబాటులోకి తెచ్చాం. కొత్త మద్యం విధానం అనుసరించి మద్యం ధర తగ్గించాం. గత ప్రభుత్వ మద్యం అక్రమాలపై సీఐడీ విచారణ జరుపుతాం. అక్రమార్కుల అందరిపైనా చర్యలు తీసుకుంటాం" అని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయులపై అక్రమ కేసులు ఎత్తేస్తాం: నారా లోకేశ్



**విశ్వంభర, అమరావతి:** వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభ సమయానికి డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. న్యాయపరంగా చిక్కులు లేకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శాసనసభలో ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లలో ఉద్యోగ నియమకాలు సున్నా అని విమర్శించారు. డీఎస్సీ ద్వారా ఒక్క పోస్టు భర్తీ చేయలేదని మండిపడ్డారు. ఉపాధ్యాయులపై వైకాపా హయాంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తేస్తామన్నారు. తెదేపా హయాంలో మొత్తంగా 15 సార్లు డీఎస్సీ నిర్వహించామని వెల్లడించారు. ప్రస్తుతం కూటమి సర్కార్ మెగా డీఎస్సీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఇందుకు సంబంధించి అభ్యర్థులకు వయో పరిమితిని పెంచేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ మోడల్ ఎడ్యుకేషన్‌లో ఉపాధ్యాయుల్ని భాగస్వామ్యం చేస్తామని నారా లోకేశ్ తెలిపారు.

## కరవు నివారించడమే సీఎం చంద్రబాబు లక్ష్యం: మంత్రి నిమ్మల



**విశ్వంభర, అమరావతి:** నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో కరవు నివారించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని నిమ్మల రామానాయుడు అన్నారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. వైకాపా పాలనలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రెండు దశల్లో రూ.17,050 కోట్లకు పాలనా అనుమతులు ఇచ్చి రూ.5 పని కూడాచేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఆర్థిక ఇబ్బందులున్నా రూ.1600 కోట్లతో ఇప్పటికే టెండర్లు పూర్తిచేసి టైం షెడ్యూల్ కూడా ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి ప్రాధాన్యత పోలవరం, రెండో ప్రాధాన్యత ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు అని స్పష్టంచేశారు. వచ్చే నెలలో పనులు ప్రారంభించి 2025 జులై నాటికి గోదావరి వరద జలాలను ఉత్తరాంధ్రకు అందిస్తామని తెలిపారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిప్రాజెక్టు పూర్తిచేసి ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

## అసభ్యకర, అనుచిత పోస్టులపై చట్టం తెచ్చి కఠిన శిక్షలు వేయాలి: యనమల



**విశ్వంభర, అమరావతి:** సామాజిక మాధ్యమాల్లో అసభ్యతను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని తెదేపా ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. అసభ్యకర, అనుచిత పోస్టులపై చట్టం తెచ్చి కఠిన శిక్షలు వేయాలన్నారు. లేదంటే కొందరు దొంగలు వ్యక్తిత్వ హననం చేస్తారని చెప్పారు. సోషల్ మీడియా ప్రభావంతో ఫోర్త్ ఎస్టేట్ (మీడియా) కూడా వెనకబడుతోందని పేర్కొన్నారు. దీనిపై పూర్తి నియంత్రణ లేకపోతే సమాజానికే పెను ప్రమాదంగా పరిణమిస్తుందని తెలిపారు. సోషల్ మీడియా లో అసభ్యకర పోస్టులు పెట్టే వ్యక్తులను గుర్తించలేకపోతే అది సంఘవిద్రోహ శక్తులకు ప్రమాదకరమైన సాధనంగా మారుతుందన్నారు. ఇది ఇప్పటికే ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యానికి ఆజ్యం పోసినట్లవుతుందని యనమల రామకృష్ణుడు అభిప్రాయపడ్డారు.

## ఆర్థిక ఉగ్రవాది ఏం చేశారో గత ఐదేళ్లలో చూశాం: మంత్రి పయ్యావుల



**విశ్వంభర, అమరావతి:** ఆర్థిక ఉగ్రవాది ఏం చేశారో గత ఐదేళ్లలో చూశామని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బడ్జెట్‌పై ఆయన శాసనసభలో ప్రసంగించారు. "ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు వీలు లేకుండా చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను ఎలా పిలవాలో అర్థం కావట్లేదు. ఐదేళ్లలో ప్రతి శాఖలోనూ ఆర్థిక అరాచకమే జరిగింది. దేనికీ సరైన లెక్కలు, జమా ఖర్చులు లేవు. గత ప్రభుత్వం అంకెల గారడీతో అన్ని వ్యవస్థలను అస్తవ్యస్తం చేసింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలను తప్పుదారి పట్టించింది. ఇప్పుడు కూడా అంకెల గారడీ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంట్రాక్టర్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టారు. గత ప్రభుత్వ వైఖరితో అనేక మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. పిల్లలకు ఇచ్చే చిక్కీల బిల్లులు కూడా పెండింగ్‌లో పెట్టారు. ఫీజు రీయంబర్స్ చేయకపోవడంతో కళాశాలల విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వలేదు. మేం వచ్చాక సర్టిఫికెట్లు ఇప్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా పక్కన పెట్టింది. పోలవరం పనులు నిలిపివేసి డయాఫ్రమ్ వాల్ విధ్వంసానికి కారణమయ్యారు. రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదు. సూట్‌కేస్ కంపెనీలు.. బ్రీఫ్‌కేస్ కంపెనీలు.. క్విడ్ ప్రో కో పదాలు పరిచయం చేశారు. గత పాలకులు చేసిన ఇసుక, మద్యం మాఫియా అందరికీ తెలుసు.చట్ట సభల అనుమతి లేకుండా రూ.634 కోట్లు ఖర్చు చేసినట్లు కాగ్ చెప్పింది. అనుమతి లేని ఖర్చులు ఎవరి కోసం చేశారు? ఎందుకు చేశారు. వైకాపాహయాంలో పారిశ్రామికవేత్తలు పక్క రాష్ట్రాలకు పారిపోయారు. చంద్రబాబు వచ్చాక మళ్లీ అనేక మంది వస్తున్నారు. అమరావతి విధ్వంసం.. విశాఖ భూ దోపిడీ మీ అరాచకం కాదా? సంక్షేమం.. అభివృద్ధి.. బ్యాలెన్స్ చేసుకుంటూ బడ్జెట్ ప్రవేశపెట్టాం. రాష్ట్రానికి పరి శ్రమలు తెచ్చేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారు. అమెరికా పర్యటనలో ఆయన 90మంది పారిశ్రామికవేత్తలను కలిశారు."అనిపయ్యావుల కేశవ్ తెలిపారు.

## భక్తులతో కిటకిటలాడుతున్న శైవ క్షేత్రాలు



**విశ్వంభర, శ్రీశైలం :** కార్తిక పౌర్ణమి సందర్భంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. సముద్ర, నదీతీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. అమరావతిలో కృష్ణమ్మ చెంత మహిళలు తెప్పలు వదిలారు. సూర్య లంక, చీరాల, చినగంజాం, పెదగంజాం సముద్ర తీరాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు స్నానమాచరించారు. దక్షిణ కాశీగా పేరొందిన శ్రీశైలంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్రాక్షారామం, కోటప్పకొండ, శ్రీకాళహస్తి, మహానంది తదితర పుణ్యక్షేత్రాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

## తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమలకు 8 ప్రత్యేక రైళ్లు..



విశ్వంభర,హైదరాబాద్: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. శబరిమల క్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాలను కలుపుతూ 8 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఈ నెల 22, 29 తేదీల్లో మౌలాలి(హైదరాబాద్)-కొల్లాం, ఈనెల 24, డిసెంబర్ 1వ తేదీల్లో కొల్లాం- మౌలాలి, నవంబర్ 18, 25 తేదీల్లో మచిలీపట్నం-కొల్లాం, నవంబర్ 20, 27 తేదీల్లో కొల్లాం-మచిలీపట్నం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే పేర్కొంది. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

## చట్ట సవరణ చేసైనా.. ఆ ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయాలి: సోమిరెడ్డి



**అమరావతి:** అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేల సభ్యత్వాలను అవసరమైతే చట్ట సవరణ చేసైనా రద్దు చేయాలని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు సభలో ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. "ఓ విద్యార్థి కొన్ని రోజులు పాఠశాలకు వెళ్లకపోతే ఉపాధ్యాయులు మందలిస్తారు. కనీసం పరీక్షలకు కూడా రాకపోతే డిబార్ చేస్తారు. అసెంబ్లీకి మేం రాం అని సభ్యులు చెప్పిన తర్వాత వారిపై ఏదో ఒక చర్య తీసుకోవాలి" అని కోరారు.

## బెల్లంకొండ - ఎర్రబాలెం కాలువకు గండి. 70 ఎకరాల పంట నీటిపాలు



బెల్లంకొండ మండలం: పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామం బెల్లంకొండ - ఎర్రబాలెం మేజర్ కాలువకు రాత్రి కురిసిన వర్షానికి గండి పడింది. దీంతో సుమారు 70 ఎకరాలు వరి పంట పూర్తిగా మునిగిపోయింది. కోత దశలో ఉన్న పొలాలు పూర్తిగా నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ. లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టామని, కోత దశలో పంట చేతికి రాకపోవడంతో వారి బాధ వర్ణాతీతమైంది. అధికారుల నిర్లక్ష్యంతోనే తమ పంటలు మొత్తం మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వరి నార్లు వేసిన సమయంలో కూడా ఇదే కాలువకు గండిపడి వరి నారు దిబ్బలు మొత్తం మునిగిపోతే తిరిగి మళ్లీ అదనపు భారమైన వరి నారు తెచ్చుకొని పంటలు వేసుకున్నామని వాపోయారు.ప్రభుత్వం వారినిఆదుకోవాలని ఆవేదన చెందుతున్నారు.



# టీమ్‌ఇండియా ఊచకోత..

### దక్షిణాఫ్రికా టార్గెట్ 284

**జొహాన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న చివరి టీ20లో టీమ్‌ఇండియా దుమ్మురేపింది. తిలక్‌వర్మ (120*; 47 బంతులు; 10 సిక్స్‌లు; 9 ఫోర్లు), సంజు శాంసన్ (109*; 56 బంతుల్లో; 8 సిక్స్‌లు; 6 ఫోర్లు) శతకాలతో దక్షిణాఫ్రికా బౌలర్లను ఊచకోత కోశారు. అభిషేక్ శర్మ (36) రాణించాడు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లకు వికెట్ నష్టానికి 283 పరుగులు చేసింది. టీ20ల్లో ఇది భారత్‌కు రెండో అత్యధిక స్కోర్. గతనెలలో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో (297/6) అత్యధిక స్కోర్ చేసింది. దక్షిణాఫ్రికాపై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. కాగా ఈ మ్యాచ్‌లో పలు రికార్డులు బద్దలయ్యాయి.ఒకే ఇన్నింగ్స్‌లో భారత్ తరఫున ఇద్దరు శతకాలు చేసిన వీరులుగా నిలిచిన శాంసన్, తిలక్ వర్మ. టీ20 చరిత్రలో ఒకే ఏడాదిలో మూడు సెంచరీలు చేసిన సంజూ. ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు 23 నమోదయ్యాయి.అత్యధిక భాగస్వామ్యం 203 పరుగులు.

### పీఓకేలో

# ఛాంపియన్స్ ట్రోఫీ టూర్ రద్దు




**లండన్:** ఛాంపియన్స్ ట్రోఫీ టూర్ విషయంలో పాక్ కుటిల యత్నాలకు ఐసీసీ చెక్ పెట్టింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో ఆ దేశ క్రికెట్ బోర్డు నిర్వహించ తలపెట్టిన ఛాంపియన్స్ ట్రోఫీ టూర్‌ను రద్దు చేసింది. ఈ విషయంలో ఐసీసీని బీసీసీఐ సంప్రదించడంతో వెంటనే ఈ నిర్ణయం తీసుకుంది.వచ్చే ఏడాది జరగాల్సిన ఛాంపియన్స్ ట్రోఫీకి అధికారిక షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి ఇంకా ప్రకటించనప్పటికీ.. ట్రోఫీ టూర్‌ను మాత్రం మొదలు పెట్టింది. ఇందులో భాగంగా కప్పును తొలుత పాకిస్థాన్‌కు పంపింది. దీంతో పాక్ క్రికెట్ బోర్డు టూర్ షెడ్యూల్‌ను తాజాగా ప్రకటించింది. నవంబరు 16న ఇస్లామాబాద్ నుంచి ఈ ట్రోఫీ టూర్ ప్రారంభం కానుంది. అయితే, షెడ్యూల్‌లో పీఓకేలో ఉన్న స్కర్దు, హుంజా, ముజఫరాబాద్ ప్రాంతాలను కూడా పాక్ చేర్చింది. భారత్‌ను కవ్వించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దాయాది దేశంలో టీమ్‌ఇండియా పర్యటించేది లేదని బీసీసీఐ స్పష్టం చేసిన నేపథ్యంలో పాక్ ఈ రూపంలో తన వక్ర బుద్ధిని బయటపెట్టింది.

# ఫేస్‌బుక్‌పై భారీ పెనాల్టీ

### 800 మి.యూరోలు విధించిన ఈయూ



**లండన్:** ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాపై యూరోపియన్ యూనియన్(ఈయూ) నియంత్రణాధికార సంస్థ దాదాపు 800 మిలియన్ యూరోల అపరాధ రుసుమును విధించింది. మెటా తన మార్కెట్ గుత్తాధిపత్యాన్ని వినియోగించుకుని ఆన్‌లైన్ క్లాసిఫైడ్ యాడ్స్ వ్యాపారంలో 'పోటీ వ్యతిరేక ధోరణుల'ను అవలంబించిందని యూరోపియన్ కమిషన్ ఈ సందర్భంగా పేర్కొంది. దీర్ఘకాలం పాటు కొనసాగిన దర్యాప్తు అనంతరం 797.72 మి.యూరోల (841 మి.డాలర్ల) పెనాల్టీని విధించినట్లు వివరించింది. ఫేస్‌బుక్ వినియోగదార్లకు అవసరం ఉన్నా.. లేకున్నా.. ఆటోమేటిక్‌గా వ్యాపార ప్రకటనలను జొప్పించిందని ఆరోపించింది. అలాగే ఇతర పోటీదార్ల యాడ్ సంబంధిత సమాచారాన్ని ఉపయోగించుకుని, సహేతుకం కాని ధోరణులను అవలంబించిందనీ పేర్కొంది. కాగా, పోటీదార్లకు కానీ, వినియోగదార్లకు కానీ పోటీపరంగా హాని కలిగించినట్లు నిరూపించడంలో కమిషన్ విఫలమైందని, ఈ నిర్ణయంపై అప్పీలుకు వెళ్లనున్నట్లు మెటా తెలిపింది.

# ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు రాయితీ..

### మార్గదర్శకాలు జారీ




**విశ్వంభర, అమరావతి:** ఆర్టీసీ బస్సుల్లో వృద్ధుల ప్రయాణానికి రాయితీ టికెట్ల జారీకి పాటించాల్సిన నిబంధనలకు సంబంధించి సిబ్బందికి ఏపీఎస్ఆర్టీసీ మరోసారి మార్గదర్శకాలు జారీ చేసింది. అన్ని జిల్లాల డీపీటీవో, ఈడీలకు ఆర్టీసీ ఆపరేషన్స్ ఈడీ అప్పలరాజు ఆదేశాలు జారీ చేశారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులకు బస్సుల్లో ప్రయాణానికి టికెట్ ధరలో 25 శాతం రాయితీని ఆర్టీసీ ఎప్పటినుంచో కల్పిస్తోంది. టికెట్లు జారీ చేసే సమయంలో వయసు నిర్ధరణ కోసం గుర్తింపు కార్డులు చూపించే విషయమై సిబ్బందికి, వృద్ధులకు మధ్య బస్సుల్లో వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆధార్‌కార్డ్ ఒరిజినల్ ఉంటేనే సిబ్బంది టికెట్లు జారీ చేస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఇతర కార్డులను అంగీకరించడం లేదు.
ఒరిజినల్ లేనప్పుడు డిజిటల్ కార్డులు చూపించవచ్చని తెలిపినా.. అవగాహన లేమితో టికెట్ల జారీకి నిరాకరిస్తున్నారు. దీనిపై పలు ప్రాంతాల నుంచి వృద్ధులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో రాయితీ టికెట్ల జారీ కోసం పాటించాల్సిన నియమ నిబంధనలను తెలియజేస్తూ సిబ్బందికి తాజాగా మరోసారి ఆదేశాలిచ్చింది. వృద్ధులు తమ ఆధార్ కార్డు లేదా సీనియర్ సిటిజన్ ఐడీ కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, రేషన్ కార్డుల్లో ఏదో ఒకటి చూపించి రాయితీ పొందవచ్చని స్పష్టం చేసింది. ఒరిజినల్ గుర్తింపు కార్డు లేకపోతే.. ఫోన్‌లో డిజిటల్ గుర్తింపు కార్డులు చూపించినా రాయితీ టికెట్ జారీ చేయాలని సిబ్బందిని ఆర్టీసీ ఆదేశించింది. ప్రాంతం, రాష్ట్రంతో సంబంధం లేకుండా అందరికీ, అన్ని బస్సుల్లో వృద్ధులకు రాయితీ టికెట్లు ఇవ్వాలని సిబ్బందికి యాజమాన్యం స్పష్టం చేసింది.

# హెచ్‌సీఏ టీ20 లీగ్ విజేత ఉమ్మడి జిల్లా జట్టు

- జట్టుకి అభినందనలు తెలిపిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు
- త్వరలోనే జిల్లాల్లో క్రికెట్ అకాడమీలు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏ డివిజన్ టీ20 లీగ్ టోర్నమెంట్లో ఉమ్మడి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 7వ తారీఖున ప్రారంభమైన ఈ లీగ్ లో మొత్తం 22 జట్లు పాల్గొనగా, ఇందులో తుది మ్యాచ్‌కి మారేడ్పల్లి కల్ట్స్, ఉమ్మడి జిల్లాల జట్టు అర్హత పొందగా, నేడు జింఖానా మైదానం వేదికగా జరిగిన తుది మ్యాచ్‌లో ఉమ్మడి జిల్లాల జట్టు విజయం సాధించింది.
ఈ సందర్భంగా విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టును హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు అరిశనపల్లి జగన్మోహన్ రావు, హెచ్ సీఏ కార్యవర్గ సభ్యులు, కరీంనగర్, వరంగల్, మహబూబ్ నగర్ జిల్లాల సెక్రెటరీలు ఆగం రావు, శ్రీనివాస్, రాజశేఖర్, సీనియర్ క్లబ్ సెక్రెటరీ రవి కుమార్‌లు అభినందించారు. ఇలాగే ముమ్ముందు జరగబోయే అన్ని మ్యాచుల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే తాము ఎల్లప్పుడూ ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తామని, వారికి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి జిల్లాకి హైదరాబాద్లోని జింఖానా వేదికగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ అకాడమీ తరహాలోనే ఏర్పాటు చేయబోతున్నామని, ముమ్ముందు జిల్లాల్లో క్రీడా వసతులు మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.




# ఐపీఎల్ 2025 మెగా వేలం..

### 574మందితో షార్ట్ లిస్ట్

**ముంబయి:** ఐపీఎల్ 2025 మెగా వేలానికి సంబంధించిన కీలక అప్‌డేట్ వచ్చింది. వేలంలో పాల్గొనడానికి 1,574 మంది క్రికెటర్లు తమ పేర్లు నమోదు చేసుకోగా.. వారిలో 574 మందిని షార్ట్‌లిస్ట్ చేశారు. ఈ వివరాలను ఐపీఎల్ తన సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. మెగా వేలాన్ని నవంబర్ 24, 25వ తేదీల్లో జెడ్డా (సౌదీ అరేబియా)లో నిర్వహించనున్నారు. నవంబర్ 24న భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ప్రారంభం కానుంది. గతంలో వేలం నిర్వాహకురాలిగా మల్లికా సాగర్ వ్యవహరించగా.. ఈ సారి కూడా ఆమె నిర్వహించే అవకాశముంది.
భారత క్యాప్‌డ్ ప్లేయర్లు 48, విదేశీ క్యాప్‌డ్ ప్లేయర్లు 193, అన్‌క్యాప్‌డ్ భారత ఆటగాళ్లు 318, విదేశీ అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు 12, అసోసియేట్ దేశాలకు చెందిన ముగ్గురు ఆటగాళ్లు వేలంలో పాల్గొననున్నారు.
కనీస ధర రూ.2 కోట్లు ఉన్న ఆటగాళ్లు 81 మంది కాగా.. బేస్ ధర రూ.1.50 కోట్లు ఉన్న ప్లేయర్లు 27 మంది.
అత్యధికంగా 320 మంది ఆటగాళ్లు కనీస ధర రూ.30 లక్షలతో వేలం బరిలో నిలిచారు.
తొలి సెట్‌లో జోస్ బట్లర్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, కగిసో రబాడ, అర్ష్‌దీప్ సింగ్, మిచెల్ స్టార్క్ ఉన్నారు.సెట్ 2లో యుజ్వేంద్ర చాహల్, లివింగ్‌స్టోన్, డేవిడ్




మిల్లర్, కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, షమిలకు చోటు దక్కింది.సెట్ 3లో హ్యారీ బ్రూక్, డేవాన్ కాన్వే, జేక్ ఫ్రేజర్, మార్‌క్రమ్, దేవదత్ పడిక్కల్, రాహుల్ త్రిపాఠి, డేవిడ్ వార్నర్ ఉన్నారు.

# లాస్ ఏంజిలెస్‌లో మాకు క్రికెట్ వేదికలు లేవు

### ఒలింపిక్స్ ఛైర్మన్ వాసర్‌మెన్

**లాస్ ఏంజిలెస్:** లాస్ ఏంజెల్స్ వేదికగా 2028 ఒలింపిక్ గేమ్స్ జరగనున్నాయి. దాదాపు 128 ఏళ్ల తర్వాత క్రికెట్‌కు చోటు లభించింది. చివరిసారిగా 1900లో క్రికెట్ జరిగింది. అయితే, లాస్ ఏంజిలెస్‌లో క్రికెట్ ఆడేందుకు సరైన మైదానాలు అందుబాటులో లేవనే కారణంతో మ్యాచ్‌లను న్యూయార్క్‌లో నిర్వహించేందుకు ఒలింపిక్స్ కమిటీ నిర్వాహకులు చూస్తున్నారు. లాస్ ఏంజిలెస్ న్యూయార్క్‌కు మధ్య దాదాపు 3వేల మైళ్ల దూరం ఉంటుంది. ఈ విషయంపై లాస్ ఏంజిలెస్ ఒలింపిక్స్ ఛైర్మన్ వాసర్‌మెన్ స్పందించారు.
''లాస్ ఏంజిలెస్‌లో మాకు క్రికెట్ వేదికలు లేవు. అందుకోసం సరైన ప్రాంతాలను అన్వేషించాల్సి ఉంది. క్రికెట్ మ్యాచ్‌లు మరింత విజయం సాధించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. ఒకవేళ లాస్ ఏంజిలెస్‌లోనే మంచి మైదానాలు దొరికితే.. ఇక్కడే నిర్వహిస్తాం. అలా సాధ్యం కానిపక్షంలో ఉత్తమ ప్రాంతానికి మ్యాచ్‌లను తరలిస్తాం'' అని కాసే వాసర్‌మన్ వెల్లడించారు. టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు కొన్ని న్యూయార్క్ వేదికగా జరిగాయి. ప్రేక్షకాదరణ పొందాయి. దీంతో ఒలింపిక్ అధికారులు ఇప్పటికే న్యూయార్క్ స్టేడియం మేనేజ్‌మెంట్‌తో సంప్రదింపులు జరిపారు. క్రికెట్‌ను మాత్రమే కాకుండా.. సాఫ్ట్ బాల్, కానోయ్‌ను కూడా దాదాపు 1,300 మైళ్ల దూరంలోని ఓక్లాహోమాలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.




ట్రంప్‌నకు శుభాకాంక్షలు..
అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన సందర్భంగా ఆయనకు ఒలింపిక్స్ కమిటీ శుభాకాంక్షలు తెలిపింది. అదే సమయంలో రాజకీయాలకు అతీతంగా క్రీడల నిర్వహణకు మద్దతుగా నిలవాలని ఛైర్మన్ కాసే వాసెర్‌మన్ కోరారు. లాస్ ఏంజిలెస్‌కు ఒలింపిక్ గేమ్స్ నిర్వహణ అవకాశం వచ్చినప్పుడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ అతిథ్య హక్కులు 2017లో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ లాస్ఏంజిలెస్‌కు అప్పగించింది.

# కంప్యూటర్ కంట్రోల్‌కు కృత్రిమ మేధ ఏజెంట్..

### మరో సంచలనానికి సిద్ధమవుతున్న ఓపెన్ ఏఐ

**విశ్వంభర (బిజినెస్) :** డిజిటల్ యుగంలో పెనుమార్పులు తీసుకొచ్చిన కృత్రిమ మేధ .. చిటికెలో సమాధానాలు ఇస్తూ యూజర్లను ఆశ్చర్యపరుస్తోంది. ఓపెన్‌ఏఐ వంటి సంస్థలు తీసుకొచ్చిన చాట్ బాట్‌లు సంచలనం సృష్టించాయి. ఈ సేవల్ని మరింత మెరుగ్గా అందించేందుకు ఏఐ ఏజెంట్లు వస్తున్నాయి. చాట్‌జీపీటీ మాతృసంస్థ వీటిని పరిచయం చేసేందుకు సిద్ధమవుతోంది. ఈమేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. త్వరలో రానున్న ఈ ఏజెంట్లు మన పనుల్ని మరింత సులభతరం చేయనున్నట్లు తెలుస్తోంది.
కంప్యూటర్ సిస్టమ్‌లోని టాస్క్‌లను వేగంగా పూర్తిచేసేందుకు త్వరలోనే ఏఐ ఏజెంట్లను తీసుకురావాలని ఓపెన్ ఏఐ యోచిస్తోంది. దీనికోసం కంపెనీ అనేక సంబంధిత రీసెర్చ్ ప్రాజెక్టులపై పని చేస్తున్నట్లు తెలుస్తోంది. డెవలపర్ల కోసం రీసెర్చ్ ప్రివ్యూగా ఏఐ ఏజెంట్లు 2025 జనవరి నాటికి అందుబాటులోకి తీసుకురానుంది.



#### అసలు ఎవరీ ఏఐ ఏజెంట్లు..?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తర్వాత ఎక్కువగా వినిపిస్తున్న పేరు ఏఐ ఏజెంట్స్. అయితే చాలామంది ఏఐ ఏజెంట్స్ కూడా చాట్‌బాట్స్ వంటివేనని చాలామంది పొరపడుతుంటారు. ఇవి చాలా విభిన్నం. చాట్‌బాట్ అనేది మామూలు ఏఐ బాట్. ఇది యూజర్ల ప్రశ్నలకు మాత్రమే స్పందిస్తుంది. తన పరిధిని దాటి నిర్ణయాలు తీసుకోలేదు. ఏఐ ఏజెంట్ అలా కాదు. ఇది ప్రశ్నల ఉద్దేశాన్ని, సందర్భాన్ని కూడా అర్థం చేసుకుంటుంది. స్వేచ్ఛగా ఆలోచిస్తుంది. నిర్ణయాలు తీసుకునే యంత్రాంగం సాయంతో ఉత్తమమైన పద్ధతిలో ప్రతిస్పందిస్తుంది. ఉదాహరణకు ఫలానా పీఎన్ఆర్ నంబరుతో కూడిన విమానం టికెట్‌ను క్యాన్సిల్ చేస్తే ఎంత రుసుము పడుతుంది? అని అడిగితే చాట్‌బాట్ సమాధానం చెప్పలేదు. కానీ ఏఐ ఏజెంట్ అయితే కచ్చితమైన వివరాలను సంగ్రహించి, పూర్తి సమాధానాన్ని ఇస్తుంది. కస్టమర్లకు నిజంగా మనుషులతో వ్యవహరిస్తున్నామనే భావన కలిగి ఉండటం కారణంగా కచ్చితత్వం, వేగంగా పనుల్ని పూర్తి చేయగలదు. ఇలా కంప్యూటర్‌లో పనులను పూర్తిచేయగల ఏఐ ఏజెంట్లను ఓపెన్‌ఏఐ అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏఐ ఏజెంట్లు కోట్ రాయడం, టికెట్ బుకింగ్ చేయడం.. వంటి క్లిష్టమైన పనులను సులభంగా చేసేస్తాయట. రానున్న ఏడాదిలో ఏఐ ఏజెంట్లను తీసుకురానున్నట్లు ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ (Sam Altman) ఇటీవలే ఓ సందర్భంలో వెల్లడించారు.

# కొందరు పుట్టుకతో బాబుకు వీర విధేయులమని అంటున్నారు

### ట్విట్టర్‌లో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

**విశ్వంభర, అమరావతి:** టీడీపీ నేతలపై వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. కొందరు తాము పుట్టుకతోనే చంద్రబాబుకు విధేయులమని చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. అలా చెప్పుకోవడం సిగ్గు చేటు అని, ప్రజలను వంచించడమే అని అన్నారు. వాళ్లంతా ఒకప్పుడు ఎన్టీఆర్‌లక్ష్మీ పార్వతికి సన్నిహితులు అనేది వాస్తవం, చారిత్రక పరిణామమని అన్నారు. ఇది దాచేస్తే దాగని, మార్చలేని సత్యమని స్పష్టం చేశారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా విరుచుకుపడ్డారు. నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు వీర విధేయుల్లో కొందరు 30 ఏళ్ల నాటి ఎన్టీఆర్-లక్ష్మీ పార్వతికి అత్యంత సన్నిహితులనేది వాస్తవం, చారిత్రక పరిణామం అని విజయసాయి రెడ్డి అన్నారు. ఇది దాచేస్తే దాగని, మార్చలేని సత్యమని తెలిపారు. వీరు 199496 కాలంలో ఫిరాయింపుదారులు అన్న విషయం ప్రజలకు, మీడియాకు గుర్తుండదు అని అనుకోవడం వారి అజ్ఞానమని విమర్శించారు. తాము పుట్టుకతోనే చంద్రబాబుకు విధేయులమని వారు చెప్పుకోవడం సిగ్గుచేటు అని విజయసాయి రెడ్డి అన్నారు. అది ప్రజలని వంచించడమే అని పేర్కొన్నారు. అప్పుడు ఎన్టీఆర్‌లక్ష్మీపార్వతికి సన్నిహితంగా ఉన్న వాళ్లలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి, దాడి వీరభద్రరావు, మాకినేని పెదరత్తయ్య, కె.ప్రతిభా భారతి, కిమిడి కళావెంకటరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, గాలి ముద్దుకృష్ణమ నాయుడు, చిక్కాల రామచంద్రరావు, పరిటాల రవి, గాదె లింగప్ప, ముక్కు కాశి రెడ్డి, గౌతు శివాజీ, గద్దె బాబు రావు ఉన్నారని తెలిపారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటుపొడిచి బహిష్కరణకు గురియైన వాళ్లలో చంద్రబాబు, యనమల రామకృష్ణుడు, అశోకగజపతి రాజు ఉన్నారని చెప్పారు. ఈ నేతల్లో 90 శాతానికి పైగా ఎన్టీఆర్ మరణించాక, 1996 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్టీఆర్ టీడీపీ (ఎల్‌పీ) ఒక్క సీటూ దక్కించుకోకపోవడంతో గుట్టుచప్పుడు కాకుండా చంద్రబాబు పార్టీలో చేరారని గుర్తుచేశారు.



# 'పని గంటల'పై తుదివరకు నాది అదే మాట

### : ఇన్ఫీ నారాయణమూర్తి

**ముంబయి:** భారతీయులు శ్రమించి పనిచేస్తేనే దేశం ముందుకుపోతుందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి పేర్కొన్నారు. వారానికి ఆరు పని దినాల విధానానికే తుదివరకు తన మద్దతు ఉంటుందని తేల్చి చెప్పారు. ఆయన సీఎన్‌బీసీ గ్లోబల్ లీడర్‌షిప్ సదస్సులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ''నన్ను క్షమించండి. నేను నా భావాలను మార్చుకోలేను. నా తుది వరకు దీనికి నేను కట్టుబడి ఉంటాను. ప్రధాని మోదీ తీవ్రంగా శ్రమిస్తున్నారు. మనం కూడా అలానే కష్టపడటమే అతనికి మనం ఇచ్చే గౌరవం. భారత్ వృద్ధి త్యాగాలు, ప్రయత్నాలపైనే ఆధారపడి ఉంటుంది కానీ.. సౌకర్యాలు, విశ్రాంతిపై కాదు. బలమైన పని విలువలు లేని దేశం.. ప్రపంచ స్థాయిలో పోటీపడటంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది'' అని ఆయన పేర్కొన్నారు.
నేను 14 గంటలు పనిచేశాను..
ఈసందర్భంగా నారాయణమూర్తి తన కెరీర్‌లో పడిన శ్రమను వివరించారు. తాను రోజుకు 14గంటల చొప్పున వారానికి ఆరున్నర రోజులు పని చేసేవాడినని పేర్కొన్నారు. ఉదయం 6.30 గంటలకే ఆఫీసుకు చేరుకునే తాను రొటీన్‌గా రాత్రి 8.40కు పని ముగించేవాడినని వివరించారు. తాను ఆ రకంగా కష్టపడి పనిచేయడానికి గర్విస్తానని పేర్కొన్నారు. శ్రమించడం అనేది వ్యక్తిగత ఎంపిక కాదని.. చదువుకున్న ప్రతిఒక్కరి బాధ్యత అని నారాయణమూర్తి పేర్కొన్నారు. భారత్‌లో దీనికి చాలా మినహాయింపులు ఉన్నాయన్నారు. అంకితభావంతో పనిచేయడమనేది భారతీయ సంస్కృతి అని తెలిపారు.
కొన్నాళ్ల క్రితం నారాయణమూర్తి ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత్‌లో మిలీనియల్స్ వారానికి 70 గంటలు శ్రమించాలని చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దీనిపై ఆయన తీవ్ర విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ప్రతిభ, తెలివితేటలతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ శ్రమించడమే దేశానికి అవసరమన్నారు.
రెండో ప్రపంచయుద్ధం తర్వాత జర్మనీ, జపాన్ ఆర్థికంగా చితికిపోయాయి. దీంతో అక్కడి ప్రజలు తీవ్రస్థాయిలో శ్రమించి తిరిగి తమ ఆర్థికవ్యవస్థలను ప్రపంచంలోనే టాప్‌లోకి తీసుకొచ్చారు. అలా శ్రమించి ఇక్కడి ఉద్యోగులు భారత్‌ను ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని నారాయణమూర్తి గతంలో పేర్కొన్నారు. లక్ష్యానికి కట్టుబడి శ్రమించే ఉద్యోగులు ఉంటే అవి ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతాయో అన్నది ఈ దేశాలు నిరూపించాయని ఆయన తెలిపారు. శ్రమకు ఎటువంటి ప్రత్యామ్నాయం లేదని ఆయన బలంగా విశ్వసిస్తారు.

### తెలుగు రాష్ట్రాల నుంచి

# శబరిమలకు 8 ప్రత్యేక రైళ్లు..

### ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే

**విశ్వంభర, హైదరాబాద్:** శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. శబరిమల క్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాలను కలుపుతూ 8 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఈ నెల 22, 29 తేదీల్లో మౌలాలి(హైదరాబాద్)కొల్లాం, ఈనెల 24, డిసెంబర్ 1వ తేదీల్లో కొల్లాం మౌలాలి, నవంబర్ 18, 25 తేదీల్లో మచిలీపట్నంకొల్లాం, నవంబర్ 20, 27 తేదీల్లో కొల్లాం మచిలీపట్నం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే పేర్కొంది. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

# లాహోర్‌లో తీవ్రంగా కాలుష్యం

### నగరమంతా వ్యాపించిన నల్లటి పొగలు

### 1900 దాటిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్

**లాహోర్:** పొరుగు దేశం పాకిస్థాన్‌లోని లాహోర్ నగరంలో కాలుష్యం అత్యంత తీవ్రమైంది. లాహోర్ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా మారింది. నగరం అంతటా నల్లటి విషపు పొగలు వ్యాపించాయి. దాంతో అక్కడ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 1900 దాటింది. జనజీవనం అస్తవ్యస్తమైంది. నగరానికి చెందిన సుమారు 15 వేల మంది రోగులు ఉబ్బసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఇతర శ్వాసకోశ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరారు. లాహోర్‌లోని ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో ప్రభుత్వానికి ఆరోగ్య నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. కాలుష్యంపై తక్షణ చర్యలు తీసుకోకుంటే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు. కాలుష్యానికి సంబంధించిన ప్రధాన కారణాలను గుర్తించి వాటిని పూర్తిగా నియంత్రించాలని సూచిస్తున్నారు. ప్రజా రవాణాను ఉపయోగించేలా ప్రజలను ప్రోత్సహించాలని, ప్రైవేట్ వాహనాల సంఖ్యను తగ్గించాలని చెబుతున్నారు.
లాహోర్‌లోని పలు ఆస్పత్రులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, పొడి దగ్గు, న్యుమోనియా, తీవ్రమైన గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులతో కిక్కిరిసి ఉన్నాయి. మాయో ఆస్పత్రిలో నాలుగు వేల మందికిపైగా రోగులు, జిన్నా ఆస్పత్రిలో 3,500 మందికిపైగా రోగులు, గంగారామ్ ఆస్పత్రిలో మూడు వేల మందికి పైగా రోగులు, చిల్డ్రన్స్ ఆస్పత్రిలో రెండు వేల మందికి పైగా రోగులు చేరారు. ఈ ప్రమాదకర వాతావరణంలో తీవ్రమైన గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## అమెరికా అందాల పోటీలో మెరిసిన చండూర్ అమ్మాయి



**విశ్వంభర, చండూరు :** అమెరికాలో ప్రవాస ఆంధ్రుల, భారతీయుల హవా రోజురోజుకు అద్భుతంగా పెరుగుతూ పోతుంది. అమెరికా రాజకీయాల్లో కూడా భారతీయుల ప్రాబల్యం పెరిగిపోతుంది. తాజాగా నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రానికి చెందిన బావండ్ల రిషిత అమెరికా అందాల పోటీల్లో గెలుపొంది మరోసారి తెలుగు వారి సత్తాను చాటి చెప్పింది. 202425 సంవత్సరానికి గాను నవంబర్ 11న వాషింగ్టన్‌లో జరిగిన మిస్ టీన్ ఇండియా డబ్ల్యూ ఏ, మిస్ ఫిలాంత్రఫీ యూనివర్స్ పోటీల్లో గెలుపొంది ఈ నెల 14 న అవార్డు అందుకున్నట్లు ఆమె తండ్రి బావండ్ల మాణిక్యం, తల్లి నాగలక్ష్మి తెలిపారు. భరతనాట్యం అరంగ్రేటంలోనే నిర్విరామంగా మూడు గంటలు ఆమె నాట్యం చేయటం పట్ల పలువురు ఆమెను అభినందించారు. కరాటేలో కూడా బ్లాక్ బెల్ట్ విభాగంలో ఆమె ప్రావిణ్యం సంపాదించినట్లు వారు పేర్కొన్నారు. బావండ్ల రామలచ్చయ్య, సత్తమ్మల మూడవ కుమారుడైన బావండ్ల మాణిక్యం పద్నాలుగు సంవత్సరాల క్రితం ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అమెరికాలో ఉంటూ భారతీయ సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ చండూరుకు చెందిన యువతి అమెరికా అందాల పోటీల్లో విజయం సాధించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 25న ఆమె చండూరు కు రానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## 'NBK109' సినిమా టైటిల్, టీజర్ విడుదల



నందమూరి అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'NBK109'. హ్యాట్రిక్ విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న 109వ చిత్రమిది. తన నటవిశ్వరూపంతో ఐదు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న బాలకృష్ణ, మరో అద్భుతమైన చిత్రంతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కేవలం ప్రకటనతోనే ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు విశేషంగా ఆకట్టుకొని, 'NBK109' పై అంచనాలను రెట్టింపు చేశాయి. ఇక ఇప్పుడు అందరూ ఎంతగానో ఎదుచూస్తున్న ఈ చిత్ర టైటిల్ టీజర్ విడుదలైంది.

కార్తీక పూర్ణిమ శుభ సందర్భంగా చిత్ర టైటిల్ ని ప్రకటించడంతో పాటు, టీజర్ ను విడుదల చేశారు నిర్మాతలు. ఈ సినిమాకి 'డాకు మహారాజ్' అనే శక్తివంతమైన టైటిల్ ను పెట్టారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ లోని ఏఎంబీ మాల్ లో 'NBK109' టీజర్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు దర్శకుడు బాబీ కొల్లి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ, సంగీత దర్శకుడు ఎస్. తమన్ హాజరయ్యారు.

96 సెకన్ల నిడివితో రూపొందిన 'డాకు మహారాజ్' టీజర్, టైటిల్ కి తగ్గట్టుగానే అద్భుతంగా ఉంది. "ఈ కథ రాజ్యం లేకుండా యుద్ధం చేసిన ఒక రాజుది, గండ్ర గొడ్డలి పట్టిన యమధర్మ రాజుది, మరణాన్ని వణికించిన మహారాజుది" అంటూ 'డాకు మహారాజ్'గా బాలకృష్ణను పరిచయం చేసిన తీరు అదిరిపోయింది. మునుపెన్నడూ చూడని సరికొత్త రూపంలో గుర్రంపై బాలకృష్ణ ఎంట్రీ ఇవ్వడం అభిమానులకు పూనకాలు తెప్పించేలా ఉంది. టీజర్ లోని ప్రతి ఫ్రేమ్ లో భారీతనం కనిపిస్తుంది. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. తమన్ నేపథ్య సంగీతం టీజర్ ని మరోస్థాయికి తీసుకెళ్లింది. మొత్తానికి టీజర్ చూస్తుంటే, బాలకృష్ణతో కలిసి దర్శకుడు బాబీ థియేటర్లలో ప్రేక్షకులను సరికొత్త అనుభూతిని అందించే భారీ యాక్షన్ ఎంటర్టైనర్ ను అందించడబోతున్నారని అర్థమవుతోంది.

టీజర్ విడుదల కార్యక్రమంలో దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ, " టీజర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. మీరు చూసిన టీజర్ లో డూపులు లేవు, డూప్లికేట్ లు లేవు. బాలకృష్ణ అన్నీ నిజంగా చేశారు. గుర్రం ఎక్కింది ఆయనే, నడిపింది ఆయనే, యుద్ధానికి వచ్చేది కూడా ఆయనే. మీరు చూసినవన్నీ ఒరిజినల్ షాట్స్. తమన్ అద్భుతమైన సంగీతం అందించారు. నేనైనా, నాగవంశీ గారైనా దీనిని ఎప్పుడూ సాధారణ సినిమాలా చూడలేదు. బాలయ్య సృష్టిస్తున్న రికార్డులను దృష్టిలో పెట్టుకొని, కేవలం మాస్ లోనే కాకుండా అన్ని వర్గాలలో ఆయనకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని, ఎప్పుడూ చూడని కొత్త బాలకృష్ణ గారిని చూపించాలని, సినిమా మొదటి నుంచి ఎంతో శ్రద్ధతో పని చేస్తూ వచ్చాము. టీజర్ లో మీరు చూసింది చాలా చాలా తక్కువ. సినిమా ఇంకా వేరే స్థాయిలో ఉంటుంది అన్నారు.

నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, "బాలకృష్ణ చాలా కొత్తగా చూపించాలని నేను, దర్శకుడు బాబీ ముందు నుంచి అనుకుంటున్నాం. టీజర్ లో మీరు చూసింది చాలా చిన్నది. సినిమాలో ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. థియేటర్లలో ఈ సినిమా అభిమానులకు అసలుసిసలైన పండుగలా ఉంటుంది." అన్నారు.

సంగీత దర్శకుడు ఎస్. తమన్ మాట్లాడుతూ, "బాబీ చాలా గొప్ప సినిమా తీశారు. బాలయ్యతో ఇది నా ఐదవ సినిమా. ఆయనతో పని చేయడం సంతోషంగా ఉంది. సినిమా ఏదైతే కోరుకుంటుందో, దానికి తగ్గట్టుగా సంగీతం అందిస్తున్నాను. ఈ సినిమా అద్భుతంగా ఉంటుంది." అన్నారు.

'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి కానుకగా 2025, జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ ఛాయాగ్రాహకుడు విజయ్ కార్తీక్ కన్నన్ కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కళా దర్శకుడిగా అవినాష్ కొల్లా, ఎడిటర్ గా నిరంజన్ దేవరమానే వ్యవహరిస్తున్నారు.

## అలా మొదలైన ప్రేమకథ!



అగ్ర నాయిక నయనతారను ఆమె అభిమానులు లేడీ సూపర్‌స్టార్ అని గర్వంగా పిలుచుకుంటారు. బుల్లితెర ప్రయోక్తగా కెరీర్‌ను మొదలుపెట్టి అగ్ర కథానాయికగా ఎదిగిన ఆమె ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఈ నేపథ్యంలో 'నయనతార: బీయాండ్ ది ఫెయిరీటేల్' పేరుతో ఆమె విజయవంతమైన సినీ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రూపొందిన డాక్యుమెంటరీ త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఇందులో ఆమె వ్యక్తిగత, సినీ జర్నీకి సంబంధించిన అనేక ఆసక్తికరమైన అంశాలను పొందుపరిచారు. తమిళ దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో నయనతార ప్రేమాయణం, పెళ్లి వరకు సాగిన వారి ప్రయాణాన్ని కూడా ఈ డాక్యుమెంటరీలో వివరించారని తెలిసింది. ఈ సందర్భంగా విఘ్నేష్ శివన్‌తో తాను ప్రేమలో పడిన క్షణాలను నయనతార గుర్తు చేసుకుంది. విఘ్నేష్‌శివన్ దర్శకత్వం వహించిన 'నానుమ్ రౌడీదాన్' (2015) సెట్స్‌లో తొలిసారి వీరిద్దరూ కలుసుకున్నారు. నయనతార మాట్లాడుతూ 'పాండిచ్చేరిలోని ఓ మారుమూల ప్రాంతంలో షూటింగ్ పెట్టారు. విజయ్ సేతుపతి మీద సీన్స్ షూట్ చేస్తున్నారు. అప్పడే నేను దూరంగా విఘ్నేష్ శివన్‌ను గమనించా. మోముపై చెరగని చిరునవ్వు, సన్నివేశాన్ని వివరించే శైలి, దర్శకుడిగా అతని ప్రత్యేకమైన పనితీరు నన్ను ఆకట్టుకుంది. ఆ క్షణంలోనే అతని ప్రేమలో పడిపోయా' అని నయనతార చెప్పింది. దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ ప్రేమాయణం అనంతరం 2022 జూన్ 9న ఈ జంట వివాహం చేసుకున్నారు. ఈ దంపతులు సరోగసీ విధానం ద్వారా ఉయిర్, ఉలగం అనే కవల పిల్లలకు తల్లిదండ్రులయ్యారు.

## దేశభక్తిని అలవర్చుకునేలా"అభినవ్ " రూపొందించాం

"ఆదిత్య", "విక్కీస్ డ్రీమ్", "డాక్టర్ గౌతమ్" వంటి సందేశాత్మక బాలల చిత్రాలతో పసి మనసుల్లో మంచి నాటే ప్రయత్నం చేసి ఎంతోమంది పిల్లల, తల్లిదండ్రుల ప్రశంసలతో పాటు జాతీయ అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు దర్శక నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్. ఆయన శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో సంతోష్ ఫిలిమ్స్ బ్యానర్ పై రూపొందిస్తున్న మరో బాలల లఘు చిత్రం "అభినవ్ . ఈ చిత్రంలో సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్, గీతా గోవింద్, అభినవ్, చరణ్, బేబీ అక్షర కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా పాత్రికేయ సమావేశాన్ని తాజాగా హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ పిల్లల్లో చిన్నప్పటి నుంచే దేశభక్తిని రూపొందించాలనే లక్ష్యంతో ఈ సినిమాను రూపొందించాను. విదేశాల్లో పిల్లలకు చిన్నప్పటి నుంచే దేశ రక్షణ విషయంలో అవగాహన కల్పించి, శిక్షణ ఇస్తుంటారు. అలా మన పిల్లలను కూడా తీర్చిదిద్దాలి. దురదృష్టవశాత్తూ పిల్లలు గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. దేశ రక్షణలో భాగం కాగలరు. ఇలాంటి స్ఫూర్తికరమైన అంశాలతో బాలలను గొప్ప మార్గంలో పయనించేలా ఉత్తేజపరుస్తూ "అభినవ్ చిత్రాన్ని రూపొందించాం. ఈ చిత్రాన్ని అన్ని ఫిలిం ఫెస్టివల్స్ కు పంపించాం. అలాగే నేషనల్ అవార్డ్స్ కు పంపిస్తున్నాం అన్నారు.

సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దర్శక నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ నేటి బాలలే రేపటి పౌరులు అనే విషయాన్ని గట్టిగా నమ్ముతారు. పిల్లలకు సినిమా మాధ్యమం ద్వారా మంచిని చెప్పి వారిని గొప్ప పౌరులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. "అభినవ్ వంటి గొప్ప సినిమాను రూపొందించిందుకు సుధాకర్ గౌడ్ గారికి నా అభినందనలు తెలియజేస్తున్నా. పిల్లల్లో స్ఫూర్తినింపే ఇలాంటి మరిన్ని చిత్రాలు సుధాకర్ గౌడ్ గారి ద్వారా రావాలని కోరుకుంటున్నా అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ప్రాజెక్ట్ ఛైర్మన్ విజయభాస్కర్ మాట్లాడుతూ మా రెడ్ క్రాస్ నుంచి యాంటీ నార్కొటిక్ సెమినార్స్ నిర్వహిస్తుంటాం. డ్రగ్స్ ద్వారా మన పిల్లల్ని పాడుచేయడం ఉగ్రవాద చర్యగానే భావించాలి. పిల్లలను సన్మార్గంలో పెట్టేలా భీమగాని సుధాకర్ గౌడ్ తన సినిమాల ద్వారా చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. "అభినవ్ " మంచి ఆదరణ పొందాలని కోరుకుంటున్నా అన్నారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ కమర్షియల్ కంటెంట్ తో సినిమాలు తీయడం సులువు. కానీ "అభినవ్ "లాంటి కంటెంట్ ను తెరపైకి తీసుకురావడం చాలా కష్టం. అలాంటి గొప్ప ప్రయత్నం చేస్తున్నారు సుధాకర్ గౌడ్ . ఈ చిత్రం ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి సుధాకర్ గౌడ్ గారికి ప్రశంసలు దక్కుతాయి అన్నారు.

సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీపూజ మాట్లాడుతూ నేను తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో తరుపున సెమినార్స్, వర్క్స్ చేస్తుంటాము. సుధాకర్ గౌడ్ ని నేను చిల్డ్రన్ ఫిలిం ఫెస్టివల్ టైమ్ లో ఐమ్యాక్స్ లో కలిశాను. ఆయన సినిమాల గురించి తెలిశాక మీరు డ్రగ్స్ ఎఫెక్ట్ గురించి మూవీ చేయొచ్చు కదా అని అడిగాను. ఆయన "అభినవ్ "సినిమా ఆ కాన్సెప్ట్ తోనే చేస్తున్నామని చెప్పారు. ఇలాంటి మంచి మూవీ చేసి ఎంతోమంది పిల్లల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్న సుధాకర్ గౌడ్ గారికి నా అభినందనలు అన్నారు.

## ఢిల్లీలో విశ్వకర్మ లీడర్ అవార్డ్స్ ప్రదానం

వివిధ రంగాల్లో తమ ప్రతిభను కనపరుస్తూ సామాజిక బాధ్యతతో ముందుకువెళుతూ విశ్వకర్మ సమాజానికి స్ఫూర్తివంతంగా నిలుస్తున్న విశ్వకర్మ కళాకారులకు విశ్వకర్మ లీడర్ అవార్డ్స్ ప్రధానోత్సవం జరిగింది. బుధవారం రాత్రి న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ లో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటెల రాజేందర్, మల్లు రవి, సిరికొండ మధుసూదనాచారి, తల్లోజు ఆచారి, విశ్వనాథుల పుష్పగిరి హాజరై విశ్వకర్మ ప్రతిభావంతులకు విశ్వకర్మ లీడర్ అవార్డ్స్ అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ చారి మాట్లాడుతూ అయోధ్య రాముని పాదుకలు, యాదాద్రి పుణ్యక్షేత్ర రూపశిల్పి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరాగాంధీ తదితర విగ్రహాలను అద్భుతంగా రూపం ఇచ్చిన శిల్ప కళాకారులను,సామాజిక బాధ్యతతో సినిమా రంగంలో ప్రతిభను చాటుతున్న కళాకారులను సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.సంధ్యారాగం లాంటి సామాజిక అంశంతో సినిమాను తెరకెక్కించిన దర్శకుడు శ్రీనివాస్ నేదునూరిని మధుసూదనాచారి, మల్లు రవి అభినందించారు. దర్శకుడు శ్రీనివాస్ నేదునూరి మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి రోజున ఈ విశిష్ట అవార్డుకు ఎంపిక చేసి ఉత్తమ దర్శకుడి అవార్డుతో సత్కరించినందుకు విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఫౌండర్ విశ్వనాదుల పుష్పగిరికి , అభినందించి ప్రోత్సహించిన రాజకీయ ఉద్దండులు ఈటెల రాజేందర్ కు, మల్లు రవికి, మధుసూదనాచారికి , గణేష్ చారికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రస్తుతం నాకు మోరల్ సపోర్ట్ ఇస్తూ ఎంతో ప్రోత్సహిస్తున్న మిత్రులు విజయ చిత్ర ఎడిటర్ , ప్రొడ్యూసర్ గుర్రపు విజయ కుమార్ కు, వంశీ టివి అధినేత



డాక్టర్ వంశీ కృష్ణ కు, జర్నలిస్ట్ జగదీష్‌సాగర్ కు, మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగుతో పాటు, హిందీలో ఇట్స్ మై లవ్ పేరుతో సంధ్యారాగం చిత్రం ప్రముఖ సంస్థ పెన్ మూవీస్ లో స్ట్రీమింగ్ అవుతూ విశేష ఆదరణ పొందుతుందని త్వరలో తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో డబ్ చేసే సన్నాహాలు జరుగుతున్నాయని దర్శకుడు శ్రీనివాస్ నేదునూరి అన్నారు.

దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో సుమారు 100 మంది కళాకారులకు అవార్డ్స్ ఇవ్వడం గొప్ప విషయమని, ఈ గొప్ప కార్యక్రమానికి పూనుకున్న విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి సేవలను గణేష్ చారి కొనియాడారు. అనేక సేవలందిస్తున్న విశ్వకర్మలు రాష్ట్రపతి చేతుల మీద పద్మభూషణ్ పద్మశ్రీలు అందుకున్నారని తెలిపారు.

## 28న ప్రేక్షకుల ముందుకు రానున్నఅనాథ

గోనేంద్ర ఫిలిమ్స్ పతాకంపై శ్రీ ఇంద్ర ,నికిత స్వామి, యుక్త పెర్వి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ "అనాథ". అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర హీరో కం నిర్మాత శ్రీ ఇంద్ర మాట్లాడుతూ, ఇది ఒక మంచి కమర్షియల్ యాక్షన్ అడ్వెంచర్ త్రిల్లర్. ఈ చిత్రంలో యూత్ కికావలసిన అన్ని అంశాలు ఉంటాయి. పర్టిక్యులర్ గా మ్యూజికల్ గా ఈ చిత్రం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. ఈ చిత్రంలో ఒక యూత్ కే కాకుండా సకుటుంబ సపరివార సమేతంగా చూసే విధంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దడం జరిగింది. అన్ని హంగులతో ఈ చిత్రాన్ని ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానునాం. ఈ చిత్రాన్ని చూసి ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం" అని అన్నారు.

## అత్యధిక వసూళ్లు సాధిస్తున్న కంగువ

స్టార్ హీరో సూర్య నటించిన ప్రెస్టీజియస్ మూవీ 'కంగువ'. ఈ చిత్రాన్ని భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ గా దర్శకుడు శివ రూపొందించారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో కనిపించారు. 'కంగువ' సినిమాను హ్యూజ్ బడ్జెట్ తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఈ సినిమాను నైజాం ఏరియాలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేశారు. 'కంగువ' సినిమా ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు రిలీజైన ప్రతి ఏరియా నుంచి సూపర్ హిట్ రెస్పాన్స్ వస్తోంది. ఈ నేపథ్యంలో 'కంగువ' సక్సెస్ హ్యాపీనెస్ ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో షేర్ చేసుకున్నారు బ్లాక్ బస్టర్ ప్రొడ్యూసర్ కేఈ జ్ఞానవేల్ రాజా.

'కంగువ' సినిమాకు మేము పడిన మూడేళ్ల కష్టానికి ఫలితంగా ప్రేక్షకులు ఘన విజయాన్ని అందించారు. మంచి చిత్రాలను ఆదరించడంలో తెలుగు ఆడియెన్స్ టేస్ట్ మరోసారి వెల్లడైంది. తమిళ్ కంటే తెలుగులో 'కంగువ'కు కలెక్షన్స్ వస్తున్నాయి. సూర్య గారి సినిమాల్లో టిల్ డేట్ హయ్యెస్ట్ కలెక్టెడ్ మూవీగా 'కంగువ' నిలుస్తుంది. తెలుగులో కలెక్షన్స్ బాగా పెరుగుతున్నాయి. మల్టీప్లెక్స్ లు హౌస్ ఫుల్ అవుతున్నాయి. డిస్ట్రిబ్యూట్ చేసిన మైత్రీ సంస్థ నుంచి మాకు సంతోషాన్నిచ్చేలా కలెక్షన్స్ నెంబర్స్ వస్తున్నాయి.

నార్త్ బెల్ట్ లో 'కంగువ' మంచి నెంబర్స్ చేస్తోంది. వీక్ డేస్ లో ఈ రేంజ్ కలెక్షన్స్ రావడం గుడ్ సైన్ అంటూ అక్కడి నుంచి బాక్సాఫీస్ రిపోర్ట్స్ వస్తున్నాయి. నార్త్ లో రిలీజైన అన్ని సౌత్ మూవీస్ లో 'కంగువ' బిగ్ ఓపెనింగ్స్ దక్కించుకుంటోంది. మా టీమ్ మెంబర్స్ థియేటర్స్ కు వెళ్లి ఆడియెన్స్ రెస్పాన్స్ చూసి హ్యాపీగా ఫీలవుతున్నారు.



ఈ మధ్య కాలంలో ఆడియెన్స్ బిగ్ స్కేల్ మూవీస్ చూసేందుకు బాగా ఇష్టపడుతున్నారు. 'కంగువ' లో మేము ఒక కొత్త వరల్డ్ బిల్డ్ చేశాం. హ్యూజ్ ప్రొడక్షన్ వ్యాల్యూస్, సీజీ వర్క్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ప్రొడక్షన్ వైజ్ హై క్వాలిటీతో ఉందనే అప్రిషియేషన్స్ రావడం ప్రొడ్యూసర్ గా నేను సంతోషించే విషయం. సినిమాను లైవ్ లొకేషన్స్ తో పాటు సెట్స్ వేసి చేశాం. అయితే టీమ్ అంతా ఒక యూనిటీగా వర్క్ చేయడం వల్ల పర్ఫెక్ట్ ఔట్ పుట్ వచ్చింది. నేను స్క్రీన్ మీద సినిమా చూస్తున్నప్పుడు ఏది సెట్, ఏది సీజీ అనేది గుర్తుపట్టలేకపోయాను.

మూవీ ప్రొడక్షన్ లో దర్శకుడు శివ గారు చాలా సపోర్ట్ చేశారు. ప్రొడక్షన్ టెన్షన్స్ నా మీద పడకుండా కొంత తగ్గించారు. ఆయన మూవీని కథ, పాత్రల్లోని జెన్యూనిటీ తగ్గకుండా, మరోవైపు కమర్షియల్ ఎలిమెంట్స్ తో మిక్స్ చేస్తూ అద్భుతంగా 'కంగువ'ను రూపొందించారు. క్లైమాక్స్ లో వచ్చే గెస్ట్ రోల్ ను సర్ ప్రైజ్ కోసం రివీల్ చేయలేదు. మేము అలా హైడ్ చేసి ఉంచడం వల్లే ఈరోజు థియేటర్స్ లో ఆడియెన్స్ థ్రిల్ అవుతున్నారు.

సూర్య చేసిన రెండు డిఫరెంట్ రోల్స్ కు మంచి అప్రిషియేషన్స్ వస్తున్నాయి. ఆయన ఈ మూవీ కోసం పడిన హార్డ్ వర్క్ స్క్రీన్ మీద కనిపించింది. సూర్య గారి నటనకు ప్రతి ఒక్కరూ ప్రశంసలు అందిస్తున్నారు. బాబీ డియోల్ పర్ఫార్మెన్స్ మరో హైలైట్ అని చెబుతున్నారు.

'కంగువ'కు దేవిశ్రీ ప్రసాద్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. బీజీఎం కూడా ది బెస్ట్ అందించారు. యోలో, ఫైర్ సాంగ్, నాయకా ..ఇలా ప్రతి సాంగ్ కు సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. బీజీఎం కొంత సౌండ్ ఎక్కువగా ఉందనే ఫీడ్ బ్యాక్ వచ్చింది. అది థియేటర్స్ లో రెండు పాయింట్స్ తగ్గిస్తున్నాం. లౌడ్ సౌండ్ టెక్నికల్ గా జరిగిన మిస్టేక్ గానీ దేవి తప్పేం లేదు. ఇదే కాదు 'కంగువ'కు వస్తున్న ప్రతి ఫీడ్ బ్యాక్ పాజిటివ్ గా తీసుకుంటున్నాం.

'కంగువ' 2 సినిమాలో దీపిక పదుకోన్ ను నాయికగా తీసుకుంటున్నామనే విషయంలో నిజం లేదు. ఇంకా ఆ మూవీ వర్క్స్ స్టార్ట్ చేయలేదు. డైరెక్టర్ శివ కు అజిత్ తో ఓ మూవీ చేయాల్సిన కమిట్ మెంట్ ఉంది. ఆ ప్రాజెక్ట్ అయ్యాక 'కంగువ' 2 వర్క్స్ బిగిన్ చేస్తాం. ఈ సినిమా ప్రమోషన్ కోసం నెల రోజులకు పైగా నిద్రలేకుండా వివిధ ప్రాంతాలకు ట్రావెలింగ్, ఈవెంట్స్ లో పాల్గొంటున్నాం. నేను చిన్న బ్రేక్ తీసుకున్న తర్వాత కొత్త స్క్రిప్ట్స్ వింటాను.

ప్రస్తుతం కార్తితో మా స్టూడియో గ్రీన్ లో చేస్తున్న వా వాతియర్ జనవరి చివరలో లేదా ఫిబ్రవరిలో రిలీజ్ చేస్తాం. ఆ సినిమా తర్వాత మా సంస్థలో చేసే కొత్త ప్రాజెక్ట్స్ ప్రకటిస్తాం.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com